ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

గుంటూరు

fb.com/vaartha Digital

Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

29-8-2026 శనివారం సంపుటి: 32 సంచిక: 210 పేజీలు: 12 వెల: 6.50

పోలీసుల సంక్షేమం లక్ష్యం 3లో

'ప్రమాణ్ కృత్రిమ మేథ ఆపరేటింగ్ సిస్టమ్' ఆవిష్కరణ

# భయం గుప్పిట్లోనే



- ఇంకా దిక్కుతోచని స్థితిలో నేపాల్‌లోని మూడు జిల్లాల ప్రజలు
- టిబెట్ సరిహద్దులో మరో సరస్సు కట్టలు తెగే ప్రమాదం
- ఆకస్మిక వరదల్లో 600కు చేరిన మృతులు
- 1600 మందిపైగా గల్లంతు
- ఢిల్లీకి క్షేమంగా చేరిన 21 మంది భారతీయులు



బాధిత ప్రాంతాల్లో హెలికాప్టర్ ద్వారా సహాయం అందిస్తున్న దృశ్యం



సురక్షితప్రాంతాలకు తరలుతున్న ప్రజలు

**కఠ్మాండు, ఆగస్టు 28:** నేపాల్‌లో సంభవించిన ఆకస్మిక వరదల్లో మృతి చెందిన వారి సంఖ్య 469కి చేరుకున్నట్లు ఆ దేశ పోలీసులు వెల్లడించారు. వరదల వల్ల సుమారు 1500 మంది ఆచూకీ లేనట్లు కూడా తెలిపారు. ఇక మరోవైపు చైనా హెచ్చరిక చేసింది. మళ్లీ దిగువ ప్రాంతాలకు మరింత భీకర వరదలు సంభవించే అవకాశాలు ఉన్నట్లు డ్రాగన్ దేశం హెచ్చరించింది. తాజా వరదల్లో సుమారు 178 మంది భారతీయులు గల్లంతు అయినట్లు నేపాల్ అధికారులు చెబుతున్నారు.11 మందిని రక్షించ గలిగారు. విదేశీ పర్యాటకులతో పాటు మానవ సరోవర యాత్రకు వెళ్లిన యాత్రికులు ఎక్కువ సంఖ్యలో అదృశ్యమైనట్లు తెలు స్తోంది. టిబెట్-నేపాల్ సరిహద్దు వద్ద లెవెల్-4 హెచ్చరికను చైనా జారీ చేసింది. బుధవారం నాటి మట్టిచరియలు విరిగిపడిన ఘటన తర్వాత తాత్కాలిక సర స్సులు ఏర్పడినట్లు చైనా చెప్పింది. రెండు నదుల సంగమం వద్ద ఇలా జరిగినట్లు ఆ దేశం పేర్కొన్నది. అయితే ఏ క్షణమైనా ఆ తాత్కాలిక సరస్సు ఉప్పొంగే అవకాశాలు ఉన్నట్లు చైనా అభిప్రాయపడింది. టిబెట్ ఆటానమస్ ప్రాంతంలో చైనా జలవనరుల మంత్రిత్వ శాఖ ఎమర్జెన్సీ ఆదేశాలు జారీ చేసింది. చోచెన్ ఖోలా, పెరుపా సాంగో నదుల కలయిక వద్ద భారీగా బేరియర్ లేక్ ఏర్పడినట్లు చైనా పేర్కొన్నది. ఈ రెండు నదులూ టిబెట్‌లో ఉద్భవిస్తాయి. ఇవి నేపాల్‌లోకి ప్రవేశిస్తాయి. అక్కడ నుంచి బోట్ కోశిగా ఈ నదులు రూపాంతరం చెందుతాయి. అయితే ఈ రెండు నదుల సంగమం వద్ద సుమారు రెండు మిలియన్ల క్యూబిక్ మీటర్ల మేర నీరు ఉన్నట్లు చైనా చెబుతోంది. దీంతో పెను ప్రమాదం పొంచి ఉన్నట్లు చైనా హెచ్చరించింది. ఆ ముప్పు నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నాలు చేపడుతున్నారు. ఆ తాత్కాలిక సరస్సు వల్ల రక్షణ చర్యలు ఆలస్యం అవుతున్నాయి. >>2

# 'విజన్‌'తో పనిచేయండి



శుక్రవారం రక్షాబంధన్ సందర్భంగా సిఎం చంద్రబాబుకు రాఖీలు కట్టిన టిడిపి మహిళా నేతలు

- అభివృద్ధి, సంక్షేమంలో ప్రజలను భాగస్వామ్యం ఉండాలి
- అన్ని స్థాయిల్లోనూ పొలిటికల్ గవర్నెన్స్ ఉండాల్సిందే
- విజన్‌ప్లాన్‌పై ప్రజాప్రతినిధులు నిరంతరం సమీక్షించాలి
- పనితీరుకు నియోజకవర్గాల విజన్ ప్లాన్ అమలు ప్రామాణికం
- విజన్ ప్లాన్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు
- ప్రజాప్రతినిధులు, అధికారులతో సిఎం చంద్రబాబు సమీక్ష

**విజయవాడ, ఆగస్టు 28 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందు వరుసలో ఉంచేందుకు నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించేందుకు నియోజకవర్గాల విజన్ యాక్షన్ ప్లాన్ అమలు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. పేదరిక నిర్మూలన, ప్రజా సమస్యల త్వరిత పరిష్కారం, సుపరిపాలనే ధ్యేయంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపొందించిన స్వర్ణ నియోజకవర్గం విజన్ యాక్షన్ ప్లాన్ అమలుపై ప్రజా ప్రతినిధులు, అధికారులతో ముఖ్యమంత్రి సమీక్షి ంచారు. శుక్రవారం క్యాంప్ కార్యాల యంలో జరిగిన ఈ సమీక్షలో భాగంగా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్సులో మంత్రులు, ఎం పీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎం పీలు, ఎమ్మెల్యేలు, యంగ్ ప్రొఫెషనల్స్, నాలెడ్జ్ పార్టనర్స్‌తో సిఎం మాట్లాడారు. నియోజక వర్గాల వారీగా విజన్ ప్లాన్ రూపొందించుకుని పని చేయడం దేశంలోనే ప్రథమంగా ఎపిలోనే అమలు చేస్తున్నామని సిఎం తెలిపారు. దీనికి జాతీ య స్థాయిలో మంచి పేరు వచ్చిందని చెప్పారు. ఈ క్రమంలో నియోజకవర్గాల విజన్‌ను సమర్థవంతంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. నియోజకవర్గాల విజన్ ప్లాన్ అమలులో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలది కీలక పాత్ర అని చెప్పారు. రూపొందించుకున్న కీపెర్ఫామెన్స్ ఇం డికేటర్లకు అనుగుణంగా ఆయా రంగాల్లో వృద్ధి నమోదు చేసేలా పని చేయాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గాల విజన్ ప్లానులో యంగ్ ప్రొఫెషనల్స్, నాలెడ్జ్ పార్టనర్లు, స్వర్ణ కార్యాలయాల సిబ్బంది కీలక పాత్ర పోషిస్తారని, ఆ మేరకు వీళ్లంతా వినూత్నంగా ఆలోచించి ప్రజలకు మెరుగైన సేవలు అందించడం, ఆయా నియోజకవర్గాల అభివృద్ధికి కృషి చేయడం వంటి అంశాలపై ఫోకస్ పెట్టాలని సూచించారు. స్థానికంగా ఉండే వనరుల లభ్యతను >>2

స్థానిక ఎన్నికలు జరగడం జగన్‌కు ఇష్టం లేదు 2లో

# స్వచ్ఛాంధ్ర దిశగా అడుగులు



- డంపింగ్ యార్డ్ రహితంగా మునిసిపాలిటీ
- పురపాలక శాఖ మంత్రి నారాయణ వెల్లడి
- వెలగపూడి సచివాలయంలో ఉన్నత సమీక్ష

**విజయవాడ, ఆగస్టు 28 ప్రభాతవార్త ప్రతినిధి:** డంపింగ్ యార్డ్ (చెత్తకుప్పలు) రహిత మున్సిపాలిటీలుగా ఎపిని మారుస్తామని పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ స్పష్టం చేశారు. లెగసీ వేస్ట్ తొలగింపు, ఫ్రెష్ వేస్ట్ ప్లాంట్‌ల ఏర్పాటు పనులపై మంత్రి నారాయణ శుక్రవారం సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వ హించారు. ఈ సమావేశానికి స్వచ్ఛాంధ్ర >>2



శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు

# మూడు దశాబ్దాల వెలుగొండ కల సాకారం

- అర్హులైన ప్రతి నిర్వాసితుడికీ పరిహారం
- రికార్డుల్లో లోపాలున్నా ఆందోళన అవసరం లేదు
- రూ.169 కోట్ల అదనపు భారం అయినా ప్రతి నిర్వాసితుడికి న్యాయం చేస్తాం
- జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

**మార్కాపురం, ఆగస్టు 28 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రకాశం ఉమ్మడి జిల్లాలోని కరువు, ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలకు సాగు, తాగునీరు అందించాలనే మూడు దశాబ్దాల వెలుగొండ కలను సాకారం చేయడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర >>2



# టైమ్, డేట్.. ఫిక్స్ చెయ్ చర్చకు సిద్ధం!

- జగన్‌కు మంత్రి లోకేష్ సవాల్
- డిఎస్సీకి, ఎపిపిఎస్సీకి తేడాతెలియని అజ్ఞాని మాజీ సిఎం
- స్థానిక ఎన్నికల్లో 2024కంటే 2శాతం అదనపు ఓట్లతో గెలుపే లక్ష్యం
- రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు మరో మూడుసార్లు గెలవాలి
- వెలుగొండ ప్రాజెక్ట్ శంకుస్థాపన చేసింది ఆనాటి ముఖ్యమంత్రి బాబే, 31న ప్రారంభించేది చంద్రబాబు
- ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో లోకేష్

**ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 28 ప్రభాతవార్త:** ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సమన్వయ సమావేశం శుక్రవారం ఒంగోలులో నిర్వహించారు. ఈ సమావేశంలో టిడిపి వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు మరోసారి సవాల్ విసిరారు. చర్చకు తాను పూర్తిగా సిద్ధంగా ఉన్నానని, సమయం, తేదీ ఖరారు చేస్తే పులివెందులకైనా, తాడేపల్లికైనా వచ్చేందుకు సిద్ధమని స్పష్టం చేశారు. డిఎస్సీ, ఎపిపిఎస్‌సికి తేడా తెలియని వారు తనకు నీతులు చెప్పడం సరికాదని జగన్‌పై విమర్శలు చేశారు. డిఎస్సీ విషయంలో అనేక కేసులు వచ్చినప్పటికీ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసి ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీ చేపట్టామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన గ్రూప్-1 వ్యవహారంపై కోర్టు పర్యవేక్షణలో విచారణ కొనసాగుతోందని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోర్టు సూ చించిన విషయాన్ని ప్రస్తావించారు. ఈ ఏడాదితో పాటు రాబోయే మూడేళ్లలోనూ డిఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయ పోస్టులను >>2



మంగంపేట బరైటీస్ ప్రాజెక్ట్ ఏరియల్ వ్యూ

# మంగంపేట బరైటీస్ మూత

## రెండేళ్లలో ప్రాజెక్టు మూసేలా ప్రణాళిక, టెండర్లు పిలిచిన ఎపిఎండిసి

## 2028 ఆఖరికి మంగంపేట చరిత్ర ముగిసినట్లే

**రాజంపేట, ఆగస్టు 28 ప్రభాతవార్త:** ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మంగంపేట బరైటీస్ ప్రాజెక్టు రెండేళ్లలో మూతపడనుంది. 50 ఏళ్ల పాటు ఒక వెలుగు వెలిగిన ఈ ప్రాజెక్టును మూసివేసేందుకు ఎపిఎండిసి విధాన నిర్ణయం తీసుకుంది. 2028 నాటికి మంగంపేట బరైటీస్ ప్రాజెక్టు మూసివేసేం దుకు అవసరమైన పక్కా ప్రణాళికను సిద్ధం చేసేందుకు రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ టెండర్లను పిలిచింది. ఈ టెండర్లలో పాల్గొనేందుకు నిర్మాణ సంస్థలకు కేవలం మూడు రోజులు మాత్రమే గడువుంది. సెప్టెంబర్ 1న ఈ టెండర్లు కూడా ఓపెన్ చేసి కాంట్రాక్టర్‌ను ఖరారు చేస్తారు. రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ ఆదాయంలో కీలకమైన ఉమ్మడి కడప జిల్లాలోని (ప్రస్తుతం తిరుపతి జిల్లాలో) మంగంపేట బరైటీస్ ద్వారా ప్రతి సంవత్సరం కనీసం రూ.1000 కోట్ల నుండి 1300 కోట్ల ఆదాయం వచ్చేది. ఇలాంటి ఈ ప్రాజెక్టు మూతపడుతుందంటే సర్వత్ర ఉత్కంఠ కల్పిస్తోంది. ఈ ప్రాజెక్టు మూసివేసి వేతకు అవసరమైన తుది ప్రణాళికను టెండర్లను దక్కించుకున్న కంపెనీ సిద్ధం చేస్తుంది. 2028 చివరి నాటికి మంగంపేట ప్రాజెక్టు చరిత్ర ముగిసినట్లే అని చెప్పవచ్చు. 1982లో కేంద్ర ప్రభుత్వం ఓబులవారిపల్లె మండలం మంగంపేట గోవిందపల్లి గ్రామాలలో బరైటీస్ ఖనిజాన్ని గుర్తించి స్మారక చిహ్నం కూడా ఏర్పాటు చేసింది.

అప్పటి గణాంకాల ప్రకారం ప్రపంచంలోనే ఎక్కడా దొరకని అతిపెద్ద మందమైన ఏకపార బరైటీస్ మంగంపేటలో 74 మిలియన్ టన్నుల ఖనిజం ఉందని గుర్తించారు. 54 సంవత్సరాలు చరిత్ర కలిగిన ఈ ప్రాజెక్టు దాదాపు అయిపోయినట్లేని ఎపిఎండిసి భావించి ఫైనల్ మైన్ క్లోజర్ ప్లాన్ సిద్ధం చేసేందుకు నిర్మాణ సంస్థకు అప్పగించనుంది.

ప్రస్తుతం మంగంపేట ప్రాజెక్టులో దాదాపు 25 లక్షల ఏ, బి గ్రేడ్ల ఖనిజం ఉన్నట్టు సమాచారం. అలాగే సి అండ్ డి ఖనిజం 1.10కోట్ల టన్నులు ఉంది. ఈ ఖనిజంలో ఇప్పటికే 60 లక్షల టన్నుల ఖనిజం టెండర్ ద్వారా ఎం ప్రదా కంపెనీ దక్కించుకుంది. అంటే సి అండ్ డి ఖనిజం కూడా ప్రస్తుతం 65 లక్షల టన్నులు మాత్రమే విక్రయించేందుకు సిద్ధంగా ఉంది. మరోవైపు త్రివేణి సంస్థ అందుబాటులో ఉన్న ఖనిజాన్ని టెండర్లు ఇటీవలే దక్కించుకుంది. అంటే ఎపిఎండిసి అంచనా ప్రకారం ఖనిజ నిలువలు పైన పేర్కొన్న మేరకు ఉన్నాయి. రెండేళ్లలో వీటిని కూడా విక్రయించి ప్రాజెక్టును క్లోజ్ చేసేందుకు నిర్ణయించింది. ఈ మేరకు ఇప్పటికే విధానపరమైన నిర్ణయం తీసుకుంది. గత కొన్ని సంవత్సరాలుగా రూ.1000 నుండి 1300 కోట్ల ఆదాయం మంగంపేట ప్రాజెక్టు ద్వారా ప్రతి ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వానికి ఆదాయం సమకూర్తుంది. ఈ ఆదాయాన్ని పరిగణలోకి తీసుకుని ఎపిఎండిసి ఖనిజాన్ని తాకట్టుపెట్టి కార్పొరేషన్ బాండ్ల ద్వారా రూ.10వేల కోట్ల రుణాన్ని సమకూర్చుకుంది. ఈ ప్రాజెక్టు మైనింగ్ ముగిసే లోపు ఈ రుణాన్ని ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. మంగంపేట బరైటీస్‌లో ఖనిజం వెలికితీత ద్వారా వచ్చిన ఓవర్ బర్డెన్ నిల్వలు కొన్ని కోట్ల మెట్రిక్ టన్నులు ఉన్నాయి.

పలు గ్రామాలను ఈ నిల్వలు ముంచెత్తాయి. వీటిని క్లియర్ చేసి చదును చేసేందుకే మైన్ క్లోజింగ్ చేపట్టారు. ఈ నేపథ్యంలో వెరైటీస్ ప్రదీప్ స్థానంలో ఈ ప్రాంతంలో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం మరో భారీ పరిశ్రమ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకతను స్పష్టం చేస్తోంది.



శుక్రవారం గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న నాగబాబు

## 2047నాటికి 50%
# పచ్చదనమే లక్ష్యం

- మొక్కలు నాటడమే కాదు.. వాటి మనుగడపై ప్రత్యేక దృష్టి
- ఎపి గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్ నాగబాబు స్పష్టీకరణ

**విజయవాడ, ఆగస్టు 28 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న అటవీ, వృక్ష సంపదను విస్తరించి 2047 నాటికి మొత్తం భౌగోళిక విస్తీ ర్ణంలో పచ్చదనాన్ని 50శాతానికి పెంచడమే లక్ష ్యంగా >>2

# డ్రగ్స్ నిర్మూలనకు 'ఈగల్' నయా అస్త్రం

## ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీతో కీలక ఒప్పందం



ఆకే రవికృష్ణ

**విజయవాడ, ఆగస్టు 28 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌ను మాదకద్రవ్యాల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో యువతను పట్టిం డిస్తున్న మత్తు రక్కసిని అంతం చేసేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలోని 'ఈగల్' విభాగం సరికొత్త వ్యూహంతో ముందుకెళ్తోంది. యువతను డ్రగ్స్ బారి నుంచి కాపాడి, వారిలో సామాజిక బాధ్యతను పెంపొందించేందుకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీతో కీలక ఒప్పందం (ఎంఓయు) కుదుర్చుకుంది. మంగళగిరిలోని ఈగల్ ప్రధాన కార్యాల యంలో ఈ మేరకు ఇరు విభాగాల ప్రతినిధులు ఒప్పంద పత్రాలపై సం తకాలు చేశారు. కేవలం కేసుల నమోదుకే పరిమితం కాకుండా యువత ఆలోచనా ధోరణి మార్చేలా ఈగల్ అడుగులు వేస్తోంది. యువతలో సామా జిక బాధ్యతను, సేవా దృక్పథాన్ని పెంపొందించేందుకు ఈ ఒప్పందం దోహద పడనుంది. రాష్ట్రవ్యాప్తంగా యువత భాగస్వామ్యంతో భారీ ఎత్తున రక్త దాన, నేత్రదాన శిబిరాలను ఏర్పాటు చేసేందుకు ఈగల్ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. రెడ్‌క్రాస్‌సొసైటీ అనుభవంతో ఈ >>2




# ఎన్‌టిఎ డైరెక్టర్‌గా ప్రసన్న వెంకటేశ్

**విజయవాడ,ఆగస్టు 28,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు చెందిన 2012 బ్యాచ్ ఐఏఎస్ అధికారి వి.ప్రసన్న వెంకటేశ్‌ను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) డైరెక్టర్‌గా కేంద్ర ప్రభుత్వం నియమించింది. సెంట్రల్ స్టాఫింగ్ స్కీమ్ కింద ఆయన ఐదేళ్లపాటు ఈ బాధ్యతల్లో కొనసాగనున్నారు. ఈ మేరకు కేంద్ర సిబ్బంది వ్యవహారాల మంత్రిత్వశాఖ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో పలు కీలక బాధ్యతలను ప్రసన్న వెంకటేశ్ గతంలో నిర్వహించారు. ఏలూరు జిల్లా కలెక్టర్‌గా, విజయవాడ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేశారు. పరిపాలనలో తనదైన ముద్ర వేసిన ఆయనకు తాజాగా కేంద్ర ప్రభుత్వ పరిధిలో కీలకమైనఎన్‌టీఏ డైరెక్టర్ బాధ్యతలు అప్పగించడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇకపై దేశవ్యాప్తంగా వివిధప్రవేశ, అర్హత పరీక్షలను నిర్వహించే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీకి ఆయన నాయకత్వం వహించనున్నారు.



శుక్రవారం మంత్రి లోకేష్ సభలో పాల్గొన్న టిడిపి కార్యకర్తలు

# టైమ్, డేట్.. ఫిక్స్ చెయ్ చర్చకు సిద్ధం!

>> భర్తీ చేపట్టామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన గ్రూప్-1 వ్యవహారంపై కోర్టు పర్యవేక్షణలో విచారణ కొనసాగుతోందని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోర్టు సూచించిన విషయాన్ని ప్రస్తావించారు. ఈ ఏడాదితోపాటు రాబోయే మూడేళ్లలోనూ డిఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామని లోకేష్ స్పష్టం చేశారు. వెలుగొండ ప్రాజెక్టు విషయంలోనూ జగన్‌పై మంత్రి లోకేష్ తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. వెలుగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసింది చంద్రబాబేనని, ఈనెల 31న ప్రారంభించేది కూడా చంద్రబాబేనని పేర్కొన్నారు. గతంలో పనులు పూర్తికాకుండానే ప్రాజెక్టును జాతికి అంకితం చేశారని ఆరోపించారు. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీతోపాటు మిగిలిన పనులను కూడా పూర్తిచేసి ప్రాజెక్టును ప్రజలకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. తన రాజకీయ జీవితంలో ఎన్టీఆర్ నుంచి చంద్రబాబు, వైఎస్సార్, రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి, కేసీఆర్ పాలనలను చూశానని, ఇలాంటి జగన్ తరహా పాలనను మాత్రం ఎప్పుడూ చూడలేదని వ్యాఖ్యానించారు.


**స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంకండి:** త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో టిడిపి విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని మంత్రి లోకేష్ పిలుపునిచ్చారు. గత సార్వత్రిక ఎన్నికల్లో సాధించిన ఓట్ల కంటే మరో రెండు శాతం అదనపు ఓట్లతో స్థానిక ఎన్నికల్లో ఘన విజయం సాధించేందుకు అవకాశం ఉందన్నారు. కార్యకర్తలు నాయకుల చుట్టూ తిరగకుండా నేరుగా ప్రజల మధ్య ఉండాలని సూచించారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయడంతోపాటు అభివృద్ధి కార్యక్రమాలపై క్షేత్రస్థాయి ఫీడ్‌బ్యాక్‌ను పార్టీకి అందించాలని కోరారు. 'మై టిడిపి' యాప్ ద్వారా సుమారు నాలుగు లక్షల మంది నాయకులు, కార్యకర్తల కార్యకలాపాలను పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. పార్టీ అప్పగించే కార్యక్రమాలను బాధ్యతగా తీసుకుని సీరియస్‌గా పనిచేయాలని సూచించారు. గ్రామ, మండల, పట్టణ స్థాయిలో పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేస్తే ప్రజల్లో పార్టీపై మరింత విశ్వాసం ఏర్పడుతుందని అన్నారు. ప్రతి కార్యకర్త పార్టీ బలోపేతానికి తనవంతు బాధ్యతను నిర్వర్తించాలని కోరారు. ప్రతి కార్యకర్త ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని పార్టీపై నమ్మకాన్ని మరింత పెంచేలా పనిచేయాలని సూచించారు. రాష్ట్రాన్ని పూర్తిస్థాయిలో గాడిలో పెట్టాలంటే మరో మూడుసార్లు వరుసగా విజయం సాధించాల్సిన అవసరం ఉందని అన్నారు. సోషల్ మీడియాలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పరస్పరం విమర్శలు చేసుకుంటే దాని ప్రభావం పార్టీపై మాత్రమే కాకుండా రాష్ట్రంపై కూడా పడుతుందని హెచ్చరించారు.

పార్టీ కార్యకర్తలు ప్రజల్లో నిరంతరం ఉంటూ గత పాలనలో జరిగిన పరిణామాలను వివరించడంతో పాటు ప్రస్తుత కూటమి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను కూడా ప్రజలకు తెలియజేయాలని సూచించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అహంకారానికి దూరంగా ఉండి పరస్పర సమన్వయంతో పనిచేయాలని లోకేష్ సూచించారు. ఒంగోలు ఎమ్మెల్యే, ఎంపి ప్రజలకు అందుబాటులో ఉన్నారని, స్థానికంగా ఏవైనా సమస్యలు ఉంటే కలిసి చర్చించి పరిష్కరించుకుందామని అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కఠినంగా ఉన్నప్పటికీ అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఆయన స్పష్టం చేశారు. ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తూ ఆంధ్రప్రదేశ్‌ను దేశంలో అగ్రస్థానంలో నిలిపేందుకు చంద్రబాబు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వంపై ప్రజలకు మరింత విశ్వాసం కలిగేలా ప్రతి కార్యకర్త బాధ్యతతో పనిచేయాలని కోరారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఒంగోలు పార్లమెంటు టిడిపి అధ్యక్షుడు ఉగ్రనరసింహారెడ్డి, జోనల్ కోఆర్డినేటర్ మద్దిపాటి వెంకట్రాజు, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ మంతెన సత్యనారాయణరాజు, నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు జడ్.శివప్రసాద్, ఉత్తరాంధ్ర పార్టీ కోఆర్డినేటర్ దామచర్ల సత్య, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఒంగోలు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి కొఠారి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# 2047 నాటికి 50% పచ్చదనమే లక్ష్యం

>> బాధ్యతలు నిర్వర్తిస్తానని ఎపి గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్ నాగబాబు తెలిపారు. పర్యావరణ పరిరక్షణను కేవలం ప్రభుత్వ కార్యక్రమంగా కాకుండా ప్రజలందరూ భాగస్వామ్యమయ్యే మహోద్యమంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. శుక్రవారం మంగళగిరి అరణ్యభవన్‌లో ఎపి గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మీడియాతో నాగబాబు మాట్లాడుతూ "ఎపి గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించడం ఎంతో గౌరవంగా, బాధ్యతగా భావిస్తున్నాను. తనపై నమ్మకం ఉంచి ఈ కీలక బాధ్యతలను అప్పగించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కి కృతజ్ఞతలు. ఎపి గ్రీన్ సొసైటీ నిర్దేశించుకున్న లక్ష్యాలను సమర్థవంతంగా సాధించేందుకు పూర్తి చిత్తశుద్ధితో కృషి చేస్తాను. రాష్ట్రంలో పచ్చదనం పెంపు, అటవీ విస్తీర్ణం అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ లక్ష్యాల సాధనకు ఎపి గ్రీన్ ద్వారా కృషి చేస్తా" అని పేర్కొన్నారు. "ప్రస్తుతం రాష్ట్రంలో అటవీ విస్తీర్ణం 22.96శాతంగా ఉంది. రాబోయే 2047 నాటికి రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణంలో అటవీ, వృక్ష సంపదను కలిపి పచ్చదనాన్ని 50శాతానికి పెంచడమే మా ప్రధాన లక్ష్యం. ఇది కేవలం గణాంకాల కోసం పెట్టుకున్న లక్ష్యం కాదు. భావి తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన పర్యావరణం, మెరుగైన జీవన ప్రమాణాలు అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. వాతావరణ మార్పులు ప్రపంచానికి సవాలుగా మారుతున్న ఈ సమయంలో పర్యావరణ పరిరక్షణ అనేది మనందరి బాధ్యత. అందుకే ఎపి గ్రీన్ కార్యక్రమాన్ని కేవలం అడవులకే పరిమితం చేయకుండా, రాష్ట్రంలోని ప్రతి అనుకూలమైన ప్రాంతంలో పచ్చదనాన్ని పెంచేలా కార్యాచరణ చేపడుతున్నాము. వ్యవసాయ భూములు, గ్రామాలు, పట్టణ ప్రాంతాలు, ప్రధాన రహదారుల ఇరువైపులా, కాలువ గట్లు, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల ప్రాంగణాలు, పరిశ్రమల పరిసరాలు, అనుకూలమైన బంజరు భూములు ఎక్కడ అవకాశం ఉంటే అక్కడ పచ్చదనాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తాం. పెద్ద ఎత్తున మొక్కల పెంపకం, తోటల అభివృద్ధిని ప్రోత్సహిస్తాం" అని నాగబాబు వివరించారు.

**అన్ని శాఖల సమన్వయంతో కార్యాచరణ:** "ఈ బృహత్తర లక్ష్యం విజయం కావాలంటే ఒక్క శాఖతో సాధ్యమయ్యేది కాదు. వ్యవసాయం, ఉద్యానవనం, పంచాయతీరాజ్, విద్య, పరిశ్రమలు, రెవెన్యూ, జలవనరులు, రవాణా, అటవీ శాఖలతోపాటు అన్ని సంబంధిత ప్రభుత్వ విభాగాలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతాం. ఎపి గ్రీన్ కార్యక్రమాన్ని కేవలం ప్రభుత్వ కార్యక్రమంగా మాత్రమే ఉండకూడదు. రైతులు, స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ సామాజిక బాధ్యత సంస్థలు, విద్యార్థులు, యువత, పారిశ్రామికవేత్తలు, ప్రతిపౌరుడిని ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేయాలనుకుంటున్నాం. ఎపిగ్రీన్‌ను ఒక ప్రభుత్వ పథకంగా కాకుండా, ప్రజలందరూ భాగస్వామ్యమయ్యే గొప్ప ప్రజా ఉద్యమంగా తీర్చిదిద్దడమే మా లక్ష్యం. మొక్కలు నాటడం మాత్రమే మా లక్ష్యం కాదు. నాటిన మొక్కలను బతికించడం, వాటిని సంరక్షించడం, అవి ఆరోగ్యంగా ఎదిగేలా చూడటమే అసలైన బాధ్యత. నాటిన ప్రతి మొక్క మనుగడపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. వాటి సంరక్షణ, నిర్వహణ కోసం ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేస్తాం" ఎపి గ్రీన్



శుక్రవారం సిఎం చంద్రబాబును మర్యాదపూర్వంగా కలిసి ఎపి గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్న నాగబాబు

# సిఎం చంద్రబాబుని కలిసిన నాగబాబు

**విజయవాడ, ఆగస్టు 28 ప్రభాతవార్త ప్రతినిధి:** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని మర్యాదపూర్వకంగా ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు కలిశారు. ఎపి గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్న అనంతరం సిఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును సతీసమేతంగా కలిశారు. ఈ సందర్భంగా నాగబాబును సత్కరించి సిఎం చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. తనకు కీలక బాధ్యతను అప్పగించినందుకు సిఎం చంద్రబాబుకు నాగబాబు ధన్యవాదాలు తెలిపారు. 'ఎపి గ్రీన్ సొసైటీ నిర్దేశించుకున్న లక్ష్యాలను సమర్థవంతంగా సాధించేందుకు పూర్తి చిత్తశుద్ధితో కృషి చేస్తాను. రాష్ట్రంలో పచ్చదనం పెంపు, అటవీ విస్తీర్ణం అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ లక్ష్యాల సాధనకు ఎపి గ్రీన్ ద్వారా కృషి చేస్తాను' అని నాగబాబు సిఎంకు తెలిపారు.

# సిఎం చంద్రబాబు రాఖీ కట్టిన మహిళా నేతలు

**విజయవాడ, ఆగస్టు 28 ప్రభాతవార్త ప్రతినిధి:** రాఖీ పౌర్ణమి సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి పలువురు మహిళా నేతలు, బ్రహ్మకుమారీలు రాఖీలు కట్టారు. సిఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రికి రాఖీలు కట్టి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు వారికి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేశారు. సిఎంను కలిసిన వారిలో మంత్రి సవిత, మాజీ మంత్రి పీతల సుజాత, ఎన్టీఆర్ జిల్లా టిడిపి అధ్యక్షురాలు గద్దె అనురాధ, టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఆచంట సునీత, తదితరులు ఉన్నారు.

# 'విజన్'తో పనిచేయండి

>> ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని నియోజక వర్గాల విజన్‌ను అందించామని, ఆయా స్థానిక పరిస్థితులకు అనుగుణంగా విజన్ ను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. వివిధ అంశాలకు సంబంధించిన సమాచారాన్ని అందించేందుకు డేటా లేక్ సిద్ధం చేశామని, అందుబాటులో ఉన్న సమాచారాన్ని విశ్లేషించుకోవడంతోపాటు పూర్తి స్థాయిలో టెక్నాలజీని వినియోగించుకోవాలని సిఎం ఆదేశించారు. నియోజకవర్గాల యాక్షన్ ప్లాన్ అమలుపై ఎమ్మెల్యేలు ఎప్పటికప్పుడు సమీక్షలు చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. క్షేత్ర స్థాయిలో సమీక్షలు మొక్కుబడిగా కాకుండా, ప్రజలకు పూర్తిగా జవాబుదారీగా ఉండేలా నిర్వహించాలని సూచించారు. లబ్ధిదారులకు కేవలం నగదు సాయం అందించడమే కాకుండా, వారిని ఆర్థికంగా నిలబెట్టి సాధికారత వైపు నడిపించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సిఎం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున అభివృద్ధి- సంక్షేమం చేపడుతోందని, వాటిని ప్రజలకు వివరించే బాధ్యతను ప్రజా ప్రతినిధులే తీసుకోవాలని అన్నారు. పి-4 ప్రాజెక్టు ద్వారా పేదలకు అవసరమైన చేయూత అందిస్తున్నట్లు చెప్పారు. పేదరిక నిర్మూలనకు పారిశ్రామికవేత్తలను సైతం ప్రోత్సహిస్తూ, సమాజంలోని ప్రతి పేద కుటుంబానికి అండగా ఉంటామనే నమ్మకాన్ని కలిగించాలని సిఎం పిలుపునిచ్చారు. ప్రతి నియోజకవర్గాల్లోనూ తలసరి ఆదాయం పెంచడమే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. అలాగే అనుమతులు పొందుతున్న పరిశ్రమలు ఆయా జిల్లాల్లో, నియోజకవర్గాల్లో గ్రౌండ్ అయ్యే విధంగా ప్రజా ప్రతినిధులు, క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది పూర్తి స్థాయిలో సహకరించాలని సిఎం ఆదేశించారు. ఉద్యోగుల సామర్థ్యం పెరిగేలా ఇప్పటికే 1.50 కోట్ల ఆన్‌లైన్ కోర్సులు కూడా పూర్తి చేసుకున్నారని సిఎం తెలిపారు. నియోజకవర్గాల విజన్ ప్లాన్ యూనిట్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చిందని సిఎం అన్నారు.

**వినూత్నంగా ఆలోచించాలి.. మెరుగైన సేవలు అందించాలి**

ప్రస్తుత పరిస్థితుల్లో పేద, మధ్యతరగతి కుటుంబాలకు విద్య, వైద్యం భారంగా మారుతున్నాయని, ఈ ఇబ్బందుల నుంచి వారిని గట్టెక్కించేందుకే సంజీవని, తల్లికి వందనం వంటి వినూత్న పథకాలను తెచ్చామని సిఎం చంద్రబాబు వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు, నైపుణ్యాలు పెంచడం వల్ల అదనంగా లక్ష మంది విద్యార్థులు చేరారని, ఇది వారి కుటుంబాలపై విద్యా భారాన్ని తగ్గించిందని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో పనిచేసే అధికారులు, ప్రజా ప్రతినిధులు సాంప్రదాయ ధోరణి వీడి వినూత్నంగా ఆలోచించాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా విజన్ ప్లాన్‌ను వర్తింపజేస్తూ సమస్యలకు తగిన పరిష్కారాలు చూపాలని కోరారు. పరిపాలనలో ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయం అత్యంత కీలకమని, అన్ని స్థాయిల్లో పొలిటికల్ గవర్నెన్స్ సమర్థవంతంగా అమలు కావాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ నిర్ణయాల్లోనూ, అభివృద్ధి కార్యక్రమాల్లోనూ ప్రజలను భాగస్వాములను చేసినప్పుడే అద్భుత ఫలితాలు వస్తాయని సిఎం చంద్రబాబు అన్నారు. ఉత్తరాంధ్ర ప్రజల కలల సాకారంగా చేపట్టిన భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవానికి ప్రజల నుంచి విశేష స్పందన వచ్చిందని గుర్తుచేశారు. ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు పేరుతో కార్యక్రమం నిర్వహిస్తే ప్రజలే స్వచ్ఛంధంగా ముందుకు వచ్చి ప్రచారం చేపట్టారని గుర్తు చేశారు. అదే విధంగా యువతకు, నిరుద్యోగులకు మేలు చేసేలా చేపట్టిన మెగా డిఎస్సీ ప్రక్రియకు అనేక అడ్డంకులు కల్పించే ప్రయత్నం జరిగినా సమర్థవంతంగా నిర్వహించి రిక్రూట్మెంట్ పూర్తి చేశామన్నారు. పారదర్శకంగా చేపట్టిన మెగా డిఎస్సీపై విమర్శలు చేస్తుంటే టీచర్లేస్వయంగా ఉద్యమించిన విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ప్రజలను మెప్పించగలిగితే ప్రజలనుంచి సహకారం కూడా అదే స్థాయిలో ఉంటుందని సిఎంచెప్పారు. ఈ సమీక్షలో మంత్రి పయ్యావుల కేశవ్, ఆర్థిక,ప్రణాళికశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పీయూష్‌కుమార్,ఎపిఎస్ డిపిఎస్ ఇడివిఆర్ అలపర్తి సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మూడు దశాబ్దాల వెలుగొండ కల సాకారం


>> జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణం కోసం విలువైన భూములు, ఆస్తులు, స్వగ్రామాలను త్యాగం చేసిన నిర్వాసితుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యం ఇస్తోందని ఆయన స్పష్టం చేశారు. మార్కాపురం జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం మీడియాతో మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ, 1996లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెలుగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారని గుర్తుచేశారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఎట్టి పరిస్థితుల్లోనూ 2026 ఆగస్టు నాటికి వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేయాలనే లక్ష్యాన్ని ముఖ్యమంత్రి నిర్దేశించారని తెలిపారు రెండేళ్లలో వెలుగొండ ప్రాజెక్టు పనుల కోసం సుమారు రూ.2,250 కోట్లకు పైగా నిధులు ఖర్చు చేసి, రాత్రింబవళ్లు పనులు కొనసాగిస్తూ ప్రాజెక్టు నిర్మాణాన్ని వేగవంతం చేసిందని మంత్రి తెలిపారు. ప్రభుత్వం బాధ్యతలు చేపట్టే సమయానికి వెలుగొండ హెడ్ రెగ్యులేటర్‌కు సంబంధించిన వింగ్స్, వాల్స్ పనులు పూర్తికాని పరిస్థితి ఉండేదని చెప్పారు. 2025 మేలో పనులు ప్రారంభించి, 2026 మే నాటికి హెడ్ రెగ్యులేటర్‌కు సంబంధించిన వింగ్స్, వాల్స్ పనులను పూర్తి చేసినట్లు వివరించారు. టన్నెల్1 కు సంబంధించి సుమారు 1.20 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి తొలగింపు పనులు, టన్నెల్2కు సంబంధించి సుమారు 4,990 మీటర్ల బెంచింగ్ పనులు, 6,990 మీటర్ల లైనింగ్ పనులు పూర్తి చేసినట్లు మంత్రి వెల్లడించారు. వెలుగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు సుమారు రూ.900 కోట్లు చెల్లించాల్సి ఉండగా, గత ఐదేళ్లలో వారికి ఎలాంటి చెల్లింపులు జరగలేదని మంత్రి ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం కేవలం 40 రోజుల్లో మూడు విడతల్లో సుమారు రూ.768 కోట్లను నిర్వాసితులకు చెల్లించినట్లు తెలిపారు. వెలుగొండ ప్రాజెక్టు పరిధిలోని 11 ముంపు గ్రామాలకు 11 కమిటీలను ఏర్పాటు చేసి, జిల్లా స్థాయి అధికారులు, జలవనరుల శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో నిర్వాసితుల గ్రీవెన్స్‌లను పరిశీలిస్తున్నట్లు మంత్రి తెలిపారు. సామాజిక, ఆర్థిక సర్వేలో పేరు లేకపోయినా, గెజిట్‌లో నమోదు కాకపోయినా, కొత్త ఇల్లు ఉన్నా లేకపోయినా, పేర్లలో తేడాలు ఉన్నా ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి స్పష్టం చేశారు. రికార్డుల్లో ఉన్న లోపాలను మాత్రమే ప్రాతిపదికగా తీసుకోకుండా, వాస్తవ పరిస్థితులను పరిశీలించి అర్హత ఉన్న ప్రతి నిర్వాసితుడికి న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. అర్హులైన ప్రతి నిర్వాసితుడికి పరిహారం అందించే క్రమంలో ప్రభుత్వంపై అదనంగా సుమారు రూ.169 కోట్ల ఆర్థిక భారం పడుతున్నప్పటికీ, ఆ భారాన్ని లెక్కచేయకుండా ప్రతి నిర్వాసితుడికి న్యాయం చేయాలనే మానవతా దృక్పథంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ నిర్ణయం తీసుకున్నారని మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు. వెలుగొండ జలాలతో లబ్ధి పొందే రైతులు, ప్రజల కంటే కూడా ప్రాజెక్టు కోసం త్యాగం చేసిన నిర్వాసితులు ఒక మెట్టు పైన ఉండాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచన అని మంత్రి తెలిపారు.

# అవినీతి ఆరోపణలపై కర్ణాటక మంత్రి నాగేంద్ర రాజీనామా

**బెంగళూరు, ఆగస్టు 28:** కర్ణాటక మంత్రి బీ నాగేంద్ర రాజీనామా చేశారు. అవినీతి ఆరోపణల కారణంగా రెండోసారి మంత్రివర్గం నుంచి తప్పుకున్నారు. శుక్రవారం తన రాజీనామాను ప్రకటించేటప్పుడు భావోద్వేగానికి లోనైన ఆయన కన్నీటి పర్యంతమయ్యారు. బీజేపీ తనపై అసత్యాలు ప్రచారం చేస్తున్నదని నాగేంద్ర ఆరోపించారు. నాకు రాజ్యాంగంపై నమ్మకం ఉంది. నాపై వచ్చిన ఆరోపణలపై అసెంబ్లీలో చర్చించాలని బీజేపీని అనేకసార్లు మేం కోరాము. కానీ వారు అందుకు ముందుకు రాలేదు. మనుస్మృతిని రుద్దాలనిబీజేపీ కోరుకుంటోంది. ఆ పార్టీకి గిరిజన వ్యతిరేక వైఖరిఉన్నదని మీడియాతో ఆయన అన్నారు. ఎస్టీ వర్గానికి చెందిన కాంగ్రెస్ నేత బీ నాగేంద్ర తొలుత సీఎం సిద్ధరామయ్య ప్రభుత్వంలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్నారు. అయితే కర్ణాటక మహర్షి వాల్మీకి షెడ్యూల్డ్ తెగల అభివృద్ధి సంస్థలో రూ.89 కోట్ల మేర అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. 2024 మే నెలలో ఆ సంస్థ అకౌంట్స్ ఆఫీసర్ చంద్రశేఖరన్ ఆత్మహత్య చేసుకున్నారు. అనధికార నిధుల బదిలీ గురించి సూసైడ్ నోట్‌లో ఆయన పేర్కొనడంతో ఈ అవినీతి వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఆ తర్వాత జరిగిన విచారణలో వాల్మీకి షెడ్యూల్డ్ తెగల అభివృద్ధి సంస్థ బ్యాంక్ ఖాతాల నుంచి భారీ మొత్తంలో నిధులు ఇతర ఖాతాలకు బదిలీ అయినట్లు తేలింది. దీంతో ఆ రాష్ట్రంలోని ప్రతిపక్ష బీజేపీ ఈ అంశాన్ని టార్గెట్ చేసింది. ఈ నేపథ్యంలో సిద్ధరామయ్య మంత్రివర్గంలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా పనిచేసిన బీ నాగేంద్ర, 2024 జూన్‌లో తొలిసారి మంత్రి పదవికి రాజీనామా చేశారు. మరోవైపు డీకే శివకుమార్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆగస్ట్ 3న జరిగిన మంత్రివర్గ విస్తరణలో నాగేంద్రను తిరిగి కేబినెట్‌లోకి తీసుకున్నారు. ప్రణాళికా, గణాంక శాఖల బాధ్యతలను ఆయనకు అప్పగించారు. అయితే వాల్మీకి షెడ్యూల్డ్ తెగల అభివృద్ధి సంస్థలో జరిగిన స్కామ్ గురించి బీజేపీ మళ్లీ పోరుబాట పట్టింది. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలను బయటపెట్టేందుకు సెప్టెంబర్ 1 నుంచి 10 వరకు రాయచూర్ నుంచి బళ్లారి వరకు 10 రోజుల పాదయాత్రను ఆ పార్టీ ప్రకటించింది. ఈ నేపథ్యంలో మంత్రి నాగేంద్ర అనూహ్యంగా శుక్రవారం రెండోసారి మంత్రివర్గం నుంచి తప్పుకున్నారు. కన్నీళ్లతో తన రాజీనామాను ఆయన ప్రకటించారు.

# చీరెల పంపిణీలో తొక్కిసలాట: స్పృహకోల్పోయిన కొందరు మహిళలు

**లక్నో,ఆగస్టు 28:** రాఖీ సందర్భంగా ఒక బీజేపీ మేయర్ చీరల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అయితే ఊహించని విధంగా వేల సంఖ్యలో మహిళలు తరలివచ్చారు. చీరల కోసం వారు ఎగబడ్డారు. ఈ సందర్భంగా తోపులాట జరుగడంతో కొందరు మహిళలు స్పృహ కోల్పోగా చాలామంది గాయపడ్డారు. ఉత్తరప్రదేశ్‌లో ఈ సంఘటన జరిగింది. బరేలీ బీజేపీ మేయర్ ఉమేష్ గౌతమ్ రక్షాబంధన్‌కు ఒక రోజు ముందు మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గురువారం బరేలీ క్లబ్ గ్రౌండ్‌లో జరిగిన ఈకార్యక్రమం కోసం 20వేల మందికిపైగా మహిళలు తరలివచ్చారు. పిల్లలు, కుటుంబంలోని వృద్ధులతో కలిసి ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకున్నారు. బరేలీ బీజేపీ మేయర్ ఉమేష్ గౌతమ్‌కు రాఖీలు కట్టేందుకు మహిళలకు ముందుగానే కూపన్లు పంపిణీ చేశారు. అయితే వారు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో గ్రౌండ్‌లో కనీసం నిల్చోవడానికి కూడా చోటు లేనంత పరిస్థితి ఏర్పడింది. చాలా మంది మహిళలు బారికేడ్లను దాటుకుని వేదిక వైపు వెళ్లారు. తీవ్ర ఎండ, ఉక్కపోత మధ్య మహిళల సంఖ్య పెరుగడంతో పరిస్థితి అదుపుతప్పింది. మరోవైపు పంపిణీ చేస్తున్న చీరల కోసం మహిళలు ఎగబడ్డారు. ఈ సందర్భంగా తోపులాట జరుగడంతో చాలా మంది మహిళలు స్పృహ తప్పిపడిపోయారు. పలువురు గాయపడ్డారు. స్పృహ కోల్పోయిన, గాయపడిన మహిళలను అంబులెన్స్‌లలో ఆసుపత్రులకు తరలించారు. అయితే ఈ కార్యక్రమం గురించి తమకు ముందుగా సమాచారం ఇవ్వలేదని పోలీస్ అధికారి తెలిపారు.అలాగే తోపులాటలో మహిళలు స్పృహ కోల్పోవడం, గాయపడటం గురించి ఎలాంటి అధికారిక ఫిర్యాదు కూడా నమోదు కాలేదని చెప్పారు.



ఎన్టీఆర్ సాహిత్యట్రస్టు చైర్మన్ టీడీ జనార్దన్‌కు ప్రశంసాపత్రం అందించిన సీఎం చంద్రబాబు

# స్థానిక ఎన్నికలు జరగడం జగన్‌కు ఇష్టం లేదు

## ఆ పార్టీ బలహీన పడింది... ఎన్నికలను అడ్డుకునేందుకు కుయుక్తులు

## మాజీ సిఎంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆగ్రహం

## సెప్టెంబర్ 2న అనకాపల్లిలో పోలవరం జలహారతి

## మంగళగిరి టిడిపి కార్యాలయంలో మీడియాతో సిఎం చిట్‌చాట్

**విజయవాడ, ఆగస్టు 28 ప్రభాతవార్త ప్రతినిధి:** స్థానిక ఎన్నికలు జరగడం గొడ్డలి పార్టీ నాయకుడికి ఇష్టం లేదని సిఎం చంద్రబాబు అన్నారు. రాష్ట్రంలో ఏ ఎన్నిక జరిగినప్పటికి కూటమి పక్షాలే గెలుస్తాయని సిఎం చంద్రబాబు స్పష్టం చేసారు. ఈ ఎన్నికల్లో కూటమి 100శాతం స్ట్రైక్‌రైట్‌తో విజయతతం సాధిస్తుందనే లక్ష్యంతో క్యాడరు ఉందన్నారు. రాష్ట్రంలో తమ ప్రత్యర్థి పార్టీ బలహీనపడిందన్నారు. స్థానిక ఎన్నికలు జరగడం ఆ పార్టీ నాయకుడికి ఇష్టం లేదని ధ్వజమెత్తారు. శుక్రవారం మంగళగిరిలో ఎన్టీఆర్ భవన్‌లో టిడిపి అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. స్థానిక ఎన్నికలను అడ్డుకునేందుకు వైఎస్సార్సీపీ అధినేత జగన్ యత్నిస్తున్నారని విమర్శించారు. వైసిపి నేతలు 'సర్'పై కోర్టుకెళ్లారని, స్థానిక ఎన్నికలు జాప్యం జరిగే కొద్దీ అధికార పార్టీకి నష్టం కలుగుతుందనే ఆశ వైసిపికి ఉందని ఎద్దేవా చేశారు. ఎన్నికలు వాయిదా పడితే ఆ పార్టీకి లాభం అనుకోవడం దింపుడుకళ్లెం ఆశలే అన్నారు. స్థానిక ఎన్నికలు ప్రత్యక్ష పద్ధతిలో జరిగితేనే రాజకీయ స్థిరత్వం ఉంటుందన్నారు. ఏ ఎన్నికల్లోనైనా బిసిలకు ఎక్కువ సీట్లు ఇచ్చేది టిడిపినే అని పునరుద్ఘాటించారు. బిసిలకు 34శాతం సీట్లు అనేది చట్టపరమైన రక్షణ మాత్రమే అని సిఎం పేర్కొన్నారు. గత ఎన్నికల్లో 34శాతం కంటే ఎక్కువ సీట్లే బిసిలకు ఇచ్చినట్లు తెలిపారు స్థానిక ఎన్నికల నిర్వహణపై ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేశారు. ఎన్నికలు జరగడం ఇష్టం లేకే గొడ్డలి పార్టీ అధినేత న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నారని ఆరోపించారు. గొడ్డలి పార్టీ చేస్తున్న కుయుక్తులు ప్రజలకు ఇప్పటికే తెలుసని చంద్రబాబు అన్నారు. పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలు ప్రత్యక్ష పద్ధతిలో జరగడమే మేలని సిఎం అభిప్రాయపడ్డారు. మేయర్ లేదా ఛైర్మన్‌ను ప్రజలు నేరుగా ఎన్నుకోవడం వల్ల మెరుగైన సేవలు అందుతాయని చెప్పారు. ఎమ్మెల్యేలు, మేయర్లు, ఛైర్మన్లు సమన్వయంతో పనిచేసే అవకాశం ఉంటుందని, మరో పవర్ సెంటర్ ఏర్పడుతుందన్న భావన సరికాదన్నారు. పోలవరం నీళ్లకు సెప్టెంబర్ 2న అనకాపల్లిలో జలహారతి ఇస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా తొలి దశ నీటిని అనకాపల్లి వరకు తీసుకెళ్లి వచ్చే ఏడాది విశాఖపట్నం వరకు పోలవరం జలాలను తరలిస్తామని సిఎం ధీమా వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టును కూడా వచ్చే ఏడాది ప్రారంభిస్తామని పునరుద్ఘాటించారు. 30యేళ్ల క్రితం తానే శంకుస్థాపన చేసిన వెలిగొండను తానే ప్రారంభిస్తుండటం విధిరాత అంటూ ఒకింత భావోద్వేగంగా మాట్లాడారు. వెలిగొండ ప్రాజెక్టు తన రాజకీయ ప్రస్థానంలో ప్రత్యేక అధ్యాయమని చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాకు ఇచ్చిన హామీ మేరకు మార్కాపురం జిల్లా ఏర్పాటు చేయడంతో పాటు వెలిగొండ తొలి దశను పూర్తి చేశామని తెలిపారు. వెలిగొండ ప్రాంతాన్ని హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేశామని, ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటే వారి నుంచి సహజంగానే సానుకూల స్పందన వస్తుందని చంద్రబాబు స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సిఎం చంద్రబాబు కార్యకర్తలతో పలు అంశాలపై మాట్లాడారు. పార్టీ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేస్తున్న నేతలను ఆయన ప్రశంచారు. పలువురు ప్రత్యేక ప్రశంసా పత్రాలు ఇచ్చి గౌరవించారు. ఈ క్రమంలో సిఎం చంద్రబాబు పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఎన్టీఆర్ సాహిత్య ట్రస్టు చైర్మన్ టిడి జనార్దన్‌ను సత్కరించారు.

# స్వచ్ఛాంధ్ర దిశగా అడుగులు

>> కార్పొరేషన్ ఎండీ సునీల్ కుమార్ రెడ్డి, కాంట్రాక్ట్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడారు. జగన్ రెడ్డి హయాంలో వదిలి వెళ్లిన 150 లక్షల టన్నుల లెగసీ వేస్ట్‌ను పూర్తిగా తొలగిస్తున్నామని మంత్రి చెప్పుకొచ్చారు. భూమిపైన ఉన్న వేస్ట్‌ను ఇప్పటికే పూర్తిగా తొలగించామని తెలిపారు. భూమి లోపల ఉన్న చెత్తను కూడా అక్టోబర్ 2వ తేదీ నాటికి పూర్తిగా తొలగించాలని అధికారులను ఆదేశించారు. కొత్తగా ఏర్పాటు చేస్తున్న 6 వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌ల ద్వారా ఏ రోజు చెత్తను అదే రోజు పూర్తిగా విద్యుత్‌గా మారుస్తామని మంత్రి వెల్లడించారు. ఈలోగా ఉత్పత్తి అయ్యే ఘన వ్యర్థాల నిర్వహణ కోసం ఫ్రెష్ వేస్ట్ ప్లాంట్‌లు నెలకొల్పుతున్నామని అన్నారు. ఫ్రెష్ వేస్ట్ ప్లాంట్‌ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. అక్టోబర్ 2వ తేదీ నుంచి మొత్తం చెత్తను ప్లాంట్‌లకు తరలించాలని మంత్రి నారాయణ దిశానిర్దేశం చేశారు.

# డ్రగ్స్ నిర్మూలనకు 'ఈగల్' నయా అస్త్రం

>> క్యాంపులను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఎపి ఈగల్ చీఫ్, ఆకే రవికృష్ణ మీడియాతో మాట్లాడుతూ, ఈగల్ సంస్థ ప్రివెంటివ్ అవేర్‌నెస్, ఇంటెలిజెన్స్ డ్రివెన్ ఎన్‌ఫోర్స్‌మెంట్, డీఅడిక్షన్, కమ్యూనిటీ పార్టిసిపేషన్ అనే నాలుగు ప్రాథమిక అంశాలపై పనిచేస్తోందని వివరించారు. ఇప్పటివరకు 2,020 ఎన్‌డిపిఎస్ కేసులు నమోదు చేసి, 65,000 కిలోలకు పైగా గంజాయిని స్వాధీనం చేసుకున్నామని రవికృష్ణ పేర్కొన్నారు. ఆపరేషన్ చైతన్యం ద్వారా గంజాయి సాగు నిర్మూలనలో కీలక విజయాలు సాధించామని తెలిపారు. 2025 నాటికి అల్లూరి సీతారామ రాజు జిల్లాలో గంజాయి సాగును పూర్తిగా నిర్మూలించామని వెల్లడించారు. 29,979 మంది గిరిజన రైతులకు ప్రత్యామ్నాయ, స్థిరమైన ఉపాధి మార్గాలు కల్పించామని చెప్పారు. 29,839 ఎకరాల్లో గంజాయికు బదులుగా ప్రభుత్వ పథకాల సమన్వయంతో గిరిజనులకు రూ.475 కోట్ల ఆర్థిక, ఉపాధి మద్దతు అందించామని తెలిపారు. డ్రగ్స్ వినియోగం, సరఫరా, గంజాయి సాగుకు సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే ఈగల్ టోల్‌ఫ్రీ నంబర్ 1972కు సమాచారం ఇవ్వాలని ఆకే రవికృష్ణ సూచించారు.

# భయం గుప్పిట్లోనే

>> ఎప్పుడు ఆ సరస్సు ఉప్పొంగుతుందో అన్న భయం నెలకొన్నది. బురదతో కొట్టుకువచ్చిన బండరాళ్లు అడ్డుపడడంతో.. రెండు నదుల సంగమం వద్ద భారీగా ఓ సరస్సు ఏర్పడింది. దీని వల్ల ముప్పు ఉందని భావిస్తున్నారు.

## వారం - వర్జ్యం

29-08-2026, శనివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
శ్రావణ మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, కృష్ణపక్షం, మఖకార్తె
తి.పాడ్యమి ఉ.9.55
న.పూర్వాభాద్ర రా.3.41
వ.ఉ.9.43-ఉ.11.21
దు.తె.5.53-ఉ.7.31
రాహు. ఉ.9.00-ఉ.10.30
శుభ లేదు

## వార్తాఫలం

**మేషం :** జీవిత భాగస్వామి సహాయం అందుకుంటారు. అకౌంట్స్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవలసి ఉంటుంది.

**వృషభం :** పక్షపాత ధోరణితో వ్యవహరించారన్న నిందలు ప్రచారంలో ఉంటాయి. పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు.

**మిథునం :** కుటుంబంలో శుభకార్యాలు జరుగుతాయి. స్థిరాస్తి వివాదాలు తీరి ఊరట చెందుతారు. ప్రముఖుల కలయిక.

**కర్కాటకం :** నూతన పరిశ్రమలు వ్యాపారాలు ప్రారంభిస్తారు. బంధువుల నుండి శుభ వార్తలు అందుకుంటారు.

**సింహం :** ఉద్యోగులకు పదోన్నతుల సూచన, ఎంత సాధించినా ఇంకా సాధించాలనే తృప్తి లేని ధోరణి కనిపిస్తుంది.

**కన్య :** పారిశ్రామిక పెట్టుబడుల విషయమై చర్చలు ఊపందుకుంటాయి. ఖర్చులు అధికంగా ఉంటాయి. నూతన విద్యావకాశం.

**తుల :** సామరస్యమైన చర్చలు సాగించి అపోహలను దూరం చేస్తారు. స్పెక్యులేషన్‌కు దూరంగా ఉండండి. వాహన సౌఖ్యం.

**వృశ్చికం :** వ్యాపార సంబంధమైన కాగితాలు, డాక్యుమెంట్స్ మొదలైనవి చేతికందుతాయి. పాత ఋణాలు తీరుస్తారు.

**ధనుస్సు :** మాటలను కటువుగా ఉపయోగించే వైఖరి ఆలోచించకుండా వెంటనే సమాధానం చెప్పడం వలన నష్టపోతారు.

**మకరం :** శుభకార్యాలు నిర్వహించటానికి అదృష్టం తోడవుతుంది. వాహనం కొనుగోలు యత్నాలు దాదాపుగా ఫలిస్తాయి.

**కుంభం :** కార్యాలయంలో మీ పనితీరును మరింతగా మెరుగుపర్చుకోగలుగుతారు. విదేశీ పర్యటనలు. శుభవార్తలు అందుతాయి.

**మీనం :** వ్యాపారస్తులకు సానుకూల ఫలితాలు గోచరిస్తాయి. కొత్త వింత ఆలోచనలతో మీ మనస్సు వత్తిడికి లోనవుతుంది.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



మంత్రి లోకేష్‌కు రాఖీ కట్టిన మంత్రి సవిత, ఎమ్మెల్యే గళ్లా మాధవి, మహిళలు

**విజయవాడ, ఆగస్టు 28 ప్రభాతవార్త ప్రతినిధి:** రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని ఉండవల్లి నివాసంలో వేడుక నిర్వహించారు. విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌కు బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి రాఖీ కట్టి తమ అభిమానాన్ని చాటుకున్నారు. తెలుగింటి ఆడపడుచులకు ఈ సందర్భంగా మంత్రి లోకేష్ రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు.

# బిజెపి ఆధ్వర్యంలో రక్షాబంధన్

**తిరుపతి, ఆగస్టు 28 ప్రభాతవార్త ప్రతినిధి:** మూడు రోజుల పర్యటనలో భాగంగా శుక్రవారం ఉదయం తిరుపతిలో ఉన్న బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్‌కు రాఖీ పౌర్ణమి సందర్భంగా బిజెపి మహిళా మోర్చా కార్యకర్తలు రక్షాబంధన్ కట్టారు. పివిఎన్ మాధవ్‌కి మహిళలు రాఖీలు కట్టి సోదర భావానికి ప్రతీకగా రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పివిఎన్ మాధవ్ మాట్లాడుతూ మహిళల రక్షణ, గౌరవం, సాధికారతకు భారతీయ జనతా పార్టీ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందడుగు సాగేందుకు కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అనేక సంక్షేమ, సాధికారత కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. రాఖీ పౌర్ణమి మన భారతీయ సంస్కృతిలో అన్నాచెల్లెళ్ల మధ్య ఉన్న ఆత్మీయత, ప్రేమ, పరస్పర రక్షణకు ప్రతీక అని అన్నారు. మహిళా మోర్చా కార్యకర్తలు పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు మహిళా సమస్యల



పరిష్కారానికి చురుకైన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. సమాజంలో సోదరభావం, ఐక్యత మరింత బలోపేతం కావాలని ఆకాంక్షి ంచారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా బిజెపి అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, బిజెపి నేతలు కోలా ఆనంద్, గుండాల గోపీనాథ్‌రెడ్డి, ముని సుబ్రహ్మణ్యం, జల్లి మధుసూదన్, వరప్రసాద్, పొగనంటి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం, వేదిక్ యూనివర్సిటీ ప్రాంగణాల్లో పార్టీ నాయకులతో కలిసి మార్నింగ్ వాక్ నిర్వహించారు. ఆహ్లాదకరమైన వాతావరణం లో వాకింగ్ చేస్తూ పార్టీ నాయకులతో పలు అంశాలపై ఆయన చర్చించారు. కూటమి ప్రభుత్వ పాలన, పార్టీ బలోపేతం, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సి న వ్యూహాలపై జిల్లా నాయకులతో అభిప్రాయాలు పంచు కున్నారు. ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభించిన ఫిట్ ఇండియా కార్యక్రమం స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ఆరోగ్య పరిరక్షణకు ప్రతిరోజూ యోగా, వాకింగ్ వంటి వ్యాయామాలను జీవితంలో భాగం చేసుకోవాలని

# 'ప్రమాణ్ కృత్రిమ మేధ ఆపరేటింగ్ సిస్టమ్' ఆవిష్కరణ

**విజయవాడ, ఆగస్టు 28 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎఐ (కృత్రిమ మేధ) ఆధారిత అకౌంటింగ్, స్టాట్యూటరీ కాంప్లయన్స్ జనరేటెడ్ అప్లికేషన్‌గా రూపొందించిన 'ప్రమాణ్ ఆపరేటింగ్ సిస్టమ్'ను సచివాలయంలో శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి 'ప్రమాణ్ ఆపరేటింగ్ సిస్టమ్' అందించే సేవలు, దాని సాంకేతిక సామర్థ్యాలు, ఏఐ ఆధారిత అకౌంటింగ్ విధానం, స్టాట్యూటరీ కాంప్లయన్స్ నిర్వహణ, సమాచార రక్షణ, డేటా సెక్యూరిటీ తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం మార్కెట్లో అందుబాటులో ఉన్న ఇదే తరహా అకౌంటింగ్, కాంప్లయన్స్ సాఫ్ట్‌వేర్‌లతో పోలిస్తే 'ప్రమాణ్ ఆపరేటింగ్ సిస్టమ్' మరింత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ, అకౌంటింగ్ ప్రక్రియలను సులభతరం చేయడంతో పాటు, అవసరమైన స్టాట్యూటరీ కాంప్లయన్స్ సమాచారాన్ని సమర్థవంతంగా నిర్వహించే విధంగా రూపొందించబడిందని కంపెనీ ప్రతినిధులు ముఖ్యమంత్రికి వివరించారు. ప్రత్యేకంగా కృత్రిమ మేధ ఆధారిత ఆటోమేషన్, డేటా విశ్లేషణ, కాంప్లయన్స్ జనరేషన్, సమాచార భద్రత వంటి ఆధునిక సాంకేతిక అంశాలను



సమన్వయం చేయడం ద్వారా వ్యాపార సంస్థలు, చార్టర్డ్ అకౌంటెంట్లు మరియు అకౌంటింగ్ రంగానికి మరింత వేగవంతమైన, సమర్థవంతమైన సేవలు అందించడమే 'ప్రమాణ్ ఆపరేటింగ్ సిస్టమ్' లక్ష్యమని తెలిపారు. సాంకేతికతను పరిపాలన, ఆర్థిక వ్యవహారాలు, వ్యాపార రంగాలతో అనుసంధానిస్తూ ఎఐ ఆధారిత డిజిటల్ సొల్యూషన్స్‌ను అభివృద్ధి చేయడం ద్వారా భారతదేశం 'వికసిత్ భారత్-2047' లక్ష్యాల దిశగా ముందుకు సాగేందుకు తమ వంతు కృషి చేస్తామని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. అప్లికేషన్ పనితీరు, భవిష్యత్‌లో దాని విస్తరణకు ఉన్న అవకాశాలు తదితర అంశాలపై ఆసక్తిగా తెలుసుకున్న ముఖ్యమంత్రి కంపెనీ బృందాన్ని అభినందించి ఆశీర్వదించారు.

ఇదేరోజు తన జన్మదినం కావడంతో చంద్రబాబుని కలిసి ఆయన ఆశీస్సులు తీసుకోవడం తనకు ప్రత్యేకమైన ఆనందాన్ని, మరపురాని అనుభూతిని కలిగించిందని లంకా దినకర్ తెలిపారు. "తన జన్మదినం రోజున ముఖ్యమంత్రి చేతుల మీదుగా 'ప్రమాణ్ ఆపరేటింగ్ సిస్టమ్' ఆవిష్కరణ జరగడం, అదే సందర్భంగా ఆయన ఆశీస్సులు పొందడం ఎంతో సంతోషకరమైన విషయం. ఎఐ ఆధారిత సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి అకౌంటింగ్, స్టాట్యూటరీ కాంప్లయన్స్ రంగంలో ఆధునిక సేవలను అందించే ఈ ప్లాట్‌ఫామ్‌ను మరింత అభివృద్ధి చేసి దేశవ్యాప్తంగా విస్తరించేందుకు కృషి చేస్తాము" అని 20 సూత్రాల పథకాల అమలు సంస్థ చైర్మన్ లంకా దినకర్ తెలిపారు. ప్రామాణిక్ ఇన్ఫోటెక్ రూపొందించిన 'ప్రమాణ్ ఆపరేటింగ్ సిస్టమ్'ను సిఎం ఆవిష్కరించడం ఎంతో ఆనందదాయకంగా ఉందని కంపెనీ ప్రతినిధులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో సంస్థ చైర్మన్ లంకా దినకర్, సిఇఒ అవినాష్ రైనా, ముఖ్య కార్యనిర్వాహక సభ్యులు ఆశిష్, చార్టర్డ్ అకౌంటెంట్లు మేఘన, దుర్గా తదితరులు పాల్గొన్నారు.

## నర్సీపట్నం ట్రెజరీ కార్యాలయంలో ఎసిబి సోదాలు

**విశాఖపట్నం, ఆగస్టు 28 ప్రభాతవార్త:** నర్సీపట్నం ట్రెజరీ కార్యాలయంలో ఎసిబి అధికారులు శుక్రవారం ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. లంచం తీసుకుంటూ ఓ ఉద్యోగి ఎసిబి అధికారులకు పట్టుపడ్డారు. వివరాల్లోకి వెళ్తే నర్సీపట్నం డివిజనల్ సబ్ ట్రెజరీ కార్యాలయంలో సీనియర్ అకౌంటెంట్‌గా పనిచేస్తున్న నరవ విజయ భాస్కర్ లంచం తీసుకుంటూ ఎసిబి అధికారులకు చిక్కారు. ఒక రిటైర్డ్ ఉద్యోగి నుండి రూ. 30వేలు లంచం తీసుకుంటుండగా అధికారులు ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. ఎలమంచిలికి చెందిన పర్వతం శ్రీనివాసరావు అనే రిటైర్డ్ తహసీల్దార్‌కు సంబంధించిన 2023, 2024, 2025 సంవత్సరాల ఇంక్రిమెంట్ బకాయిల బిల్లులు, అదేవిధంగా ఆర్న్ లీవ్ బిల్లును ప్రాసెస్ చేయడానికి విజయ భాస్కర్ మొదట రూ.40 వేలు లంచం డిమాండ్ చేశారు. బాధితుడి అభ్యర్థన మేరకు ఆ మొత్తాన్ని రూ. 30 వేలు ఇవ్వటానికి ఒప్పుకున్నారు. డబ్బులు ఇవ్వకపోతే బిల్లులు ముందుకు సాగవని ఖచ్చితంగా చెప్పడంతో, బాధితుడు ఎసిబి అధికారులను ఆశ్రయించారు. రంగంలోకి దిగిన ఎసిబి అధికారులు విజయ భాస్కర్ లంచం డబ్బులు తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తు జరుపుతున్నారు.

## సిఎం చంద్రబాబుతో మారిషస్ మంత్రి భేటీ



**విజయవాడ, ఆగస్టు 28 ప్రభాతవార్త ప్రతినిధి:** ముఖ్యమంత్రి చంద్రబాబుతో మారిషస్ పబ్లిక్ సర్వీస్ అండ్ అడ్మినిస్ట్రేటివ్ రీఫార్మ్స్ శాఖ మంత్రి లచ్మణ (రాజ్) పెంటియా మర్యాద పూర్వకంగా సమావేశమయ్యారు. ఇటీవల మారిషస్ కేబినెట్ మంత్రిగా లచ్మణ (రాజ్) పెంటియా బాధ్యతలు చేపట్టారు. భేటీ సందర్భంగా ద్వైపాక్షిక అంశాలతోపాటు పరిపాలనా సంస్కరణల అంశాలపై చర్చించారు. ఇరు దేశాల మధ్య సంక్షేమం, అభివృద్ధి అంశాల్లో సమన్వయం ఉన్న దృష్ట్యా పరస్పరం సహకారం అందించుకునే దిశలో సంబంధాలను కొనసాగాలని మారిషస్ కేబినెట్ మంత్రి లచ్మణ (రాజ్) పెంటియా ఆకాంక్షించారు. ఏపి హస్తకళలు, చేనేత రంగంలో సాధిస్తున్న అభ్యున్నతిని, కీలకంగా డిజిటల్ రంగంలో తీసుకుని వస్తున్న సంస్కరణలను పెంటియా ప్రశంసించారు. రాజధాని అమరావతి అభివృద్ధి చెందుతున్న దేశాలకు దీటుగా తీర్చిదిద్దుతుండటం అభినందనీయమన్నారు. ఇరు దేశాల మధ్య వాణిజ్యం, వైద్యం, ఆరోగ్యం తదితర సంబంధాలు మరింతగా వృద్ధి కావాల్సి ఉందన్నారు. సిఎం చంద్రబాబు లచ్మణా (రాజ్) పెంటియా ఘనంగా సత్కరించారు. మారిషస్‌తో తమ రాష్ట్రం మంచి సంబంధాలను కలిగి ఉంటుందని సిఎం చంద్రబాబు లచ్మణా (రాజ్) పెంటియాకు తెలిపారు.

## సిఎంతో శ్రీలంక డిప్యూటీ హైకమిషనర్ భేటీ



**విజయవాడ, ఆగస్టు 28 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో చెన్నైలోని శ్రీలంక డిప్యూటీ హైకమిషనర్ డాక్టర్ గణేశనాథన్ గైథీశ్వరన్ మర్యాద పూర్వకంగా సమావేశమయ్యారు. దక్షిణ భారత రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్ణాటక, తెలంగాణ, పుదుచ్చేరి రాష్ట్రాల్లో శ్రీలంక ద్వైపాక్షిక సంబంధాలను డాక్టర్ గణేశనాథన్ పర్యవేక్షిస్తున్నారు. భేటీ సందర్భంగా సిఎం చంద్రబాబుతో పలు అంశాలపై చర్చించారు. శ్రీలంకతో వ్యాపార, వాణిజ్య సంబంధాలపై ఇరువురు మధ్య కీలక చర్చలు జరిగినట్లు సమాచారం. ఉత్పత్తి రంగంలో ఏపి సాధిస్తున్న ప్రగతి అభినందనీయంగాను, తమ దేశానికి స్ఫూర్తిదాయకంగా ఉన్నట్లు డాక్టర్ గణేశనాథన్ గైథీశ్వరన్ సిఎంతో వ్యాఖ్యానించినట్లు సమాచారం. అమరావతి అత్యుత్త రాజధాని నగరంగా రూపొందుతుందని డాక్టర్ గణేశనాథన్ గైథీశ్వరన్ అభిప్రాయపడ్డారు. సిఎం చంద్రబాబును డాక్టర్ గణేశనాథన్ గైథీశ్వరన్ సత్కరించారు. ఆయనకు సిఎం చంద్రబాబు జ్ఞాపికను అందజేసారు.

## నటుడు నారాయణరావుకు కన్నీటి వీడ్కోలు



నటుడు నారాయణరావు భౌతికకాయం వద్ద నివాళి అర్పించి కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న మెగాస్టార్ చిరంజీవి

**హైదరాబాద్, ఆగస్టు 28, ప్రభాత వార్త:** ప్రముఖ నటుడు, నిర్మాత జీవీ నారాయణ రావు(73) అంత్యక్రియలు ముగిశాయి. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ మహా ప్రస్థానంలో శుక్రవారం ఆయన అంతిమ సంస్కారాలు శాస్త్రోక్తంగా జరిగాయి. కుమారుడు, కుమార్తె ఈ కార్యక్రమాలు పూర్తి చేశారు. అంతకు ముందు సినీ ప్రముఖులు జీవీ నారాయణరావు భౌతికకాయానికి నివాళి అర్పించారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న జీవీ నారాయణరావు బుధవారం రాత్రి కన్ను మూసిన విషయం తెలి సిందే. 1976లో కె.బాలచందర్ దర్శకత్వం లో వచ్చిన 'అంతులేని కథ' చిత్రం తో నటుడిగా అరంగేట్రం చేసిన జీవీ, ఆ తర్వాత ఎన్నో చిత్రాలు, టీవీ సీరి యళ్లలో విలక్షణ పాత్రలు పోషించారు. నటుడిగానే కాకుండా నిర్మాతగా కూడా ఆయన తనదైన ముద్ర వేశారు. తన మిత్రుడు జీవీ నారాయణరావు అంత్య క్రియలకు ప్రముఖ సినీనటుడు మెగాస్టార్ చిరంజీవి హాజరయ్యారు. ఆయన పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించిన చిరంజీవి వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. నారాయణ రావుతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. సీనియర్ నటుడు మురళీమోహన్‌తోపాటు పలువురు టాలీవుడ్ ప్రముఖులు ఆయనతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కండి

**కార్యకర్తలకు జనసేనాని పవన్ సందేశం ● ఎన్నికల కమిటీ సభ్యులకు వివరించిన నాదెండ్ల మనోహర్**

విజయవాడ, ఆగస్టు 28 ప్రభాతవార్త ప్రతినిధి: స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించవలసిన వ్యూహాలు భిన్నంగా ఉంటాయి.. అభ్యర్థుల ఎంపిక దశ నుంచే పార్టీ నిర్దేశించే నియమాల ప్రకారం ముందుకు వెళ్లాలి అని పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. ఆయన ఎన్నికల కమిటీకి సందేశాన్ని పంపించారు. ఆయన ఆదేశాలకు అనుగుణంగా స్థానిక సంస్థల ఎన్నికల కమిటీ సభ్యులు బాధ్యతలు చేపట్టాల"ని జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం మంగళగిరిలో జనసేన స్థానిక సంస్థల ఎన్నికల కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతపై చర్చించారు. కమిటీ సభ్యులకి పవన్ కల్యాణ్ ఇచ్చిన సందేశాన్ని మనోహర్ తెలియచేశారు. అనంతరం మనోహర్ మాట్లాడుతూ '100 శాతం స్ట్రైక్ రేట్ మన లక్ష్యం కావాలి అనేది పవన్ కల్యాణ్ సంకల్పం. ఆ దిశగా ముందుకు వెళ్దాము. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ముందుగా నగర పాలక, పుర పాలక సంస్థల ఎన్నికల మీద దృష్టి పెట్టాలి. డివిజన్లు, వార్డులలో మన బలబలాలు గుర్తించాలి' అని నాదెండ్ల మనోహర్ స్పష్టం చేసారు. రాష్ట్ర స్థాయిలో కూటమి సమన్వయ కమిటీ



చర్చలు నడుస్తున్నాయి. జిల్లా, నియోజక వర్గాలవారీగా సమన్వయ కమిటీలు ఉంటాయి. మన పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల కమిటీ సభ్యులకు పార్లమెంట్ నియోజక వర్గాల వారీగా బాధ్యతలు అప్పగిస్తారు. సభ్యులు క్షేత్ర స్థాయిలో పర్యటించి క్యాడర్‌ను కలిసి వారికి భరోసా ఇస్తూ, ఎన్నికలకి సమాయత్తం చేసి వారి అభిప్రాయాలను పార్టీ కేంద్ర కార్యాలయానికి నివేదిక ద్వారా తెలియచేయాలి అన్నారు. సమావేశంలో కమిటీ సభ్యులు మంత్రి కందుల దుర్గేష్. మండలి బుద్ధ ప్రసాద్, టి శివశంకర్, వల్లభనేని బాలశౌరి, బొలిశెట్టి శ్రీనివాస్, దేవ వరప్రసాద్, సీహెచ్ వంశీకృష్ణ యాదవ్, లోకం మాధవి, పత్సమట్ల ధర్మరాజు, చిలకం మధుసూదన్ రెడ్డి, కొటికలపూడి గోవిందరావు, సామినేని ఉదయభాను, యనమల భాస్కర్, కొరికాన రవి కుమార్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరామ్ తాళ్లూరి పాల్గొన్నారు.

# పోలీసుల సంక్షేమమే లక్ష్యం

**● సురక్షితమైన సౌకర్యవంతమైన వసతి సౌకర్యాల కల్పన ● మంగళగిరిలో 'విహార- విహారి'**

**వసతి భవనాలు: డిజిపి హరీష్ వెల్లడి ● సమీకృత సెంట్రల్ పోలీస్ క్యాంటీన్‌కు భూమిపూజ**

**విజయవాడ, ఆగస్టు 28 ప్రభాతవార్త ప్రతినిధి:** పోలీసు సిబ్బంది సంక్షేమం, వారికి మెరుగైన వసతి సౌకర్యాల కల్పనలో భాగంగా ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ మరో కీలక ముందడుగు వేసింది. అధికారిక విధులపై వివిధ జిల్లాల నుంచి మంగళగిరికి వచ్చే పోలీసు సిబ్బందికి సురక్షితమైన, సౌకర్యవంతమైన వసతి కల్పించేందుకు 6వ బెటాలియన్ ఎపిఎస్పీ ప్రాంగణంలో పురుషుల కోసం 'విహార', మహిళల కోసం 'విహారి' పేరుతో ప్రత్యేక ట్రాన్సిట్ అకామడేషన్ భవనాలను నిర్మించనున్నారు. వీటితోపాటు సమీకృత సెంట్రల్ పోలీస్ క్యాంటీన్ నిర్మాణానికి రాష్ట్ర డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా శుక్రవారం శంకుస్థాపన చేశారు.

**ఒక్కో భవనం 13,603 చదరపు అడుగుల్లో..**

పోలీస్ ప్రధాన కార్యాలయంలో సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలు, బందోబస్తు విధులు, ఇతర అధికారిక పనుల నిమిత్తం రాష్ట్రంలోని వివిధ జిల్లాలు, యూనిట్ల నుంచి పెద్ద సంఖ్యలో పోలీసు సిబ్బంది మంగళగిరికి వస్తుంటారు. వారికి తగిన వసతి అందుబాటులో లేకపోవడంతో ఎదురవుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని 'విహార', 'విహారి' భవనాల నిర్మాణాన్ని చేపట్టారు.

పురుషులు, మహిళలకు వేర్వేరుగా నిర్మించే ఒక్కో భవనం సుమారు 13,603 చదరపు అడుగుల విస్తీర్ణంలో గ్రౌండ్ ఫ్లోర్‌తోపాటు రెండు అంతస్తులతో రూపుదిద్దుకోనుంది. 'విహార'లో సుమారు 120 మంది పురుష పోలీసు సిబ్బంది, 'విహారి'లో 120 మంది మహిళా పోలీసు సిబ్బంది బస చేసేందుకు వీలుగా సదుపాయాలు కల్పించనున్నారు. వివిధ ప్రాంతాల నుంచి అధికారిక పనులపై మంగళగిరికి వచ్చే సిబ్బందికి సురక్షితమైన, అందుబాటు ధరలో, సౌకర్యవంతమైన శాఖాపరమైన వసతి కల్పించడం ఈ



ప్రాజెక్టుల ప్రధాన ఉద్దేశం. దీనివల్ల బయట వసతి కోసం వెతకాల్సిన అవసరం, అదనపు వ్యయం తగ్గడంతోపాటు సిబ్బందికి క్రమబద్ధమైన, గౌరవప్రదమైన బస సౌకర్యం అందుబాటులోకి రానుంది.

**20 వేల చదరపు అడుగుల్లో సెంట్రల్ పోలీస్ క్యాంటీన్**

పోలీసు సిబ్బంది, వారి కుటుంబాలకు నిత్యావసర వస్తువులు, సంక్షేమ సేవలను మరింత సులభంగా అందుబాటులోకి తీసుకొచ్చేందుకు మంగళగిరి పోలీస్ ప్రధాన కార్యాలయంలో సమీకృత సెంట్రల్ పోలీస్ క్యాంటీన్ నిర్మించనున్నారు. దీనికీ డిజిపి హరీష్‌కుమార్ గుప్తా శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం 6వ బెటాలియన్ ఏపీఎస్పీ ప్రాంగణంలో నిర్వహిస్తున్న పోలీస్ క్యాంటీన్ ఉంది. ఇది పెరుగుతున్న అవసరాలకు సరిపోవడం లేదు. పోలీస్ ప్రధాన కార్యాలయంతోపాటు సమీపంలోని సిఐడి, పోలీస్ కమ్యూనికేషన్స్, పిసిఎస్ అండ్‌ఎస్, ఆక్టోపస్, పిటిఒ తదితర పోలీసు విభాగాల్లో పనిచేస్తున్న సిబ్బంది సంఖ్య పెరగడంతో మరింత విశాలమైన, ఆధునిక క్యాంటీన్ అవసరమైంది.

ఈ నేపథ్యంలో 6వ బెటాలియన్ ఎపిఎస్పీ ప్రాంగణంలో సుమారు 20 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ప్రీఇంజినీర్డ్ బిల్డింగ్ విధానంలో సమీకృత సెంట్రల్ పోలీస్ క్యాంటీన్‌ను నిర్మించనున్నారు. ప్రస్తుత అవసరాలతోపాటు భవిష్యత్తులో పెరిగే అవసరాలను తీర్చేలా దీనిని తీర్చిదిద్దనున్నారు. పోలీసు సిబ్బందికి నిత్యావసర వస్తువులు మరింత సులభంగా అందుబాటులోకి తీసుకురావడంతోపాటు సంక్షేమ సేవలను ఒకేచోట సమర్థంగా అందించేందుకు ఈ క్యాంటీన్ ఉపయోగపడనుంది.

ఈ సందర్భంగా డిజిపి హరీష్‌కుమార్ గుప్తా మాట్లాడుతూ.. పోలీసు సిబ్బంది సంక్షేమం, వారి శ్రేయస్సుకు రాష్ట్ర పోలీస్ శాఖ అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. అధికారిక విధుల నిమిత్తం మంగళగిరికి వచ్చే పురుష, మహిళా పోలీసు సిబ్బందికి 'విహార -విహారి' భవనాలు సురక్షి తమైన, సౌకర్యవంతమైన, గౌరవప్రదమైన వసతిని అందిస్తాయని పేర్కొన్నారు.

సమీకృత సెంట్రల్ పోలీస్ క్యాంటీన్ ద్వారా పోలీసు సిబ్బంది, వారి కుటుంబాలకు ఆధునికమైన, సౌకర్యవంతమైన సంక్షేమ సేవలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. మూడు ప్రాజెక్టుల నిర్మాణంలో నాణ్యతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వడంతోపాటు నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను డిజిపి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు డిజిపి (శాంతిభద్రతలు) ఎన్. మధుసూదన్‌రెడ్డి, ఐజిలు ఎం.రవిప్రకాశ్, బి.రాజకుమారి, సిహెచ్. శ్రీకాంత్, కె.వి. మోహన్‌రావు, డిఐజిలు అన్బురాజన్, ఆర్.ఎన్. అమ్మిరెడ్డితోపాటు పలువురు సీనియర్ పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రాయలసీమ 'మేయర్' వ్యూహంపై కూటమి కసరత్తు!

**ఐదు కార్పొరేషన్లలో మూడు దక్కించుకోవడమే లక్ష్యం**

**తిరుపతి, ఆగస్టు 28 ప్రభాతవార్త ప్రతినిధి:** రాయలసీమలోని ఐదు మున్సిపల్ కార్పొరేషన్లపై కూటమి పార్టీలు ప్రత్యేక దృష్టి సారిస్తున్నాయి. రాష్ట్రంలో మొత్తం 17 మున్సిపల్ కార్పొరేషన్లు ఉన్నప్పటికీ, రాయలసీమలోని కర్నూలు, కడప, అనంతపురం, తిరుపతి, చిత్తూరు కార్పొరేషన్లను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. గతంలో ఈ ప్రాంతాల్లో వైసిపికి ఉన్న బలమైన రాజకీయ పునాది, మాజీ సిఎం జగన్‌మోహన్ రెడ్డికి ఉన్న ప్రభావం నేపథ్యంలో కనీసం మూడు కార్పొరేషన్లను కైవసం చేసుకోవాలని కూటమి వ్యూహరచన చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో మేయర్ అభ్యర్థుల ఎంపిక విషయంలో కూటమి నాయకత్వం ఆచితూచి అడుగులు వేస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ స్థానిక రాజకీయ సమీకరణాలు, సామాజిక వర్గాల బలం, అభ్యర్థుల వ్యక్తిగత ప్రభావం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

**ఎమ్మెల్యే వర్గానికి కాకుండా మరో వర్గానికి?:** కూటమి పరిశీలిస్తున్న ప్రధాన వ్యూహాల్లో ఒకటి. ఆయా కార్పొరేషన్లకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యే సామాజిక వర్గానికి గాకుండా, అదే ప్రాంతంలో గణనీయమైన ఓటు బ్యాంకు ఉన్న మరో ప్రధాన సామాజిక వర్గానికి మేయర్ అభ్యర్థిత్వం ఇవ్వడం, తద్వారా కూటమిలోని వివిధ సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించడంతో బాటు విస్తృతమైన ఓటు సమీకరణ సాధించవచ్చన్న ఆలోచన ఉన్నట్లు తెలుస్తోంది.

రాయలసీమలోని ఐదు కార్పొరేషన్లలో తిరుపతికి జనసేన ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తుండగా, మిగిలిన నాలుగు ప్రాంతాల్లో టిడిపి ఎమ్మెల్యేలు ఉన్నారు. ఈ నేపథ్యంలో ఐదు మేయర్ స్థానాల్లో కనీసం ఒకదానిని జనసేనకు కేటాయించే అవకాశంపై కూడా చర్చ జరుగుతున్నట్లు సమాచారం.

**కర్నూలులో బిసి కార్డు?:** కర్నూలు ఎమ్మెల్యేగా వైశ్య సామాజిక వర్గానికి చెందిన టిజి భరత్ ఉండటంతో బాటు ఆయన రాష్ట్ర మంత్రిగా కూడా ఉన్నారు. ఈ నేపథ్యంలో కర్నూలు మేయర్ పదవిని నగరంలో గణనీయమైన ఓటు బలం ఉన్న బీసీ సామాజిక వర్గానికి కేటాయిస్తే రాజకీయంగా ప్రయోజనం ఉంటుందనే అభిప్రాయం కూటమి వర్గాల్లో ఉన్నట్లు తెలుస్తోంది. ఇది కేవలం సామాజిక సమీకరణమే కాకుండా.. బిసిఓటర్లను కూటమి వైపు మరింతగా ఆకర్షించే వ్యూహంగా కూడా ఉపయోగపడుతుందనే అంచనాలు ఉన్నాయి.

**కడపలో మైనారిటీ సమీకరణం?:** కడపలో ఎమ్మెల్యేగా ఆర్. మాధవీరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. రెడ్డి సామాజిక వర్గం తర్వాత నగర రాజకీయాల్లో ముస్లిం మైనారిటీలకు గణనీయమైన ప్రాధాన్యత ఉంది. ఈ నేపథ్యంలో మేయర్ పదవిని ముస్లిం మైనారిటీ వర్గానికి ఇవ్వడం ద్వారా సామాజిక సమీకరణాన్ని విస్తరించవచ్చనే ఆలోచన ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే స్థానిక ఎన్నికల రిజర్వేషన్, అభ్యర్థుల రాజకీయ బలం, పార్టీ సమీకరణాలు తదితర అంశాల ఆధారంగానే తుది నిర్ణయం ఉండే అవకాశం ఉంది.

**అనంతపురంలో ఎస్సీ వర్గానికి?:** అనంతపురం ఎమ్మెల్యేగా కమ్మ సామాజిక వర్గానికి చెందిన దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ ఉన్న నేపథ్యంలో మేయర్ పదవిని ఎస్సీ సామాజిక వర్గానికి కేటాయించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. నగరంలో ఎస్సీ ఓటర్ల ప్రాధాన్యతతో పాటు.. కూటమిలో సామాజిక సమతుల్యత సాధించాలనే ఉద్దేశంతో ఈ ప్రతిపాదన ముందుకు వస్తున్నట్లు తెలుస్తోంది.

**తిరుపతిలో 'రెడ్డి' వ్యూహం?:** తిరుపతి ఎమ్మెల్యేగా బలిజ సామాజిక వర్గానికి చెందిన శ్రీనివాసులు ఉన్నారు. ఈ నేపథ్యంలో మేయర్ పదవిని రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నేతకు కేటాయించే అంశంపై కూడా చర్చ జరుగుతున్నట్లు సమాచారం. ఇక్కడ రాజకీయంగా మరో అంశం కూడా ప్రాధాన్యం సంతరించుకుంటోంది. వైసిపికి చెందిన సీనియర్ నేత, మాజీ టిటిడి చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి ప్రభావం ఉన్న తిరుపతిలో అదే సామాజిక వర్గానికి చెందిన బలమైన అభ్యర్థిని ముందుకు తీసుకురావడం ద్వారా వైసిపికి ధీటైన రాజకీయ సమీకరణాన్ని రూపొందించవచ్చనే అభిప్రాయం కూటమి వర్గాల్లో ఉన్నట్లు తెలుస్తోంది.

**చిత్తూరులో జనసేనకు ఛాన్స్?:** చిత్తూరు ఎమ్మెల్యేగా కమ్మ సామాజిక వర్గానికి చెందిన గురజాల జగన్‌మోహన్ నాయుడు ఉన్నారు. భవిష్యత్ రాజకీయ సమీకరణాల్లో జిల్లా పరిషత్ చైర్మన్ పదవిని కమ్మ సామాజిక వర్గానికి చెందిన నేతకు ఇవ్వాలనే ఆలోచన ఉంటే మేయర్ పదవిని మరో సామాజిక వర్గానికి ఇవ్వడం ద్వారా సమతుల్యత సాధించవచ్చనే చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో చిత్తూరు మేయర్ స్థానాన్ని జనసేనకు కేటాయించి, బలిజ సామాజిక వర్గానికి చెందిన నాయకుడిని బరిలోకి దించే అవకాశాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఇది జనసేనకు పట్టణ రాజకీయాల్లో మరింత ప్రాధాన్యత కల్పించడంతో పాటు.. కూటమిలో టిడిపి, జనసేన మధ్య సామాజిక, రాజకీయ సమన్వయానికి ఉపయోగపడుతుందనే అంచనాలు ఉన్నాయి.

మేయర్ అభ్యర్థుల ఎంపికలో సామాజిక సమీకరణాలతో పాటు మహిళా ప్రాతినిధ్యాన్ని కూడా కూటమి పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. రాయలసీమలో మేయర్ పీఠాలు కూటమి సామాజిక సమీకరణాలకు మరో పరీక్షగా మారనున్నాయా? అన్నది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చగా మారింది.

## ఉద్యోగ సంఘాల ఉద్యమ శంఖారావం

# సిఎస్‌కు నోటీసు అందజేత

**విజయవాడ, ఆగస్టు 28 ప్రభాతవార్త:** ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సి న రూ.40వేల కోట్లకు పైగా బకాయిలు, కరువు భత్యం పెంపు, జీత భత్యాల పెంపుదల, పదవీ విరమణ చేసిన ఉద్యోగుల బకాయిలు తదితర 29 సమస్యల సాధన కోసం ప్రభుత్వ ఉద్యోగులు జెఎసి అమరావతి ఆధ్వర్యంలో ఆందోళనకు సిద్ధమవుతున్నారు. విజయవాడలో సమావేశమైన వివిధ రాష్ట్ర ప్రభుత్వ శాఖల ఉద్యోగ సంఘాలు ఉద్యమ శంఖారావాన్ని పూరించాయి. ఎపిజెఎసి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఇప్పటికే పలుమార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేస్తూ, వినతిపత్రాలు అందజేయడంతోపాటు చర్చలు, సమావేశాలు నిర్వహించినప్పటికీ నిర్ణయాలు తీసుకోవడంలో ప్రభుత్వం తీవ్రమైన జాప్యం చేస్తున్నందున ఉద్యమ బాట పట్టక తప్పడం లేదన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల భవిష్యత్‌పై ఎపి జెఎసి అమరావతి రాష్ట్ర స్థాయి సదస్సులో చర్చించి జిల్లా నాయకత్వాల అభిప్రాయాలతోనే ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్ణయాలు తీసుకున్నామని, 13 లక్షల మంది ఉద్యోగుల భవిష్యత్‌దృష్టిలో ఉంచుకొని జిల్లాల నిర్ణయం మేరకు ఉద్యమ కార్యాచరణను చేపట్టామన్నారు. ఎన్నికల ముందు కూటమి మేనిఫెస్టో లో ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నదే ఈ ఉద్యమం ప్రధాన లక్ష్యమని, ఈ ఉద్యమం ద్వారా ప్రజలకు వచ్చే ఇబ్బందులను ప్రభుత్వమే భాధ్యత వహించాల్సి వస్తుందని ఎపిజెఎసి అమరావతి స్టేట్ సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు తెలిపారు. తొలి దశ ఉద్యమంలో భాగంగా ఉద్యమకార్యాచరణ, డిమాండ్లను తెలియజేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని శుక్రవారం కలిసి నోటీసు చేశారు. ఈ నెల 31 నుంచి సెప్టెంబరు 11వరకు తొలిదశ ఉద్యమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. 31న జిల్లా కలెక్టర్లను కలిసి ఉద్యమ కార్యాచరణ నోటీసులు అందజేయడంతో పాటు సెప్టెంబర్ 15 నుంచి వర్క్ టూ రూల్ ప్రారంభిస్తున్నట్లు జిల్లా కలెక్టర్లకు


వార్త

నీ వద్ద ఉన్న వస్తువులను మార్చవచ్చు, సరిదిద్దవచ్చు, కాని ఒక్క పర్యాయం పలికిన మాటను మాత్రం తిరిగి రాబట్టుకోలేము.

న- రాస్‌కామన్

# చక్కెర చేదెక్కింది !

దేశంలో చక్కెర ధరలు అమాంతం ఒక్కసారిగా భారీగా పెరిగాయంటే ఏమనుకోవాలి? ఎవరిని అనుకోవాలి. పోనీలే తీపి చేదయ్యిందని సరిపెట్టుకోవాలా? నెల రోజుల్లో దాదాపు రూ.20 వరకు పెరిగినట్లు అంచనా. రాఖీ, వినాయక చవితి, దసరా, దీపావళి వంటి పండుగల సమయంలో స్వీట్లు, బేకరీ ఉత్పత్తులు, పానీయాలు తదితరాల తయారీలో చక్కెర డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. సాధారణ పరిస్థితుల్లో ఈ అదనపు డిమాండ్‌ను మార్కెట్ సులభంగా గ్రహించగలదు. ఇప్పటికే అంచనాల కంటే ఉత్పత్తి తక్కువగా ఉన్నప్పుడు, పండుగల డిమాండ్ ధరలపై మరింత ఒత్తిడి తెస్తుంది. ప్రస్తుతం అదే జరుగుతోంది. ప్రస్తుతం దేశంలో చక్కెర ధరల పెరుగుదలకు. చక్కెర ఉత్పత్తి తగ్గిపోవడం, పండుగల సీజన్ కావడంతో డిమాండ్ భారీగా పెరగడం, వాతావరణ సమస్యలు పంట నష్టపోవడం, అంతర్జాతీయంగా సరఫరా వ్యవస్థ కఠినంగా మారడం వంటి కారణాలే కళ్లెదుట కన్పిస్తాయి. దేశీయ ఉత్పత్తి అంచనాల కంటే తగ్గడం. 2026 సీజన్‌లో తొలుత సుమారు 343 లక్షల టన్నుల ఉత్పత్తి ఉంటుందని అంచనా వేయగా, తాజా అంచనాలు దాన్ని సుమారు 306 లక్షల టన్నులకు తగ్గించాయి. చెరకులో రెడ్ రాట్, టాప్ బోరర్ వంటి వ్యాధులు, అధిక వర్షాలతో నీటిమునక వంటి పరిస్థితులు ఉత్పత్తిపై ప్రభావం చూపాయి. గత జూలై 20న కిలో చక్కెర ధర సగటున కేజీకి రూ.48.18 పైసలు ఉండగా, ప్రస్తుతం కేజీ ధర రూ.55.70గా ఉంది. కేంద్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం 2026 జూలై 20న కిలో చక్కెర సగటు రిటైల్ ధర రూ.48.18 ఉండగా, ఆగస్టు 20 నాటికి అది రూ.55.70కు చేరింది. అంటే ఒక్క నెలలోనే సుమారు 15.6 శాతం పెరుగుదల నమోదైంది. ఆ తర్వాత కూడా ధరల ఒత్తిడి కొనసాగి, ఆగస్టు 26న సగటు రిటైల్ ధర రూ.65.06కు చేరింది. మళ్లీ వెనుక చూపు చూసే పరిస్థితి కనుచూపు మేరలో కానరాదు. వాతావరణ మార్పులు వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్‌ను ఎంత అస్థిరంగా మారుస్తున్నాయో చక్కెర ధరే మరోసారి గుర్తుచేస్తోంది. చెరకు సాగుకు నీరు అధికంగా అవసరం. ఒకవైపు అధిక వర్షాలు పంటను దెబ్బ తీయవచ్చు. కేంద్ర ప్రభుత్వ వివరణ ప్రకారం, దేశీయ అవసరాలను తీర్చడానికి తగినంత నిల్వలు ఇంకా ఉన్నాయి. కొత్త చెరకు క్రషింగ్ సీజన్ అక్టోబర్‌లో ప్రారంభం కానుంది. కాబట్టి ప్రస్తుతం కనిపిస్తున్న ధరల పెరుగుదలను పూర్తిస్థాయి కొరతగా మాత్రమే చూడలేము. చెరకు నుంచి చక్కెరతో పాటు ఇథనాల్ తయారీకి కూడా ముడి సరుకు మళ్లుతోంది. అందువల్ల వినియోగానికి అందుబాటులో ఉండే చక్కెర పరిమాణం తగ్గుతోందనే వాదన వినిపిస్తోంది. చక్కెర ధరల పెంపునకు, ఇథనాల్ ఉత్పత్తికి సంబంధం లేదని కేంద్ర వినియోగదారులు వ్యవహారాలు, ఆహారం, సరఫరా శాఖ తెలిపింది. 2022-23లో ఇథనాల్ కోసం మళ్లించిన చక్కెర వాటా సుమారు 12 శాతం ఉండగా, 2025-26లో అది సుమారు 9 శాతానికి తగ్గిందని ప్రభుత్వం పేర్కొంది. అలాగే దేశంలో ఉత్పత్తి అవుతున్న ఇథనాల్‌లో దాదాపు మూడు వంతులు ధాన్యాల నుంచి, ముఖ్యంగా మొక్కజొన్న నుంచి వస్తోందని తెలిసిందే. భారతదేశం ప్రపంచంలో అతిపెద్ద చక్కెర ఉత్పత్తి దారుల్లో ఒకటి. 2026-27లో ప్రపంచ చక్కెర లోటు సుమారు 33 లక్షల టన్నులుగా అని వేయబడు తోందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. అంతర్జాతీయ చక్కెర ధర కూడా జూన్ 30న టన్నుకు 474 డాలర్ల నుంచి ఆగస్టు 20 నాటికి 552 డాలర్లకు పెరిగింది అంటే రెండు నెలల్లో 16 శాతానికి పైగా పెరుగుదల. 2026-27 సీజన్‌కు చెరకు రైతులకు 'ఫెయిర్ అండ్ రెమ్యునరేటివ్ ప్రైస్' ను కేంద్ర ప్రభుత్వం ప్రాథమిక రికవరీ రేటు 10.25 శాతానికి క్వింటాల్‌కు రూ.365గా నిర్ణయించింది. రికవరీ పెరిగితే అదనపు ప్రీమియం, తగ్గితే అనుపాత తగ్గింపు విధానం కూడా ఉంది. రైతుకు గిట్టుబాటు ధర లభించాలి. మిల్లులకు ఆర్థిక స్థిరత్వం ఉండాలి. వినియోగదారుడికి సరసమైన ధర ఉండాలి. ఈ మూడు లక్ష్యాలను ఒకేసారి సాధించడమే మంటే జరిగే పని కాదు. చక్కెర విధానానికి అసలు పరీక్ష. చక్కెర ధరల విషయంలో మరో కీలక అంశం హోర్డింగ్ లేదా నిల్వచేసి ధర పెంచే ప్రయత్నాలు, డిమాండ్-సరఫరా మధ్య చిన్న అంతరం ఉన్న సమయంలో పెద్ద మొత్తంలో చక్కెరను మార్కెట్ నుంచి తాత్కాలికంగా వెనక్కి తీసుకోవడం ధరలను వేగంగా పెంచవచ్చు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఆగస్టు 1 నుంచి నవంబర్ 30 వరకు చక్కెర వ్యాపారుల నిల్వలపై పరిమితులు విధించింది. అధిక నిల్వలు, కృత్రిమ కొరతను నిరోధించడమే ఈ చర్య ఉద్దేశమని ప్రభుత్వం తెలిపింది.. ప్రభుత్వం ఇప్పటికే పలు చర్యలు తీసుకుంది. నిల్వల పరిమితులు విధించడం, ఎగుమతులపై నియంత్రణ, మార్కెట్‌నుపర్యవేక్షి ంచడం, అదనపు దిగుమతులకు అనుమతి ఇవ్వడం వంటి చర్యలు తీసుకుంది. తాజాగా ఒక మిలియన్ టన్నుల ముడి చక్కెరను సుంకం లేకుండా దిగుమతి చేసుకునేం దుకు ప్రభుత్వం అను మతించింది. దీని తర్వాత రిటైల్ ధర ఆగస్టు 27న స్వల్పంగా తగ్గినట్లు నివేదికలు చెబుతున్నాయి.. కానీ ఆహార వినియోగానికి అవసరమైన చక్కెర సరఫరాపై ప్రతికూల ప్రభావం పడకుండా విధానాలను సమన్వ యం చేయగలితేనే



మాటల ద్వారా నీ శత్రువుని మిత్రునిగా మార్చుకోలేకపోవచ్చు కానీ మిత్రుడిని శత్రువుగా మార్చుకోవచ్చు.

బెంజమిన్ ఫ్రాంక్లిన్



మానవత్వమే మానవుని అసలైన మతం. దయగల హృదయమే భగవన్నిలయం.

స్వామి వివేకానంద

## ప్రజావాక్కు

### వందేమాతరంపై రాద్ధాంతమెందుకు?

ఒకనెల నుండి పత్రికల్లో వందేమాతరంపై బీజేపీ వాళ్ళు, వందేమాతరం పూర్తిగాపాడకపోతే జైలే అని బెదిరిస్తున్నారు. చట్టం కూడా చేశారు. మూకబలం ఉందని దేవుళ్లను దెయ్యాలను కీర్తిస్తూపాడాలని చట్టం చెయ్యడం ఏమిటి? ఇది నియంతృత్వ పాలనా? మొన్న ఒక చోట కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఖర్గే గారూ,సోనియా గాంధీ గారు వందేమాతరం పాడేటప్పుడు ఎప్పటి లాగా మొదటి రెండు చరణాలుపాడిన తరువాత ఇకచాలు అని సోనియాగాంధీ గారు అన్నారు. అందుకు బీజేపీ మూక వందేమాతరం పూర్తిగా పాడక పోతే జైలే గతి అని తెగ బెదిరిస్తున్నారు. చాలా దుర్మార్గం.మిగిలిన చరణాలలో దుర్గాదేవిని స్తుతిస్తూ ఉన్నాయి. వంద సంవత్సరాల క్రితమే ఈ వివాదం ఉన్నది. కానీ అదే ఆనవాయితీ కొనసాగుతుంది. వంద సంవత్సరాల నుండి లేని ఈ వివాదం ఇప్పుడెందుకు? సెక్యులర్ విదానం వైపు ఆలోచిస్తే బాగుంటుంది.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### హోమ్‌స్టేలను ప్రోత్సహించాలి

తెలంగాణలో హోమ్‌స్టేలను ప్రోత్సహించాలన్న రాష్ట్ర ప్రభుత్వ ఆలోచన పర్యాటక రంగంలో స్థానిక కుటుంబాలకు కొత్త అవకాశాలను అందించగలదు. చారిత్రక కట్టడాలు, ఆధ్యాత్మిక క్షేత్రాలు, ప్రకృతి సోయగాలు, జానపద సంస్కృతి, గ్రామీణ జీవనశైలితో తెలంగాణకు ప్రత్యేక పర్యాటక ఆకర్షణ ఉంది. అయితే పర్యాటకాభివృద్ధి కొద్ది ప్రముఖ ప్రాంతాలకేపరిమితం కాకుండా,గుర్తింపు పొందని ప్రాంతాలకూ విస్తరించాల్సిన అవసరం ఉంది.ఈ విషయంలో హోమ్‌స్టేలు కీలకపాత్ర పోషించవచ్చు. హోమ్‌స్టేల్లో బస చేసే పర్యాటకులకు స్థానిక జీవన విధానం, ఆహారపు అలవాట్లు, సంప్రదాయాలు, సంస్కృతిని దగ్గరగా తెలుసుకునే అవకాశం లభిస్తుంది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### ఎస్సీ,ఎస్టీ ఉద్యోగులపై వివక్షత ?

వికలాంగుల హక్కుల చట్టం వచ్చి 10 సంవత్సరాలు అవుతున్న కూడా ఆఫీసులలో, విద్యాసంస్థలలో వికలాంగులపై అధికారులు వివక్ష చూపుతున్నారు. 1989 ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం వచ్చి 37సంవత్సరాలు అవుతున్న కూడా వికలాంగులపై ఈసడింపులు, దూషణలు, దుర్భాషలాడుతున్నారు. వికలాంగుల చట్టంపై చైతన్య కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించాలి.

- కదురు శ్రీనివాస్, వరంగల్

### భారీ విధ్వంసం అల్పదేశాలకు అపార నష్టం

వర్షాలు లేవు కాని వరదలు ముంచెత్తడం విడ్డూరం.ప్రకృతి వైపరీత్యాల వలనభూకంపాలు, తుఫానులు, వరదలు వంటి మానవ నియంత్రణకు అందనిసహజ సిద్ధమైన ప్రమాదాలు. ఇవి సమాజంపై, ప్రాణ, ఆస్తుల, పర్యావరణంపై తీవ్రమైన ప్రభావాన్ని చూపుతాయి. భూగర్భంలో పలకల కదలికల వల్ల భూమి కంపించడం భూ కంపాలు,సముద్రాలపై ఏర్పడే తీవ్రమైన గాలులు, భారీ అలలు, తుఫానులు, సునామీలు, అతివృష్టి వల్ల ముంపు లేదా వర్షాలు లేక నీటి ఎద్దడి ఏర్పడటం వరదలు, కరవు, వర్షాలు లేదా భూకంపాల కారణంగా కొండలు కూలడం, కొండచరియలు విరిగి పడటం, వేలాది మంది ప్రజలు మూగజీవాలు మరణించి ప్రాణ నష్టం, ఇళ్లు, రోడ్లు, విద్యుత్ వ్యవస్థలు పూర్తిగా ధ్వంసమై ఆస్తి నష్టం, ఉపాధి కోల్పోవడం, వ్యవసాయం నాశనం కావడం ఇవన్నీ మన కళ్లముందే నేపాల్ టిబెట్‌లలో జరిగాయి.

- డా.దన్నాన అప్పలనాయుడు, విజయనగరం

### సరైన నిర్ణయం తీసుకోవాలి

కొన్ని వేల ఏళ్ల క్రితం మనిషి జీవనంలో ప్రకృతి విస్తృతంగా ఉండేది. దానిమీదే దినం గడిపే వారు. కాయాకష్టం వల్ల శరీరాలు ధారుడ్యం, పూర్తి రోగనిరోధక శక్తి ఉండేది. ఆకులు, గింజల వైద్యం వారికి శరణ్యం. అది అప్పటి పరిస్థితి. గానీ ఇప్పుడు వైద్యశాస్త్రం విస్తృతంగా పెరిగి రోగ నిర్ధారణతో వైద్యం ఫలితం ఇస్తుంది. కొందరి దేహస్థితి కొన్ని పదార్థాలకు వికృతంగా కనిపిస్తుంది.అందుకు శరీర లక్షణాలు చూడకుండా అల్లోపతి వైద్యం చేయరాదు. అలానే పాత ఆకుల రసం అందరికీ పనిచేయదు. అది గుర్తెరిగి గ్రామాల వైద్యులు రోగి స్థితి బట్టి దగ్గరి వైద్యశాలకు పంపాలి.

- బొల్లోజు మేజ్ఞాధం, విశాఖపట్నం

### పాకిస్థాన్‌కు మానవత్వం ఉందా?

మనుషుల గురించి వారి హక్కుల గురించి ప్రస్తావిస్తున్న నేటి కాలంలో పాకిస్థాన్ అనుసరిస్తున్న వైఖరి మూదావాహం. ఇమ్రాన్ రాజకీయంగా ఎన్ని తప్పులు చేసారు అనేది పక్కన పెడితే ఇమ్రాన్ ముందు ఒక మనిషి అని గుర్తించండి. అతను పాకిస్థాన్ క్రీడా పతాకాన్ని ప్రపంచం ముందట ఎగరావేసినవాడు. ప్రపంచం మెచ్చిన మేటి ఆల్రౌండర్స్‌లో ఒకడు. అందుకే 20కి పైగా ప్రపంచ మాజీ సారధులు ఆయనకు మంచి వైద్యం అందించాలని బహిరంగ లేఖ రాశారు.మాకు మానవత్వం ఉందని పాకిస్థాన్ ప్రపంచానికి చాటుతుందా?

-భారత అవినాష్, జనగామ

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన వి | ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# మాటలకందని విషాదమిది !

**ఏటా లక్షలాది మంది ఉపద్రవాలతో ప్రాణాలు వదులుతుంటే కోట్ల సంఖ్యలో బాధితులుగా మారుతున్నారు. మరెందరో రోగ పీడితులవుతున్నారు. ఇక ఆస్తుల నష్టం గురించి చెప్పాల్సిన పనిలేదు. సాంకేతిక పరిజ్ఞానం ఎంత సంపాదించినా ఆధునికంగా ఎంత పురోభివృద్ధిలో పయనించినా ప్రకృతి ముందు తలవంచని పరిస్థితులనుండి మానవుడు బయట పడలేకపోతున్నారు. మరొక పక్క తుపానుల బారి నుంచి తీరప్రాంతాలు తప్పించుకో లేకపోతున్నాయి. గతంలో దివి సీమలో సంభవించిన తుపాను సిరిధాన్యాలతో తులతూగే దివిసీమను శవాలసీమగా మార్చివేసింది. ఇప్పటికీ ఆ భీభత్సం గురించి కథలుకథలుగా చెప్పుకుంటారు. ఇక మహా రాష్ట్ర లోని లాతూరులో సంభవించిన భూకంపం ఎన్నో కుటుం బాలను చిదిమేసింది. సునామిల గురించి చెప్పాల్సిన పని లేదు. ఇలా ఎన్నో వైపరీత్యాలు అతలాకుతలం చేస్తున్నాయి.**

దామెర్ల సాయిబాబ

తమలపాకుతో నువ్వల్లంటె తలుపుచెక్కతో నెనిట్లంటా అన్నట్లుగా వ్యవహరిస్తున్నది మానవాళితో ప్రకృతి. విశ్వవ్యాప్తంగా మానవతప్పిదాలవల్లనే విపత్తులు ఒకదాని వెంట ఒకటి తోసుకువస్తున్నాయి. అపార ప్రాణఆస్తి నష్టాలకు కారణం అవుతున్నాయి. వాతావరణంలో తలెత్తు తున్న అనూహ్య మార్పులు ప్రకృతి వైపరీత్యాలకు దారి తీస్తున్నాయి. ఇందుకు ప్రధానంగా తప్పుపట్టాల్సి ంది నిందించాల్సి ంది మానవుని పర్యావరణ విధ్వంసక చర్యలే. భీభత్సా లకు విపత్తులకు కారణం అవుతున్నాయని ఎన్నో అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. పర్యావరణాన్ని కాపాడు కోలేకపోతే మానవుని మనుగడే భవిష్యత్తులో ప్రశ్నార్థకంగా మారుతుందని ఎందరో పర్యావరణ శాస్త్రవేత్తలు దశాబ్దాల తరబడి పదేపదే ఆందోళన వ్యక్తంచేస్తున్నా పట్టించుకున్న నాధుడే లేకుండా పోతున్నాడు. పర్యావరణాన్ని కాపాడటం అటుంచి తూట్లు పొడవడం దురదృష్టకరం. అభివృద్ధి పేరు తో ఆయా దేశాల ప్రభుత్వాలు చేస్తున్న కొన్ని కార్యక్రమాలు పర్యావరణానికి చేటుచేస్తున్నాయి. తాజాగా ప్రకృతి ధాటికి బుధవారం నేపాల్ చివురుటాకులాగా వణికిపోయింది. రాజధాని ఖాట్మండు సమీపంలోని రాసువా, దాడింగ్ జిల్లాల ఎగువ ప్రాంతాల్లో సంభవించిన ప్రకృతి ప్రకోపంతో మంచు కొండ విరిగి పడటంతో అనూహ్యరీతిలో నది ప్రవాహం నీటిమట్టాలు పెరిగాయి. ఒక్కసారిగా మెరుపు వరదలు సంభవించి లోతట్టుప్రాంతాలను ముంచెత్తివేసాయి.నదీ పరివాహక ప్రాంతాలు మట్టిదిబ్బలుగా మారిపోయాయి. టిబెట్‌లో మొదలయిన వరద, బురద ఉప్పెన ఉరుములేని మెరుపుల్లా వచ్చి నేపాల్‌మధ్యప్రాంతాన్ని దాదాపు తుడిచి పెట్టేసిందనే చెప్పొచ్చు. గ్రామాలు, పట్టణాలు జలసమాధి అయ్యాయి. ఇప్పటివరకూ అందిన సమాచారం ప్రకారం దాదాపు వేయి మందికి పైగా మృతి చెందినట్లు చెపుతున్నారు. మరో రెండువేల మందికి పైగా గల్లంతయి నట్లు సమాచారం. ఇందులో భారతీయులు మూడు వందల మందికి పైగా ఉన్నారంటున్నారు. వాస్తవంగా నేపాల్, టిబెట్ సరి హద్దుల్లోని బోటికోశి నది బుధవారం ఉదయం ఒక్కసారిగా ఉప్పొంగింది. అమెరికా, మలేసియా, దక్షిణాఫ్రికా, బ్రిటన్, నెదర్లాండ్స్, దక్షిణకొరియా తదితర దేశాలనుంచి వచ్చిన పర్యాటకుల జాడ తెలియడంలేదని చెపుతున్నారు. ఆ వరద ధాటికి నేపాల్ చైనా రోడ్డు మార్గంపూర్తిగా ధ్వంసం అయింది. ఎటుచూసినా అడుగుల ఎత్తులో పేరుకుపోయిన బురద సాయం కోసం అర్థిస్తున్న జనం హాహాకారాలతో ఆ ప్రాంతం విషాద వాతావరణం రాజ్యమేలింది. బురదలో కురుకు పోయిన మృత దేహాలను బయిటికి తీస్తున్నారు. సమాచారం అందుకున్న నేపాల్ సైన్యం సాయుధ పోలీస్ బలగాలు, నేపాల్ పోలీసులు జాతీయ విపత్తు విభాగ బలగాలు హుటాహుటిన రంగంలోకి దిగి బాధితులను కాపాడేందుకు సహాయక చర్యలు యుద్ధప్రాతిపదికన చేపట్టారు. రోడ్లు బురదతో కప్పుకు పోవడంతో వాయు మార్గంలో తప్ప ఆ పన్నులకు చేయూత నివ్వలేకపోతున్నారు.. వాతావరణంలో వేగంగా వస్తున్న మార్పులు హిమాలయ పర్వతాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని వాతావరణ నిపుణుల హెచ్చరికలు పట్టించుకొనే నాధుడే లేకుండా పోయారు. ఫలితంగా హిమాలయాలు వరదలు, భూప్రకంపనాలు, మంచుకొండలు విరిగి పడడంలాంటి ఉపద్రవాలు తోసుకవస్తున్నాయి. 2013లో

## ఒక్క మాట

ఉత్తరాఖండ్ జలవిలయం 5వేల నాలుగు వందల మందిని పొట్టను పెట్టుకున్నది. ప్రస్తుతం జరిగిన ప్రకృతి భీవత్సం ఎంతమందిని బలి తీసుకొన్నదో మరికొంత సమయం అయితే తప్ప తెలియదు. పర్యావరణానికి మానవుడు చేస్తున్న హానికి రెట్టింపు స్థాయిలో ప్రకృతి మానవుడిపై విరుచుకు పడుతున్నదనేందుకు ఇవి సజీవ సాక్ష్యాలు. ఇష్టానుసారంగా రోడ్లనిర్మాణాలు మొదలు పెడితే కొండలను తొలిచి ప్రాజెక్టులు నగరీకరణ పేరుతో ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది ఎకరాల పంటపొలాలను జనావాసాలుగా మార్చడం ఒకటేమిటి ఎన్నివిధాలుగా పర్యావరణానికి నష్టం చేయ గలుగుతారో అన్ని మార్గాల్లోచేసే నిరంతర అన్వేషణ కొనసాగుతూనే ఉంది. ఐక్యరాజ్యసమితి అంచనా ప్రకారం భారత జనాభా వచ్చే పదేళ్లలో 150 కోట్లకు చేరుతుందని, అందుకు తగినట్లుగా సహజవనరులపై ఒత్తిడి పెరుగుతున్నదని, ప్రధానంగా అటవీ సంపద హరించుకు పోతున్నదని స్పష్టంచేసింది. దాదాపు 330 ఎకరాలకుపైగా అటవీ సం పద అదృశ్యం అయిపోతున్నదని ఐక్యరాజ్య సమితి నివేదిక వెల్లడించింది. బొగ్గు గనులు, థర్మల్ విద్యుత్ కేంద్రాలు, పరిశ్రమలు నదీలోయ ప్రాజెక్టులకోసం యధేచ్ఛగా అడవులు నరికివేస్తున్నారు. ఇలాంటి కారణాలెన్నో పర్యావరణానికి విఘాతం కలిగిస్తున్నాయి. ఇక ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించలేకపోతున్నారు. ఇందువల్ల పర్యావరణానికి ఎదుర వుతున్న నష్టం అంతా ఇంతా కాదు. ప్లాస్టిక్ సంచి మట్టిలో కలిసిపోవడానికి కొన్ని వందల సంవత్సరాలు పడుతున్నది. కొన్ని ప్లాస్టిక్ వస్తువులను నిషేధించినా అవి కాగితాలకే పరిమితం అవుతున్నాయి. పర్యాటకులు పెరగడంతో హిమాలయాల్లో కూడా ప్లాస్టిక్ వ్యర్థాలు పెరిగి వాతావరణాన్ని కలుషితం చేస్తున్నాయి. ఇక పెట్రోలు, డీజిల్ లాంటి ఇంధన వాడకం పెరిగి పర్యావరణానికి చెటుచెస్తున్నాయి. వాహన కాలుష్యంతోపాటు పరిశ్రమలు వదులుతున్న పొగ అన్నీ కలిపి వాయుకాలుష్యాన్ని పెంచుతున్నాయి. ఇలాంటి రకరకాల కారణాలతో భూమి ఉష్ణోగ్రత పెరిగిపోక తప్పదు. ఇదే పరిస్థితి కొనసాగితే ప్రపంచ వ్యాప్తంగా కూడా ఉష్ణోగ్రత లు పెరిగి దీవులతో సహా అనేక దేశాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని ఏనాటి నుంచే పర్యా వరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.ఇలా మనిషి ప్రకృతితో ఆటలాడుకుంటుంటే అందుకు ప్రతిగా ప్రకృతి తీవ్రంగానే స్పందిస్తున్నది. పర్యా వరణ సమతుల్యం దెబ్బతిన్న కారణంగా సకాలంలో వర్షాలు కురవకపోవడం కురిస్తే ఒకేసారి ప్రాంతంలో కుంభ వృష్టి కురవడం, ఎల్‌నినోలు ఏర్పడటం లాంటివి ఇటీవలి కాలంలో పెరిగి పోతున్నది. ప్రస్తుతం భారత్ సూపర్ ఎల్‌నినోను ఎదు ర్కొంటున్నది. వ్యవసాయ రంగం కోలుకోలేకపోతున్నది. అంతేకాదు వరదలు తుఫానులతోపాటు భూకంపాలు లాంటి ఉపద్రవాలు కూడా చోటుచేసుకుంటున్నాయి. ఏటా దాదాపు మూడు వందలఎనభైకి పైగా ప్రపంచ వ్యాప్తంగా ఉపద్రవాలు సంభవిస్తున్నట్లు అధికార రికార్డులు వెల్లడిస్తున్నాయి. లక్షలాది మంది ఉపద్రవాలతో ప్రాణాలు వదులుతుంటే కోట్ల సంఖ్యలో బాధితులుగా మారుతు న్నారు. మరెందరో రోగ పీడితులవుతున్నారు. ఇక ఆస్తుల నష్టం గురించి చెప్పాల్సిన పనిలేదు. సాంకేతిక పరిజ్ఞానం ఎంత సంపాదిం చినా ఆధునికంగా ఎంత పురోభివృద్ధిలో పయనించినా ప్రకృతి ముందు తలవంచని పరిస్థితులనుండి బయట పడలేకపోతున్నారు. మరొక పక్క తుపానుల బారి నుంచి తీరప్రాంతాలు తప్పించు కోలేకపోతున్నాయి. గతంలో దివి సీమలో సంభవించిన తుపాను సిరిధాన్యాలతో తులతూగే దివిసీమను శవాలసీమగా మార్చి వేసింది. ఇప్పటికీ ఆ భీభత్సం గురించి కథలుకథలుగా చెప్పుకుం టారు. ఇక మహారాష్ట్రలోని లాతూరులో సంభ వించిన భూకంపం ఎన్నో కుటుంబాల ను చిదిమేసింది. సునామిల గురించి చెప్పాల్సిన పని లేదు. ఇలా ఎన్నో వైపరీత్యాలు అతలాకు తలం చేస్తున్నా యి. వెనుకబడిన ప్రాంతాల్లో నిర్మితమవు తున్న రైల్వే ప్రాజెక్టుల వల్ల ఆర్థిక కార్యకలా పాలు ఊపందుకుని అభివృద్ధి చెందు తాయనే మాట వాస్తవమే అయినా అందు వల్ల జరుగుతున్న నష్టం తక్కు వేమీ కాదని వ్యతిరేకించే వారు కూడా తక్కువ సంఖ్యలో లేరు. నిరంతరం రైళ్ల రాకపోకల వల్ల పెళుసుగా ఉండే కొండలు మరింత బలహీనపడతాయని ఆందోళన వ్యక్తం చేస్తు_న్నారు. వరదల్లో సర్వం కోల్పయిన వారికి ఆపన్న హస్తం అందివ్వలసిన తరుణమిది. ఏదిఏమైనా ఈ ఉపద్రవాల నియంత్రణ పర్యావరణాన్ని కాపాడుకునేం దుకు త్రికరణ శుద్ధిగా కృషి చేయాల్సి ఉంది. ఇందులో ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా ఇలాంటి ఇంకెన్నో ఉపద్రవాలతో భారీ మూల్యం చెల్లించక తప్పదు. ●

# పరీక్షా వ్యవస్థకు ప్రక్షాళన అవసరం!

ఎన్.సీతారామయ్య

ఒక పరీక్ష వెనుక ఒక విద్యార్థి భవిష్యత్తు మాత్రమే కాదు ఒక కుటుంబం ఆశలు, తల్లిదండ్రుల త్యాగం, ఎన్నో ఏళ్ల కష్టం ఉంటాయి. అందుకే పోటీ పరీక్షల నిర్వహణలో చిన్న లోపం జరిగినా దాని ప్రభావం వేలాది మంది జీవితాలపై పడుతుంది. ఇటీవల పరీక్షలకు సంబంధించిన ఆరోపణలు, దర్యాప్తులు, న్యాయపరమైన పరిణామాలు పరీక్షా వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని మరోసారి ప్రశ్నార్థకంగా మార్చాయి. పోటీ పెరుగుతున్న కొద్దీపరీక్షల నిర్వహణలో ప్రభుత్వాల బాధ్యత కూడా అంతే పెరగాలి. ప్రశ్నపత్ర భద్రత నుంచి ఫలితాల ప్రకటన వరకు ప్రతి దశలో స్పష్టమైన ప్రమాణాలు అవసరం. పరీక్ష రద్దు, పునఃపరీక్ష వంటి నిర్ణయాలు అనివార్యమైన సందర్భాల్లో తీసుకోవాల్సి వచ్చినా, వాటి భారాన్ని మోయాల్సింది విద్యార్థులే కాకూడదు. న్యాయబద్ధత,సమాన అవకాశాలు, పారదర్శకత పరీక్షా వ్యవస్థకు మూల సూత్రాలుగా ఉండాలి. ఈ అంశాల ప్రాధాన్యాన్ని న్యాయస్థానాలు కూడా వివిధ సందర్భాల్లో గుర్తించాయి. పరీక్షా సంస్కరణల కోసం కేంద్ర ప్రభుత్వం మాజీ ఇస్రో ఛైర్మన్ డాక్టర్ కె. రాధాకృష్ణన్ అధ్యక్షతన నిపుణుల కమిటీని ఏర్పాటు చేసి పరీక్షా ప్రక్రియ, డేటా భద్రత, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ పని తీరుపై సిఫారసులు కోరింది. అక్రమాలను అరికట్టేందుకు పబ్లిక్ ఎగ్జామినేషన్స్ చట్టాన్ని కూడాఅమల్లోకి తీసుకువచ్చింది. ప్రశ్నపత్రం లేదా సమాధాన కీకి సంబంధించిన అక్రమాలు, కంప్యూటర్ వ్యవస్థల్లో అనధికార జోక్యంపై చర్యలకు ఇందులో నిబంధనలున్నాయి. అయితే చట్టం ఉండటమే కాదు దాని అమలువేగంగా, కచ్చితంగా ఉండా లి. సాంకేతిక భద్రతపై కూడా ప్రత్యేక దృష్టిఅవసరం. ప్రశ్నపత్రం తయారీ, ముద్రణ, రవాణా, నిల్వ,పరీక్షనిర్వహణ, మూల్యాంకనం వరకు బహుళస్థాయి భద్రతావ్యవస్థ ఉండాలి. అవసరమైన చోట బయోమెట్రిక్ ధ్రువీకరణ, సీసీటీవీ పర్యవేక్షణ, స్వతంత్ర సాంకేతిక ఆడిట్లను బలోపేతం చేయాలి. ఒకసారి జరిగిన తప్పిదాన్ని గుర్తించడం కంటే, అది మళ్లీజరగకుండా వ్యవస్థను మార్చడమే అసలుసంస్కరణ. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే పేద, మధ్యతరగతి కుటుంబాల యువత ఎన్నో ఏళ్లకష్టం, ఆర్థిక భారంతో ఉద్యోగాల కోసం పోరాడుతున్నారు. పరీక్షలపై అనుమానాలు, నియామకాల ఆలస్యం వారి ఆత్మవిశ్వాసాన్ని దెబ్బ తీయడమేకాక కుటుంబాల ఆశలపైనా ప్రభావం చూపుతుంది. ప్రతిపరీక్షా సంస్థకు స్పష్టమైన జవాబుదారీతనం ఉండాలి. పరీక్ష రద్దు, పునఃపరీక్ష లేదా ఇతర మార్పులపై విద్యార్థులకు సమయానికి సమాచారం ఇవ్వాలి.ఫిర్యాదుల పరిష్కారానికి కాలపరిమితి కూడా ఉండాలి. ఈ వ్యవహారంలో మీడియా, ప్రజాచర్చల బాధ్యత కూడా కీలకం. ఆరోపణను తీర్పుగా, దర్యాప్తును తుదినిర్ణయంగా చూపకూడదు. అదేసమయంలో వ్యవస్థలోని లోపాలను ప్రశ్నించడం, పారదర్శకతను కోరడం ప్రజాస్వామ్య సమాజంలో అవసరమైన బాధ్యత. యువత చేతుల్లో దేశ భవిష్యత్తు ఉందని చెబుతున్నప్పుడు, వారి కష్టానికి న్యాయం చేసే వ్యవస్థను నిర్మించాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వాలదే. పరీక్షా మందిరంలోకి వెళ్లే ప్రతి విద్యార్థికి నా కష్టానికి న్యాయం జరుగుతుంది అనే నమ్మకం ఉండాలి. ఆ నమ్మకమే పోటీ పరీక్షల అసలు బలం. ●

# సామాన్యుడికి భారంగా మారిన ధరలు

మేకిరి దామోదర్

వంటింటి పొయ్యి వెలిగితేనే కుటుంబ జీవితం సజావుగా సాగుతుంది. కానీ ఆ పొయ్యి మీద గిన్నె పెట్టే ప్రతి కుటుంబానికీ ఇప్పుడు ధరల మంట తప్పడం లేదు. పేదవాడి పళ్లెం నుంచి మధ్యతరగతి కుటుంబం నెలవారీ బడ్జెట్ వరకు ద్రవ్యోల్బణం ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. జీతం పెరగకముందే కిరాణా బిల్లు పెరగడం, ఆదాయం పెరుగుదల కంటే ఖర్చులు వేగంగా పరుగెత్తడం సామాన్యుడి ఆందోళనకు కారణమవుతోంది. ఒకవైపు బియ్యం, పప్పులు, నూనెలు, చక్కెర వంటి నిత్యావసరాలు మరోవైపు కూరగాయలు, ఉల్లి, వెల్లుల్లి, మిరప వంటి వంటింటి సరుకుల ధరలు కుటుంబ ఆర్థిక లెక్కలను తలకిందులు చేస్తున్నాయి. ఇది కేవలం మార్కెట్‌లో ధరల మార్పు మాత్రమే కాదు. ఆహార ధరలు పెరిగితే కుటుంబాలు ముందుగా తగ్గించేది పోషకాహారాన్నే. పండ్లు, పాలు, కూరగాయలు, పప్పుల వినియోగం తగ్గితే దాని ప్రభావం ప్రజల ఆరోగ్యంపైనా పడుతుంది. అందుకే నిత్యావసరాల ధరల నియంత్రణ అనేది కేవలం ఆర్థిక అంశం కాదు.ప్రజా సంక్షేమానికి సంబంధించిన అత్యంత కీలకమైన బాధ్యత. కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ ధరల పర్యవేక్షణ గణాంకాల ప్రకారం దేశవ్యాప్తంగా సుమారు సగటు చిల్లర ధర బియ్యం కిలోకు రూ.45.70,కందిపప్పు,రూ.122.12, మినపప్పు రూ.121.76, పెసరపప్పు రూ.110.76, చక్కెర రూ.62.47, బెల్లం రూ.64.79గా నమోదైంది.వంటనూనెల ధరలు కూడా సాధారణ కుటుంబాలపై భారాన్ని పెంచుతున్నాయి. కూరగాయల్లో ఉల్లి ధరలు ప్రత్యేకంగాఆందోళన కలిగిస్తున్నాయి. ఆగస్టు 23 నాటికి దేశ సగటు చిల్లర ధర కిలోకు రూ.42.04గా ఉండగా, కొన్ని ప్రాంతాల్లో స్థానిక సరఫరా పరిస్థితుల కారణంగా ధరలు మరింత ఎక్కువగా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఉల్లి ధరలు జూన్‌లో కిలోకు సుమారు రూ.25 ఉండగా ఆగస్టులో కొన్ని మార్కెట్లలో రూ.60 వరకు చేరినట్లు తాజా నివేదికలు చెబుతున్నాయి. చక్కెర ధరల పెరుగుదల కూడా ప్రత్యేకంగా గమనించాల్సిన పరిణామం. పండుగలు, శుభకార్యాల సీజన్ సమీపిస్తున్న వేళ చక్కెరకు డిమాండ్ పెరుగుతోంది. దేశీయ చక్కెర ధరలు రెండు నెలల్లో దాదాపు 40శాతం పెరిగిన నేపథ్యంలో, ధరలను అదుపులోకి తెచ్చేందుకు కేంద్రం ఒక మిలియన్ టన్నుల ముడి చక్కెరను సుంకం లేకుండా దిగుమతి చేసుకునేందుకు అనుమతించింది. ఈ పరిస్థితుల్లో శుభకార్యాలు, పండుగలు నిర్వహించే కుటుంబాలపై అదనపు భారం పడుతోంది. పిండి వంటలకు చక్కెర, బెల్లం,నూనె, పప్పులు, నెయ్యి, పూజలకు పూలు,పండ్లు,అన్నింటి ధరలు పెరిగితే ఒక చిన్న కుటుంబ కార్యక్రమం కూడా మధ్యతరగతి కుటుంబానికి పెద్ద ఆర్థిక భారంగా మారుతుంది. ధరల పెరుగుదలకు ఒక్క కారణాన్నే చూపడం సరికాదు. ఉత్పత్తి తగ్గడం, వాతావరణ మార్పులు,అకాల వర్షాలు,పంట నష్టాలు, నిల్వల వ్యయం, రవాణా ఖర్చులు, సరఫరా అంతరాయాలు, మార్కెట్‌లో మధ్యవర్తుల ప్రభావం వంటి అనేక



అంశాలు ధరలపై ప్రభావం చూపుతాయి. ముఖ్యంగా కూరగాయలు, ఉల్లి వంటి త్వరగా పాడయ్యే ఉత్పత్తుల్లో ధరల హెచ్చుతగ్గులు ఎక్కువగా ఉంటాయి. క్రిసిల్ తాజా రోటీ రైస్ రేట్ నివేదిక ప్రకారం 2026 జూలైలో ఇంట్లోతయారు చేసే శాఖాహార భోజనం ఖర్చు ఏడాది ప్రాతిపదికన 4 శాతం, మాంసాహార భోజనం ఖర్చు 9శాతం పెరిగింది. ఉల్లి, వంటనూనె, ఎల్పీజీ ధరలు దీనికి ప్రధాన కారణాలుగా పేర్కొంది. ఉల్లిధర ఏడాది కాలంలో 20శాతం పెరిగినట్లు కూడా నివేదిక తెలిపింది. ఇక జూలై 2026లో దేశ రిటైల్ ద్రవ్యోల్బణం 4.45 శాతానికి, ఆహార ద్రవ్యోల్బణం 5.52 శాతానికి పెరిగింది. మొత్తంగా రిటైల్ ద్రవ్యోల్బణం ఆర్బీఐ లక్ష్యమైన 4శాతాన్ని వరుసగా రెండో నెల అధిగ మించింది. ధరలు పెరిగిన ప్రతిసారీ ప్రభుత్వాలు వాతావ రణ పరిస్థితులను, ఉత్పత్తి తగ్గుదలను కారణాలుగా చూప డం సహజమే. అవి వాస్తవ కారణాలే అయినా వినియోగ దారుడికి మాత్రం కారణం కంటే ఉపశమనం ముఖ్యం. అందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందస్తు ధరల పర్య వేక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలి. రైతుకు గిట్టుబాటు ధర లభించేలా చూడడంతో పాటు వినియోగదా రుడిపై అనవసర భారాన్ని పడకుండా సరఫరా గొలుసు లోని లోపాలను సరిదిద్దాలి. నిల్వ సదుపాయాలుపెంచడం, పంటల ముందస్తు అంచనాలు రూపొందించడం, అవసర మైన చోట బఫర్ స్టాక్‌లను విడుదల చేయడం, అక్రమ నిల్వలు కృత్రిమ కొరతపై కఠిన చర్యలు తీసుకోవడం, రైతు నుంచి వినియోగదారుడి వరకు మధ్యవర్తిత్వ వ్యయా న్ని తగ్గించడం వంటి చర్యలు అత్యవసరం. ఉల్లి ధరల పెరుగుదలను అరికట్టేందుకు బఫర్ స్టాక్‌ను వినియోగించి ప్రత్యేక రవాణా చర్యలు చేపట్టడం వంటి నిర్ణయాలు కూడా ప్రభుత్వం తీసుకుంది. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగితే దాని ప్రభావం కేవలం వంటింటితో ఆగదు. ఆహారం, విద్య, వైద్యం, రవాణా, ఇల్లు వంటి ప్రతి అవసరంపై కుటుంబాల ఖర్చు పెరుగుతుంది. ఆదాయం పరిమితంగా ఉన్న పేద, దిగువ మధ్యతరగతి కుటుంబాలు పొదుపును తగ్గించుకోవాల్సి వస్తుంది. చివరకు అప్పులపై ఆధారపడే పరిస్థితి ఏర్పడే ప్రమాదం ఉంది. మధ్యతరగతి కుటుంబాలకూ నెలవారీ బడ్జెట్‌లో అత్యవసర ఖర్చుల వాటా పెరుగుతుంది. అందువల్ల ధరల పెరుగుదలను కేవలం గణాంకాలుగా కాకుండా ప్రజల జీవన వ్యయంగా ప్రభుత్వాలు చూడాలి. మార్కెట్‌లో సరఫరా డిమాండ్ సమతుల్యత దెబ్బతినకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి. రైతు ఉత్పత్తికి సరైన మార్కెట్ కల్పిస్తూనే వినియోగదారుడికి అందుబాటు ధరలో వస్తువులు లభించేలా విధానాలను రూపొందించాలి. రైతు, వ్యాపారి, వినియోగదారుడు ఈ మూడు వర్గాల ప్రయోజనాల మధ్య సమతుల్యతే స్థిరమైన పరిష్కారం. ధరల మంటను ఆర్పడం ఒక్కరోజులో సాధ్యమయ్యే పని కాదు. కానీ సమర్థవంతమైన పర్యవేక్షణ, సరఫరా నిర్వహణ, నిల్వల నియంత్రణ, రైతుకు ప్రోత్సాహం, వినియోగదారుడికి రక్షణ వంటి చర్యలను సమన్వయంతో అమలు చేస్తే ధరల ఒత్తిడిని గణనీయంగా తగ్గించవచ్చు. వంటింటి పొయ్యిమీద మంట ఆహారాన్నివండాలి. కుటుంబాల ఆర్థిక భవిష్యత్తును కాల్చకూడదు. నిత్యావసరాల ధరలు సామాన్యుడి అందుబాటుకు దూరమైతే అభివృద్ధి గణాంకాలన్నీ అర్థరహితమే. అందుకే ప్రభుత్వాలు ధరల నియంత్రణను తాత్కాలిక చర్యగా కాకుండా నిరంతర ప్రజా విధానంగా చేపట్టాలి. పేదవాడి పళ్లెంలో అన్నం, మధ్యతరగతి ఇంట్లో ప్రశాంతత ఉండేలా అందుబాటు ధర-అందరికీ ఆహారం అనే లక్ష్యంతో పాలన

MN 5 PAGE-GNT fffff:MN 5 PAGE-GNT 01/01/2001 10:40 Page 1



# గుంటూరు వార్త

## ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్‌గా కొణిదెల నాగబాబు ప్రమాణ స్వీకారం



**మంగళగిరి, ఆగస్టు 28, ప్రభాతవార్త :** జనసేన పార్టీ ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు ఆంధ్రప్రదేశ్ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించారు. మంగళగిరిలోని అరణ్య భవన్ లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో నాగబాబు తమ సతీమణి పద్మజతో కలసి పాల్గొన్నారు. తొలుత వేద పండితుల సమక్షంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం నాగబాబు ఆంధ్రప్రదేశ్ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్ గా బాధ్యతలు చేపట్టారు. రాష్ట్రంలో పర్యావరణ పరిరక్షణ, హరిత కార్యక్రమాల నిర్వహణ బాధ్యతలను ఆయన ఈ పదవి ద్వారా నిర్వర్తించనున్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్ గా బాధ్యతలు చేపట్టిన జనసేన పార్టీ ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు ను ఆటోనగర్లోని ఆయన కార్యాలయంలో నియోజకవర్గ జనసేన పార్టీ సీనియర్ నాయకులు కంకణాల శంకర్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు సమర్థవంతంగా బాధ్యతలు నిర్వర్తించి ప్రజా మన్ననలను పొందాలని కంకణాల శంకర్ ఆకాంక్షించారు.

## భక్తి శ్రద్ధలతో మహా పూర్ణాహుతి

**గుంటూరు కల్చరల్,ఆగస్టు 28,ప్రభాతవార్త :** స్థానిక ఆర్.అగ్రహారంలోని శ్రీ శృంగేరి శారదా పీఠ పాలిత శ్రీసీతా రామనామ సంకీర్తన సంఘం,శ్రీరామనామక్షేత్రంలో ట్రస్టీస్ రాగం వెంకట లీలాసుందరి,మస్తాన్‌రావు దంపతుల ఆధ్వర్యంలో శ్రావణ శుద్ధ త్రయోదశి మంగళవారం ఆగస్టు 25 నుంచి 28శుక్రవారం వరకు పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్న క్రమంలో శుక్రవారం ఉదయం పూజాకార్యక్రమాలు నిర్వహిస్తున్న క్రోసూరి కృష్ణమాచార్యులు,ఆలయ అర్చక బృందం ఆధ్వర్యంలో యాగశాలలో చతుస్థానార్చనలు,శాంతిహోమం మహాపూర్ణాహుతి నిర్వహించారు.తొలుత పూర్ణాహుతి ద్రవ్యాలను ఆలయ ట్రస్టీస్ రాగం వెంకట లీలాసుందరి,బెల్లంకొండ మస్తాన్‌రావు దంపతులు రుత్విక్కులు,భక్తులు యాగశాల ప్రదక్షిణ చేసిన అనంతరం పూర్ణాహుతి జరిగింది.

## భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీవ్రతం



**గుంటూరు కల్చరల్,ఆగష్టు 28, ప్రభాతవార్త :** స్థానిక అరండల్‌పేటలోని శ్రీఅష్టలక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనారాయణ స్వామి దేవాలయంలో వ్యవస్థాపకులు, ప్రధాన పూజారి మర్రిపాటి ప్రసాద్ మరియు వారి బృందం ఆధ్వర్యంలో జరుగుతున్న కోటికుంకుమార్చనలో భాగంగా శ్రావణ మాస మూడవ శుక్రవారం, కలువపూలు, 100బంగారు పుష్పాలతో విశేషపూజ నిర్వహించి,నక్షత్ర హారతి అనంతరం మంత్రపుష్పం తీర్థ ప్రసాద వితరణ జరిగింది.

## మంత్రి నాదెండ్ల గ్రీవెన్స్‌కు విశేష స్పందన

**తెనాలి మున్సిపాలిటీ, ఆగస్టు 28,(ప్రభాతవార్త):** ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా,ప్రజల వద్దకే పాలనలో భాగంగా, ఒక నెల – ఒక నియోజకవర్గం – నాలుగు సందర్శనలు, కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక శాసనసభ్యులు రాష్ట్ర ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆధ్వర్యంలో, మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహించిన పీజీఆర్ఎస్ (ప్రజా సమస్యల పరిష్కార వేదిక) కార్యక్రమంలో మంత్రి నాదెండ్ల మనోహర్, గుంటూరు జిల్లా కలెక్టర్ సాయి కాంత్ వర్మ పాల్గొని ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు.ఈ సందర్భంగా ప్రజల నుంచి పలు వినతులను స్వీకరించి, వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ప్రజలు అందించిన ప్రతి వినతిని పరిశీలించి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సత్వర పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని, మంత్రి మనోహర్ అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని,పరిష్కారం చూపించడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని, అందులో భాగంగా ప్రతి నెల ఒక నియోజకవర్గంలో నాలుగు ప్రాంతాల్లో ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించి ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకొని అప్పటికప్పుడు అధికారులకు ఆదేశాలు ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తెనాలి పట్టణం మరియు పరిసర గ్రామాల నుండి కాకుండా నియోజకవర్గ వ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో



తెనాలి ఆర్డిఓ శ్రీ రమణి,తహసిల్దార్ కెవి. గోపాలకృష్ణ,మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు మరియు ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఎండుతున్న గొంతులకు జలామృతం

**మాచర్ల టౌన్,ఆగస్టు 28,ప్రభాతవార్త :**

తీవ్ర త్రాగు నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్న ఎగువ పల్నాడు ప్రాంతమైన మాచర్ల నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం రాకతో ప్రతి ఇంటికీ జల సిరులు బిరబిరా పరుగులు పెట్టేందుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. దార్శనికులైన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ప్రగతి రథంపై నరసరావుపేట ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయలు,మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి జోడి నియోజకవర్గంలో సర్వతోముఖాభివృద్ధి శరవేగంగా జరుగుతోంది.

**గ్రామీణ త్రాగు నీటికి రూ.800 కోట్లతో జల్ జీవన్ మిషన్**



మాచర్ల నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల్లో గ్రామీణ త్రాగు నీటి అవసరాలకు రూ.800 కోట్లతో జల్ జీవన్ మిషన్ పైపులైన్ పనులను ఇప్పటికే శరవేగంగా చేపట్టారు.మాచర్ల మండలంలోని విజయపురిసౌత్ వద్దనున్న మేకలగొంది వద్ద సాగర్ జలాలను శుద్ధికి అతిపెద్ద వాటర్ ఫిల్టర్ పంపుహౌస్ నిర్మిస్తున్నారు.అక్కడి నుంచి శుద్ధ జలాలను పైపులైన్ల ద్వారా మాచర్ల,వెల్దుర్తి,దుర్గి, రెంటచింతల, కారంపూడి మండాలకు నీటిని తరలిస్తారు.మరోవైపు అవసరమైన ప్రాంతాల్లో ఇప్పటికే ఓవర్ హెడ్ నీటి ట్యాంకుల నిర్మాణాలు జరుగు తున్నాయి.దాదాపు రూ.1200 కోట్లతో నిర్మిస్తున్న ఈ వాటర్ గ్రిడ్ ఒక్క మాచర్ల నియోజకర్గంలోనే రూ.800 కోట్లకు పైగా నిధులు వెచ్చించ నున్నారు.ఈ వాటర్ గ్రిడ్ అందుబాటులోకి వస్తే దాదాపు త్రాగు నీటి ఎద్దడిని పూర్తిస్థాయిలో శాశ్వతంగా చెక్ పెట్టవచ్చునని అధికారులు చెబుతున్నారు.

**మాచర్ల మున్సిపాలిటీ చరిత్రలో సువర్ణాధ్యయం**

1983 లో మేజరు పంచాయతీగా ఉన్న మాచర్లను గ్రేడ్ 3 మున్సిపాలిటీ గా ప్రకటిస్తూ అప్పటి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.ఆ తరువాత గ్రేడ్2 గా అప్ గ్రేడ్ అయ్యింది.మాచర్ల మున్సిపాలిటీ పరిధి రానున్న 25 ఏళ్లకు సరిపడా త్రాగు నీరు అందించేందుకు కూటమి ప్రభుత్వం సమగ్ర త్రాగు నీటి సరఫరా ప్రణాళికలను సిద్ధం చేస్తోంది.రెండు దశాబ్దాలుగా త్రాగు నీటి కోసం ప్రజలు మున్సిపల్ ట్యాంకర్లు,నీటి వ్యాపారం చేసే ప్రైవేటు వ్యవస్థలపై



ఆధారపడి నెలవారీ డబ్బులిచ్చి మరీ త్రాగు నీటికి కొనుగోలు చేసుకోవాల్సిన దుస్థితిని ఇక బయటపడనున్నది.కేంద్ర ప్రభుత్వ పథకం అమృత్ 2.0 స్కీమ్ ద్వారా దాదాపు రూ.146 కోట్లకు పైగా నిధులతో ప్రతి ఇంటికీ త్రాగు నీటి కుళాయిలతో శుద్ధ జలాలను అందించేందుకు వచ్చే నెల 1వ తేదీన పట్టణంలోని శ్రీనివాస మహల్ సెంటర్ నందు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి శంకుస్థాపన చేయనున్నారు.

**వచ్చే ఏడాది నాటికి ఇంటింటికీ బుగ్గవాగు జలాలు**

మాచర్ల మున్సిపాలిటీ పరిధిలోని వచ్చే ఏడాది నాటికి బుగ్గవాగు రిజర్వాయర్ నుంచి కృష్ణా జలాలను అమృత్ పథకం 2.0లో భాగంగా ప్రతి ఇంటికీ కుళాయిల ద్వారా శుద్ధి చేసిన జలాలను అందించనున్నది కూటమి ప్రభుత్వం.వేసవి కాలం వచ్చిందంటే సాగర్ కుడి కాలువకు నీరు ఆగిపోవడం,మున్సిపాలిటీ క్వారీలో నీరు ఇంకిపోవడం వంటివి సర్వసాధారణంగా ఎదురయ్యే సమస్య.తీవ్ర త్రాగు నీటి ఎద్దడికి దారితీసే పరిస్థితుల్లో పట్టణ జీవనం కనీస అవసరాలకు నీరు అందక దుర్భరంగా మారేది. త్రాగు నీటి కోసం ప్రత్యేక బడ్జెట్ పెట్టి,ట్యాంకర్ల ద్వారా

- రూ.1000 కోట్లతో భారీ త్రాగు నీటి ప్రాజెక్టులు...
- మాచర్ల నియోజకవర్గ చరిత్రలో సువర్ణాధ్యయం...
- జల్ జీవన్ మిషన్,అమృత్ పథకాల ద్వారా కృష్ణా జలాలు..
- వచ్చే నెల 1న పథకానికి ఘనంగా శంకుస్థాపన

నీటిని తరలించినప్పటికీ అనుకున్న లక్ష్యాలను మున్సిపాలిటీ అందుకోలేక ప్రజల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తేవి. ఈ క్రమంలో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి,ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు పట్టణంలోని త్రాగునీటి ఇబ్బందులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లగా,కేంద్రంతో సంప్రదింపులు జరిపి అమృత్ స్కీమ్ 2.0 ద్వారా నిధులను మాచర్ల మున్సిపాలిటీకి కేటాయింపులు జరిపింది కూటమి ప్రభుత్వం.రూ.146 కోట్ల పైగా నిధులతో నిర్మించే ఈ వాటర్ గ్రిడ్ ను యుద్ధ ప్రతిపాదికన నిర్మించేందుకు మేఘా ఇంజినీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ గుత్తేదారు సంస్థ వచ్చే నెల నుంచి పనులను ప్రారంభించనున్నది.



**అమృత్ వాటర్ గ్రిడ్ ప్రాజెక్ట్ రోడ్డు మ్యాప్ ఇలా**

అమృత్ 2.0 ద్వారా దాదాపు రూ.146 కోట్ల వాటర్ గ్రిడ్ ప్రాజెక్ట్ పనులను దక్కించుకున్న మేఘా ఇంజినీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ గుత్తేదారు సంస్థ ముందుగా బుగ్గవాగు రిజర్వాయర్ ద్వారా త్రాగునీటిని లిఫ్ట్ ద్వారా ఎత్తిపోసేందుకు కావాల్సిన మౌలిక సదుపాయాలను సిద్ధం చేస్తోంది.ఆ తరువాత మాచర్ల మున్సిపాలిటీ పంపు హౌస్ నందు ఒకటిన్నర ఎకరం ఖాళీ స్థలంలో నూతనంగా నిర్మిస్తున్న వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ లోకి నీటిని బుగ్గవాగు నుంచి పైపులైన్ సహకారంతో తరలిస్తారు. అక్కడ శుద్ధి చేసిన జలాలను మున్సిపాలిటీలో పంపు హౌస్ నందు అందుబాటులో ఉన్న 22 లక్షల కెపాసిటీ వాటర్ స్టోరేజ్ ఉన్న రెండు వాటర్ ఓవర్ హెడ్ ట్యాంకులకు నీటిని నింపుతారు.ఆ తరువాత ప్రాజెక్ట్ నిర్మాణంలో భాగంగా మాచర్ల పట్టణంలో ఫైర్ స్టేషన్ వద్ద (10 లక్షల వాటర్ కెపాసిటీ ),రోప్ వే కాలనీ లో ( 8 లక్షల వాటర్ కెపాసిటీ),టిడ్కో ఇళ్ల సముదాయాల వద్ద ( 6 లక్షల వాటర్ కెపాసిటీ),వినాయకునిగుట్టపై ( 5 లక్షల వాటర్ కెపాసిటీ),లింగాపురం కాలనీ (3 లక్షల వాటర్ కెపాసిటీ) వంటి ప్రాంతాల్లో నూతనంగా వాటర్ ఓవర్ హెడ్ ట్యాంకులను నిర్మాణాలు జరిపి, 24 గంటలకు త్రాగునీటి అందించేందుకు చర్యలు తీసుకుంటారు.మరోవైపు వచ్చే ఏడాది నాటికి పూర్తి స్థాయిలో పనులు పూర్తి చేసి, ప్రజలకు త్రాగునీరు అందించేందుకు ప్రణాళికబద్ధంగా అధికార యంత్రాంగం అడుగులు వేస్తోంది.

## శ్రీ సిమెంట్ మైనింగ్ వద్ద ఉద్రిక్తత

### - భారీగా మోహరించిన పోలీసు బలగాలు - కొనసాగుతున్న కాచవరం గ్రామస్తుల నిరసన

**కారంపూడి,ఆగస్టు 28,ప్రభాతవార్త:** శ్రీ సిమెంట్ మైనింగ్ వద్ద ఉద్రుక్తత వాతావరణం నెలకొంది. మండలంలోని కాచవరం గ్రామస్తులు గత ఐదు రోజుల నుండి మైనింగ్ ను నిలిపివేయాలని ఆందోళన చేపడుతున్నారు.



శ్రీ సిమెంట్ మైనింగ్ వలన కాచవరం గ్రామంలోని ఇళ్లకు పగుళ్ల వస్తున్నాయని మైనింగ్ నిలిపివేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.ఇచ్చిన మాటను కూడా నయాజమాన్యం నిలబెట్టుకోలేదని వారు వాపోయారు. మైనింగ్ కారణంగా నీరు ప్రస్తుతం అయిపోయిందని వారు తెలుపు తున్నారు. రెండు రోజుల క్రితం గురజాల ఆర్డీవో మురళి, డీఎస్పీ ఉమామహేశ్వరరావు మైనింగ్ వద్దకు చేరుకొని శ్రీ సిమెంట్ యాజమాన్యాన్ని, కాచవరం గ్రామస్తులను విచారించారు. మైనింగ్ కారణంగానేమా గృహాలు పగుళ్ల వచ్చాయని మైనింగ్ ను నిలిపివేయాలని గ్రామస్థులు కోరారు. జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్ల తో మాట్లాడి సమస్యను ఉక్కులకి తీసుకొస్తామని



హామీ ఇచ్చారు. అప్పటివరకు మైనింగ్ నిలిపివేయాలని యాజమాన్యాన్ని కోరడంతో ఆసమయంలో సరేనని యాజమాన్యం మైనింగ్ కార్యకలాపాలను కొనసాగించడంతో కాచవరం గ్రామస్తులు శుక్రవారం తమ ఆందోళన ఉధృతం చేశారు. దీంతో పోలీస్ బలగాలు మైనింగ్ వద్ద భారీగా మోహరించారు. గ్రామస్తులు ఇలాంటి అవాంఛనీయ సంఘటనలు చేయకుండా ఉండేందుకు పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు.తమ సమస్యను పరిష్కరించేంతవరకు తమ నిరసన ఆగదు అంటూ గ్రామంలోని మహిళలతో సహా భారీగా మైనింగ్ వద్ద నిరసన తెలుపుతున్నారు

## పేదరిక నిర్మూలనే కూటమి ప్రభుత్వ ధ్యేయం

### -ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు

**పొన్నూరు, ఆగస్టు 28,ప్రభాతవార్త:** పేదరిక నిర్మూలనే కూటమి ప్రభుత్వం ప్రధాన ధ్యేయంగా పనిచేస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయం నుంచి శుక్రవారం రాష్ట్రంలని అన్నీ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు. స్వర్ణాంధ్రసాధనలో భాగంగా రాష్ట్రంలో పేదరికం లేని స్థితి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. సమాజంలో అత్యంత వెనుకబడిన నిరుపేద కుటుంబాలను ఆర్థికంగా పైకి తీసుకురావడం కోసమే పబ్లిక్–ప్రైవేట్–పీపుల్–పార్టనర్‌షిప్(పి4)ప్రవేశపెట్టి అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాన్ని అన్ని నియోజకవర్గాల్లో పక్కాగా జరిగేవిధంగా ఎమ్మెల్యేలు, నియోజకవర్గంలోని అన్ని శాఖల అధికారులు కృషి చేయాలన్నారు. పి4 పురోగతి, దీని అమలు గురించిన తదితర అంశాలను తెలుసుకోవడంతోపాటు, సూచనలు ఇచే ందుకోసం సమావేశాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. ఎమ్మెల్యేలు, అధికారులు నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి అవసరమైన ప్రణాళికలను రూపొందించడంతో పాటు ప్రజల భాగస్వామ్యంతో చేపట్టాల్సిన కార్యక్రమాలపై కూడా చర్చించారు. సమాజంలో సంపన్నులు, పారిశ్రామికవేత్తలు, కార్పోరేట్ సంస్థలను ఆహ్వానించి అట్టడుగున వున్న పేద కుటుంబాలను దత్తత తీసుకొని బంగారు కుటుంబాలుగా



తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి ప్రతి ఎమ్మెల్యేతోపాటు, అన్నిశాఖల అధికారులు పనిచేయాలని పిలుపునిచ్చారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్, తహశీల్దార్ కార్యాలయ సూపరింటెండెంట్ షేక్ కరీముల్లా, ఎంపిడిఓ గుమ్మా చంద్రశేఖరరావు, డిప్యూటీ ఎంపిడీఓ వేముల శ్రీనివాసరావు, సహాయ గణాంకాధికారి నాగరాజు తదితరులున్నారు.

## మాదకద్రవ్యాల నిర్మూలన సామాజిక బాధ్యత

### ఏపీ ఈగల్ చీఫ్ ఐజీపీ రవికృష్ణ

**మంగళగిరి, ఆగస్టు 28, ప్రభాతవార్త :** గంజాయి రహిత సమాజ నిర్మాణమే ప్రభుత్వ ధ్యేయమని, మాదకద్రవ్యాల నిర్మూలన సామాజిక బాధ్యత అని ఏపీ ఈగల్ చీఫ్ ఐజీపీ ఆకే రవికృష్ణ అన్నారు. మంగళగిరిలోని




ఈగల్ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ కోసం ఏపీ ఈగల్ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చారిత్రాత్మక ఒప్పందం జరిగింది.

ఆంధ్రప్రదేశ్‌ను మాదకద్రవ్యాల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్ది పటిష్టమైన చర్యలు చేపట్టే బృహత్తర లక్ష్యంతో ఏపీ ఈగల్ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మధ్య కీలక అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ సందర్భంగా ఇరు సంస్థల ప్రతినిధులు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసి పరస్పరం మార్చుకున్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఏపీ ఈగల్ చీఫ్ ఐజీపీ ఆకే రవికృష్ణ మాట్లాడుతూ నాలుగు సూత్రాల వ్యూహం ద్వారా ఈగల్ సంస్థ ప్రివెంటివ్ అవేర్‌నెస్, ఇంటెలిజెన్స్ డ్రివెన్ ఎన్‌ఫోర్స్‌మెంట్, డీఅడిక్షన్, కమ్యూనిటీ పార్టిసిపేషన్ అనే నాలుగు ప్రాథమిక అంశాలపై పనిచేస్తుందన్నారు. ఇప్పటివరకు 2,020 ఎన్ డీపీఎస్ కేసులు నమోదు చేసి 65 వేల కిలోలకు పైగా గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

**గంజాయి రహిత సమాజం దిశగా..**

ఆంధ్రప్రదేశ్ పోలీస్, ఈగల్, జిల్లా యంత్రాంగం సంయుక్తంగా నిర్వహించిన ఖిఆపరేషన్ చైతన్యంఖి ద్వారా గంజాయి సాగు నిర్మూలనలో కీలక విజయాలు సాధించినట్లు చెప్పారు. అందులో భాగంగా 2025 నాటికి అల్లూరి సీతారామరాజు జిల్లాలో గంజాయి సాగును పూర్తిగా నిర్మూలించడం జరిగిందన్నారు. 29,979 మంది గిరిజన రైతులకు ప్రత్యామ్నాయ, స్థిరమైన ఉపాధి మార్గాలు కల్పించినట్లు తెలిపారు.

ఇక 29,839 ఎకరాల్లో గంజాయికి బదులుగా ఉద్యానవన, ఇతర స్థిరమైన పంటల సాగుకు రైతులు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ప్రభుత్వ పథకాల సమన్వయంతో గిరిజనులకు రూ. 475 కోట్ల ఆర్థిక, ఉపాధి మద్దతు అందించినట్లు తెలిపారు.చట్టాల అమలు, ప్రజల భాగస్వామ్యం, ప్రత్యామ్నాయ ఉపాధి ద్వారా మాదకద్రవ్యాల నిర్మూలనలో చూపిన ప్రతిభకు గాను ఈ కార్యక్రమాన్ని ఖినార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరోఖి (ఎన్సీబీ) జాతీయ స్థాయిలోనే అత్యుత్తమ విధానంగా గుర్తించిందన్నారు.ఆపరేషన్ ఈగల్ ఆన్ ట్రైన్స్, గరుడ కార్యక్రమం ద్వారా ఒడిశా నుంచి వచ్చే 21 రైళ్లపై నిఘాతో పాటు, ప్రిస్క్రిప్షన్ లేకుండా అమ్ముతున్న ఎన్ఆర్ఎక్స్ ఓపీ ఓయ్డ్ మందుల విక్రయాలను అడ్డుకుంటున్నామని తెలిపారు. డ్రగ్స్ సమస్య కేవలం చట్టభద్రతకు సంబంధించిందే కాక, జాతీయ భద్రతకు కూడా ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు.డ్రగ్స్ వినియోగం, సరఫరా లేదా గంజాయి సాగుకు సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే ఈగల్ టోల్‌ఫ్రీ నంబర్: 1972 కు సమాచారం అందించాలని, ఒక సమాచారం, ఒక ఫోన్ కాల్ ఒక యువ జీవితాన్ని కాపాడవచ్చన్నారు. ఈ కార్యక్రమంలోరెడ్ క్రాస్ ఏపీ స్టేట్ బ్రాంచ్ చైర్మన్ వై.డి. రామారావు,ఆపరేషన్స్ ఎస్పీ కేఎం మహేశ్వర రాజు, అడ్మినిస్ట్రేషన్ ఎస్పీ జి. స్వరూప రాణి,డిఎస్పీలు టి.త్రినాథ్, కె .సింగయ్య, డిఎస్పీ టి.దుర్గా ప్రసాద్, సీఐ లు రవీంద్ర, రెడ్ క్రాస్ ఎన్టీఆర్ జిల్లా చైర్మన్ డా. జి. సమరం, స్టేట్ కోఆర్డినేటర్ బీవీఎస్ కుమార్ ,రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్స్ సిబ్బంది పాల్గొన్నారు

## పర్యావరణ పరిరక్షణకు పరిశోధనలు ఊతం

### నార్త్ మర్త్వాడ వర్సిటీ ప్రొఫెసర్ ఎస్.ఆర్.థోరట్

**ఆచార్యనాగార్జున విశ్వవిద్యాలయం, ఆగస్ట్28, ప్రభాతవార్త:** ప్రపంచవ్యాప్తంగా పర్యావరణం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలకు పరిష్కార మార్గాలను అన్వేషించడానికి పరిశోధనలు వేగవంతం కావాలని నార్త్ మర్త్వాడ వర్సిటీ ప్రొఫెసర్ ఎస్.ఆర్.థోరట్ అన్నారు. ఆచార్య నాగార్జున వర్సిటీ పర్యావరణ విభాగం ఆధ్వర్యంలో యూజిసి సహకారంతో ఇక్కడి



డైక్మన్ ఆడిటోరియంలో జాతీయ హరిత సదస్సు 2026 ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో ఆయన ప్రధాన వక్తగా పాల్గొని ప్రసంగించారు. మానవుని చర్యల వల్ల ప్రపంచ పర్యావరణం అనేక సమస్యలను ఎదర్కొంటుందన్నారు. వాటిని పరిష్కరించడానికి గ్రీన్ టెక్నాలజీ ద్వారా పరిష్కార మార్గాలను అన్వేషించాలని సూచించారు. ఏపిపిఐసి డైరెక్టర్ మండలి రాజేష్ పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతను, పర్యావరణం వల్ల సమాజానికి కలిగే ప్రయోజనాలను వివరించారు. పారిశ్రామిక అభివృద్ధితో పాటు సమాజం, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. పరిశ్రమల అభివృద్ధి ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు పెరగడంతోపాటు రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి దోహదపడు తుందన్నారు. పరిశ్రమలు పర్యావరణహిత విధానాలను పాటిస్తూ సామాజిక బాధ్యతతో ముందుకు సాగాలని కోరారు. పర్యావరణ పరిరక్షణతో పాటు సమాజ అభివృద్ధి కోసం ఏపిఐఐసి నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఏఎన్‌యు వీసి గంగాధరరావు మాట్లాడుతూ ఏఎన్‌యు 50ఏళ్ళ సర్ణోత్సవ వేడుకలలో భాగంగా జాతీయస్థాయిలో హరిత సదస్సు నిర్వహించడం ఆనందదాయకమన్నారు. సదస్సు డైరెక్టర్ ఆచార్య పందు బ్రహ్మాజీరావు మాట్లాడుతూ సమాజంలో పర్యావరణం అత్యంత కీలకంగా ఉందని దానిదృష్ట్యా యువతను ఎప్పటికప్పుడు పర్యావరణ పరిరక్షణకు నడుంబిగించేలా చైతన్యవంతం చేసే కార్యక్రమాలు విభాగం నుంచి చేస్తున్నట్లు పేర్కొన్నారు. పర్యావరణం ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు పరిష్కార మార్గాలను సూచిస్తు 104 పరిశోధన పత్రాలు వచ్చాయన్నారు. దేశ వ్యాప్తంగా ఉన్న 6రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొన్నారని వివరించారు. కృష్ణా యూనివర్సిటీ మాజీ వీసి సుంకర వెంకటకృష్ణారావు మాట్లాడుతూ రోజురోజుకి తగ్గిపోతున్న సహజవనరులను పరిరక్షించుకోవాలన్నారు. ఈ సదస్సులో రెక్టార్ ఆచార్య శివరాం ప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం, పర్యావరణ విభాగం సీనియర్ ప్రొఫెసర్ ఆచార్య ఎవిఎస్. స్వామి, అధ్యాపకులు డాక్టర్ వి.సుభాషిణి, డాక్టర్ సిహెచ్.సునీత, డాక్టర్ కె.శశిధర్, డాక్టర్ సి.హెచ్.ప్రసన్న, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్.సి.నెం.98 /2026 /A1 మాచర్ల పురపాలక సంఘం, ది.28-08-2026

**బహిరంగ వేలము ప్రకటన**

మాచర్ల పురపాలక సంఘం పరిధిలోని పబ్లిక్ టాయిలెట్స్‌కు గజిట్ నెం.08. తేది. 10-03-2026 ప్రకారము 2026-2027 సంవత్సరమునకు బహిరంగ వేలము ద్వారా కేటాయించుటకు ది.07-09-2026 సోమవారము ఉదయం గం॥ 11.00లకు మునిసిపల్ కార్యాలయము నందు కమీషనరు గారిచే గాని,వారు అనుమతించిన వారితో గాని బహిరంగ వేలము నిర్వహించబడును.

బహిరంగ వేలములో అత్యధిక పాటదారులకు మాత్రమే1సంవత్సరము కాలపరిమితితో పబ్లిక్ టాయిలెట్స్ కేటాయించబడును.(తేది.01-09-2026 నుండి 31-08-2027 వరకు)

మరియు బహిరంగవేలం నియమ నిబంధనలు మరియు మార్కెట్ నిబంధనల కొరకు 2026-27 సంవత్సరపు గెజిట్ కొరకు రూ.100/- లు పురపాలక సంస్థ ట్రెజరీ నందు చెల్లించి పొందవలెను మరియు ఇతర వివరములకు కార్యాలయ పని వేళల యందు 1 గుమస్తాను సంప్రదించగలరు.

కమీషనరు
మాచర్ల పురపాలక సంఘం.

## మాచర్ల మున్సిపాలిటీ, జడ్పీటీసీ స్థానాలను ఎస్సీకి రిజర్వ్ చేయాలి

### ఎస్సీ కమిషన్ చైర్మన్‌కు ఎమ్మార్పీఎస్ నాయకుల వినతి



**మాచర్ల టౌన్ ఆగస్టు 28 ప్రభాతవార్త:** మాచర్ల మున్సిపాలిటీతో పాటు, మాచర్ల జడ్పీటీసీ స్థానాన్ని ఎస్సీ రిజర్వేషన్‌కు కేటాయించాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ నాయకులు ఎస్సీ కమిషన్ చైర్మన్ కొత్తపల్లి జవహార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు మాచర్ల దానియేల్, మాచర్ల రూబెన్, బొల్లెద్దుల మరియ బాబులు శుక్రవారం పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన ఎస్సీ కమిషన్ చైర్మన్‌ను కలిసి తమ డిమాండ్లను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మాచర్ల పురపాలక సంఘం ఏర్పడి సుమారు 42 సంవత్సరాలు పూర్తయినప్పటికీ ఇప్పటివరకు మున్సిపాలిటీ చైర్మన్ పదవిని ఎస్సీ రిజర్వేషన్‌కు కేటాయించలేదని తెలిపారు. ఓపెన్ కేటగిరీలో పోటీ చేసే అవకాశం ఉన్నప్పటికీ ఎస్సీ వర్గాలకు తగిన ప్రాతినిధ్యం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మాచర్ల మున్సిపాలిటీ, మాచర్ల జడ్పీటీసీ స్థానాలు ఎస్సీ రిజర్వేషన్‌లోకి వచ్చినప్పటికీ, అప్పటి నాయకుల జోక్యంతో ఆ రిజర్వేషన్‌ను రద్దు చేయించినట్లు ఎమ్మార్పీఎస్ నాయకులు ఆరోపించారు. మాచర్ల పట్టణంతో పాటు మాచర్ల మండలంలో ఎస్సీ జనాభా సుమారు 25 శాతం వరకు ఉందని వారు పేర్కొన్నారు. జనాభా ప్రాతిపదికన రాబోయే రిజర్వేషన్లలో మాచర్ల మున్సిపాలిటీ చైర్మన్ పదవితో పాటు మాచర్ల జడ్పీటీసీ స్థానాన్ని ఎస్సీకి రిజర్వ్ చేయాలని ఎస్సీ కమిషన్‌ను కోరారు. సామాజిక న్యాయం, జనాభా ప్రాతిపదికన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## డా. గోపి రెడ్డికి రాఖీ కట్టిన బ్రహ్మకుమారీస్ సోదరీమణులు



**నరసరావుపేట, ఆగస్టు 28, ప్రభాతవార్త:** అన్నాచెల్లెళ్ల మధ్య ఆత్మీయత, ప్రేమ, అనురాగం, పరస్పర రక్షణకు ప్రతీకగా రాఖీ పౌర్ణమి పండుగను జరుపుకుంటారని పల్నాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, నరసరావుపేట మాజీ శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా నరసరావుపేట ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయవిశ్వవిద్యాలయం శాఖకు చెందిన సోదరీమణులు ఆయనకు రాఖీ కట్టి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. డా. గోపిరెడ్డి మాట్లాడుతూ.. రాఖీ పౌర్ణమి భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో ఎంతో విశిష్టమైన పండుగ అని పేర్కొన్నారు. అన్నాచెల్లెళ్ల మధ్య ఉండే ఆప్యాయత, ప్రేమాభిమానాలను మరింత బలోపేతం చేసే పవిత్రమైన రోజుగా రాఖీ పండుగకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఎన్నో సంవత్సరాలుగా రాఖీ పర్వదినం సందర్భంగా బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం నుంచి సోదరీమణులు తన వద్దకు వచ్చి రాఖీ కట్టడం ఆనవాయితీగా కొనసాగుతోందని డాక్టర్ గోపిరెడ్డి తెలిపారు. ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయవిశ్వవిద్యాలయం నరసరావుపేట శాఖకు చెందిన రాజయోగి ని అరుణ, రాజయోగిని పల్లవి, అన్నపూర్ణ, అయినవోలు సాంబశివరావు, బుర్లగడ్డ మల్లికార్జునరావు, సెనగపల్లి పుల్లారావు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డికి రాఖీ కట్టి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.

## రాజీ మార్గమే రాజమార్గం

### సెప్టెంబర్ 12న జాతీయ లోక్ అదాలత్,జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస్ కళ్యాణ్



**మాచర్ల టౌన్ ఆగస్టు 28 ప్రభాతవార్త:** కోర్టుల చుట్టూ ఏళ్ల తరబడి తిరుగుతూ సమయం, ధనం వృథా చేసుకోకుండా చిన్నచిన్న వివాదాలను రాజీమార్గంలో పరిష్కరించుకోవాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస్ కళ్యాణ్ సూచించారు. "రాజీ మార్గమే రాజమార్గం" అని పేర్కొంటూ, లోక్ అదాలత్ ద్వారా సమస్యలకు సత్వర పరిష్కారం లభించే అవకాశం ఉందని తెలిపారు. సెప్టెంబర్ 12న జరగనున్న జాతీయ లోక్ అదాలత్ నేపథ్యంలో శుక్రవారం మాచర్ల కోర్టు ఆవరణలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస్ కళ్యాణ్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి ప్రశాంత్ పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...అనివార్య కారణాల వల్ల తలెత్తే చిన్నచిన్న వివాదాలను సంవత్సరాల తరబడి కోర్టుల్లో కొనసాగించకుండా, ఇరుపక్షాల అంగీకారంతో రాజీమార్గంలో పరిష్కరించుకోవడమే లోక్ అదాలత్ ప్రధాన ఉద్దేశ్యమన్నారు. కోర్టుల చుట్టూ తిరగకుండా సమస్యలకు సత్వర పరిష్కారం పొందడమే నిజమైన స్వాతంత్ర్యమని జడ్జి శ్రీనివాస్ కళ్యాణ్ పేర్కొన్నారు. లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరించుకోవడం ద్వారా సమయం, ఖర్చు ఆదా కావడంతో పాటు ఇరుపక్షాలకు సంతృప్తికరమైన పరిష్కారం లభిస్తుందని తెలిపారు. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 12న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని పత్రికా విలేకరులను కోరారు. ఈ సమావేశంలో కోర్టు ఏపీపీ, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ గంగుల శ్రీనివాసరావు, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బత్తుల బాబురావు (వకీల్ సాబ్), న్యాయవాదులు రాము నాయక్, దేవళ్ళ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## నరసరావుపేటలో నేడు ఉచిత కంటి వైద్య శిబిరం



**నరసరావుపేట టౌన్, ఆగస్టు 28, ప్రభాతవార్త:** 41వ జాతీయ నేత్రదాన ప్రచార పక్షోత్సవాల సందర్భంగా పల్నాడు జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ, డాక్టర్ ఎం.వి. రెడ్డి కంటి వైద్యశాల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 29న నరసరావుపేటలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ ఎం. వివేకానంద రెడ్డి, డాక్టర్ సృజన లంఫిశెట్టి తెలిపారు. శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఈ నెల 29వ తేదీ సాయంత్రం 5 గంటల నుంచి స్థానిక శంకరమఠం పక్కన ఉన్న రెడ్‌క్రాస్ భవనంలో ఉచిత కంటి వైద్య శిబిరం ప్రారంభమవుతుందని తెలిపారు. శిబిరంలో డాక్టర్ ఎం. వివేకానంద రెడ్డి (కేటరాక్ట్ గ్లకోమా సర్జన్), డాక్టర్ సృజన లంఫిశెట్టి (కేటరాక్ట్ ఒక్యులో ప్లాస్టిక్ సర్జన్) పాల్గొని కంటి సమస్యలతో బాధపడు తున్న వారికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. అవసరమైన వారికి వ్యాధి నిర్ధారణ, చికిత్సకు సంబంధించిన సలహాలు, సూచనలు అందిస్తామని వివరించారు. ప్రస్తుత రోజుల్లో కంటి సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల్లో నేత్ర ఆరోగ్యంపై అవగాహన కల్పించడంతో పాటు, నేత్రదానం ప్రాధాన్యతను వివరించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కంటి సమస్యలు ఉన్న ప్రజలు, వృద్ధులు, అవసరమైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ ఎం. వివేకానంద రెడ్డి, డాక్టర్ సృజన లంఫిశెట్టి కోరారు.

## ప్రభుత్వ పాఠశాలలో తొలిసారి రోబోటిక్స్ శిక్షణ

### మాచర్ల జడ్పీ బాలికల హైస్కూల్ విద్యార్థినుల ఘనత



**మాచర్ల టౌన్ ఆగస్టు 28 ప్రభాతవార్త:** ఆంధ్ర ప్రదేశ్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో సాంకేతిక విద్యకు కొత్త దిశను చూపించేలా మాచర్ల పట్టణంలోని జడ్పీ బాలికల హైస్కూల్‌లో తొలిసారిగా రోబోటిక్స్ వర్క్‌షాప్, కాంపిటీషన్ నిర్వహించారు. విద్యార్థినులకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంపై ఉచితంగా శిక్షణ అందించి, వారిలో సృజనాత్మకతను వెలికితీసేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్రంలో విద్యా, వైద్య రంగాల అభివృద్ధికి కృషి చేస్తున్న సామాజిక సేవా సంస్థ ట్యాంక్ గాడ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఈ వినూత్న కార్యక్రమాన్ని ఉచితంగా నిర్వహించారు. వర్క్‌షాప్‌లో భాగంగా రోబోటిక్స్ అంటే ఏమిటి, రోబోటిక్స్ ఆధారిత సాంకేతికత భవిష్యత్తులో వైద్య, పారిశ్రామిక రంగాల్లో ఏ విధంగా ఉపయోగపడనుందనే అంశాలను విద్యార్థినులకు సులభంగా వివరించారు.. శిక్షణ అనంతరం నిర్వహించిన రోబో టిక్స్ పోటీల్లో జడ్పీ బాలికల హైస్కూల్ విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. రోబోటిక్స్ పట్ల విద్యార్థినులు చూపిన ఆసక్తి, చురుకుదనం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులకు కార్పొరేట్ స్థాయి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉచితంగా అందిస్తూ, వారిలో సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించేందుకు కృషి చేసిన ట్యాంక్ గాడ్ ఆర్గనైజేషన్ సభ్యులు షేక్ యాసిన్, షేక్ జానీ బాషా, నౌషాద్ అలీ, సుధీర్ కుమార్, ఖాజా జాఫర్ తదితరులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు, స్థానికులు అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఆధునిక సాంకేతిక విద్యను అందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడ్డారు.

## వృద్ధుడికి రూ.15 వేల ఆర్థిక సహాయం అందజేత

### నిరుపేద కుటుంబానికి అండగా సమాజ సేవకుడు గంజి వీరాస్వామి

**సత్తెనపల్లి (ఆగస్టు 28, ప్రభాతవార్త):** గత 24 సంవత్సరాలుగా నిలబడలేక మంచానికే పరిమితమైన వృద్ధుడికి సమాజ సేవకుడు గంజి వీరాస్వామి రూ.15 వేల ఆర్థిక సహాయం అందించారు. పల్నాడు జిల్లా పెదకూరపాడు మండలం గారపాడుకు చెందిన గోలి విశ్వనాథం కుమారుడు గోలి సూర్యనారాయణ (60) చేనేత కార్మికుడు. 2003లో వెన్నుముకకు శస్త్రచికిత్స చేయించుకున్నప్పటికీ శరీరం సహకరించకపోవడంతో అప్పటి నుంచి మంచానికే పరిమితమయ్యారు. శరీరంలోని కొన్ని భాగాలకు రక్తప్రసరణ సక్రమంగా జరగక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సూర్యనారాయణ భార్య గోలి పుల్లమ్మ భర్తకు నిరంతరం సపర్యలు చేస్తూ, కూలి పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషిస్తున్నారు. ప్రస్తుతం ఆమె కూడా మోకాళ్ల నొప్పులతో బాధపడుతూ పేదరికంతో పాటు ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. సూర్యనారాయణకు శస్త్రచికిత్స జరిగిన సమయంలో వారి కుమారుడికి కేవలం 10 నెలల వయస్సు ఉండగా, పుల్లమ్మ కూలి పనులు చేస్తూ కుమారుడిని బీకాం వరకు చదివించారు. ప్రస్తుతం ఆయన ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ తనకు చేతనైనంతగా కుటుంబానికి సహాయం చేస్తున్నప్పటికీ, కుటుంబ అవసరాలకు ఆ ఆదాయం సరిపోవడం లేదని తెలిపారు. కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న సమాజ సేవకుడు గంజి వీరాస్వామి గతంలో పలుమార్లు నిత్యావసర సరుకులు, నగదు రూపంలో సహాయం అందించారు. శుక్రవారం గారపాడులోని సూర్యనారాయణ ఇంటికి వెళ్లి రూ.15,000 ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు మాట్లాడుతూ పాలకులు, సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి మంచానికే పరిమితమై దుర్భర జీవితం గడుపుతున్న సూర్యనారాయణ కుటుంబానికి ప్రభుత్వపరంగా ఆర్థిక సహాయం అందించాలని కోరారు. అలాగే ఆయనకు నెలకు రూ.15 వేల వరకు పింఛన్ అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# వైకాపా పాలనలో విధ్వంసం..
# కూటమి పాలనలో వికాసం..

### చీఫ్‌విప్ జీ.వీ,డీసీసీబీ మక్కెన
### ఐనవోలులో రూ.1.93 కోట్లతో నూతన ప్రాథమిక ఆరోగ్యం ఏర్పాటు



**నూజెండ్ల, ఆగస్ట్28, ప్రభాతవార్త:** ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్ర అభివృద్ధితో పాటు సాగునీటి రంగం తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు విమర్శించారు. పోలవరం నుంచి వెలిగొండ వరకు కీలక ప్రాజెక్టులను జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదని, ఐదేళ్ల అధికారంలో ఒక్క సాగునీటి ప్రాజెక్టును కూడా పూర్తి చేయలేకపోయారని అన్నారు. రాష్ట్రానికి అత్యంత కీలకమైన ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్లకుండా కాలయాపన చేసి ఇప్పుడు ప్రజలు, రైతుల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. జగన్ పాలనలో జరిగిన నష్టాన్ని సరిదిద్దుతూ రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి బాటలో నడిపించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. నూజెండ్ల మండలం ఐనవోలు గ్రామంలో రూ.1.93 కోట్లతో నిర్మించనున్న నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనానికి శుక్రవారం చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు శంకుస్థాపన చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రజలకు అందుబాటులోనే మెరుగైన వైద్యం గ్రామీణ ప్రజలు చిన్నచిన్న ఆరోగ్య సమస్యలకు సైతం దూరప్రాంతాల్లోని ఆసుపత్రులకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని జీవీ ఆంజనేయులు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజల ఆరోగ్య ప్రమాణాలతో పాటు జీవన ప్రమాణాలను పెంచేందుకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు. "ఆరోగ్యమే మహాభాగ్యం" అనే స్ఫూర్తితో "హెల్తీ ఆంధ్రప్రదేశ్" సాధించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. సంజీవని ప్రాజెక్టు ద్వారా ఆధునిక సాంకేతికతను వినియోగించి ప్రజల ఆరోగ్య వివరాలను డిజిటల్ విధానంలో అందుబాటులోకి తీసుకురావడంతో పాటు అవసరమైన వైద్య సేవలు, మందులను మరింత సమర్థంగా అందించే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ఐనవోలు పీహెచ్‌సీ నూతన భవనం అందుబాటులోకి వస్తే పరిసర గ్రామాల ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు చేరువవుతాయని పేర్కొన్నారు. వెలిగొండను పూర్తి చేసి రైతులకు నీరందిస్తాం వెలిగొండ ప్రాజెక్టు విషయంలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి పనులను వేగంగా ముందుకు తీసుకెళ్లారని జీవీ గుర్తుచేశారు. అయితే ఆ తర్వాత ఐదేళ్ల జగన్ పాలనలో వెలిగొండ సహా కీలక సాగునీటి ప్రాజెక్టులు నిర్లక్ష్యానికి గురయ్యాయని విమర్శించారు. పోలవరం నుంచి వెలిగొండ వరకు రాష్ట్రానికి అత్యంత కీలకమైన ప్రాజెక్టులను పూర్తి చేయడమే కూటమి ప్రభుత్వ ప్రాధాన్యమని చెప్పారు. పెండింగ్ పనులను వేగంగా పూర్తి చేసి లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించడం ద్వారా రైతులకు భరోసా కల్పిస్తామని స్పష్టం చేశారు. బీసీలపై జగన్‌ది కపట ప్రేమ బీసీల గురించి ఇప్పుడు జగన్ మాట్లాడటం రాజకీయ అవకాశవాదమేనని జీవీ విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు బీసీల స్థానిక సంస్థల రిజర్వేషన్ల విషయంలో జరిగిన నష్టానికి గత వైసీపీ ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు. రిజర్వేషన్లు తగ్గడం వల్ల వేలాది మంది బీసీలు పంచాయతీలు, మండలాలు, ఇతర స్థానిక సంస్థల్లో ప్రజాప్రతినిధులుగా అవకాశాలు కోల్పోయారని పేర్కొన్నారు. అధికారంలో ఉన్నప్పుడు బీసీల రాజకీయ సాధికారతను దెబ్బతీసి, ఇప్పుడు వారిపై ప్రేమ ఉన్నట్లు మాట్లాడితే ప్రజలు నమ్మరన్నారు. బీసీలకు సామాజిక, ఆర్థిక, రాజకీయంగా సముచిత అవకాశాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. రైతులకు ఐదేళ్లు తీరని నష్టంఐదేళ్ల జగన్ పాలనలో రైతాంగానికి తీవ్ర నష్టం జరిగిందని జీవీ ఆంజనేయులు ధ్వజమెత్తారు. ఒక్క సాగునీటి ప్రాజెక్టును పూర్తి చేయకుండా, కొత్తగా ఒక్క ఎకరానికి కూడా సాగునీరు అందించలేని పరిస్థితి ఎందుకు వచ్చిందో జగన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రైతుల భవిష్యత్తును నిర్ణయించే సాగునీటి ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేయడం వల్ల వ్యవసా య రంగం తీవ్రంగా నష్టపోయిందన్నారు. ప్రస్తుతం రైతు లకు సాగునీటి ఇబ్బందులు లేకుండా చూడటం, వర్షాభావ పరిస్థితుల ప్రభావం నుంచి పంటలను కాపాడటం, పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టి పెట్టారని తెలిపారు. "రైతుకు నీరు–వ్యవసాయానికి భరోస్తా" అనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార కేంద్ర జిడిసిసి బ్యాంక్ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, పీహెచ్‌సీ వైద్యులు, వైద్య సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు, కూటమి నాయకులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సమగ్ర తాగునీటి పథకంతో దశాబ్దాల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

### చీఫ్‌విప్ జీ.వీ



**వినుకొండ, ఆగస్ట్ 28, ప్రభాతవార్త:** రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. శుక్రవారం పురపాలక సంఘం ఆవరణలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ వినుకొండ పట్టణ ప్రజల దశాబ్దాల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా భారీ తాగునీటి పథకాన్ని చేపట్టడం చారిత్రాత్మక నిర్ణయమని జీవీ ఆంజనేయులు అన్నారు. ప్రతి కుటుంబానికి ప్రతిరోజూ సురక్షితమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో కృష్ణా జలాలను వినుకొండకు తీసుకొచ్చే పథకాన్ని ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోందన్నారు. వినుకొండ ప్రజల దశాబ్దాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే ఈ పథకానికి సహకరించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణకు జీవీ ఆంజనేయులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పేదరికం లేని సమాజమే లక్ష్యంసమాజంలో ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలను ఆదుకోవడం, వారి పిల్లలకు మంచి విద్య అందించడం, కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేయడమే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లక్ష్యమని జీవీ ఆంజనేయులు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలతో పాటు ఆర్థికంగా వెనుకబడిన అన్ని వర్గాల కుటుంబాలకు చేయూతనిస్తూ వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పేద కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలవడంతో పాటు వారి పిల్లల చదువు, ఉపాధి అవకాశాలను మెరుగుపరిచి పేదరికం లేని సమాజాన్ని నిర్మించాలనే సంకల్పంతో సీఎం చంద్రబాబు ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. ప్రజాదర్బార్ ద్వారా వచ్చిన సమస్యల్లో దాదాపు 90 శాతం పరిష్కారం కావడం సంతోషకరమని అన్నారు. మిగిలిన అర్జీల్లో పరిష్కారానికి అవకాశం ఉన్న ప్రతి సమస్యపై నిర్ణీత గడువులో చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ పదేపదే తిరిగే పరిస్థితి ఉండకూడదన్నారు. అర్జీలను అధికారులు బాధ్యతగా స్వీకరించి, సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని వీలైనంత త్వరగా పరిష్కారం చూపాలని సూచించారు. అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం, అనవసర జాప్యాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు. పరిష్కారం కాని అర్జీలకు గల కారణాలను కూడా సమగ్రంగా పరిశీలించాలన్నారు. నిబంధనలు, చట్టపరమైన లేదా సాంకేతిక కారణాలతో పరిష్కారం సాధ్యం కాని పక్షంలో ఆ విషయాన్ని అర్జీదారులకు స్పష్టంగా తెలియజేయాలని చెప్పారు. పరిష్కరించగల సమస్యలను మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ పెండింగ్‌లో పెట్టొద్దని అధికారులకు సూచించారు. ప్రజల సమస్య లను నేరుగా ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చి పరిష్కారం చూపేందుకు "ప్రజాదర్బార్" ఒక మహా వేదికగా నిలుస్తోందని జీవీ పేర్కొన్నారు. గ్రామం, పట్టణం అనే తేడా లేకుండా రాష్ట్రంలోని ప్రతి పేదవాడికీ న్యాయం జరగాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రజా సమస్యల పరిష్కా రంలో వినుకొండను అగ్రస్థానంలో నిలిపేందుకు అధికారులు మరింత చురుగ్గా, సమన్వయంతో పనిచేయాలని కోరారు. ప్రజల సమస్యల పరిష్కారం నుంచి మౌలిక వసతుల అభివృద్ధి వరకు ప్రతి విషయంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ, వినుకొండ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తామని చీఫ్ విప్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకుడు నిశ్శంకర శ్రీను, టీడీపీ పట్టణ పార్టీ అధ్యక్షుడు రోశయ్య, రియల్ ఎస్టేట్ జానీ, నాగేశ్వరరావు బీజేపీ నాయకులు, కూటమి పార్టీల నాయకులు, మున్సిపల్ అధికారులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## 3వ హ్యాండ్స్ ఆన్ లైవ్ సర్జికల్ వర్క్‌షాప్



**నరసరావుపేట, ఆగస్టు 28, ప్రభాతవార్త:** కొండవీడు ఈఎన్‌టీ హాస్పిటల్స్‌లో 4రోజుల హ్యాండ్స్ ఆన్ లైవ్ సర్జికల్ వర్క్‌షాప్ శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ఎమ్మెల్యే డా. చదలవాడ అరవింద్ బాబు ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి వెలిగించి వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కొండవీడు ఈఎన్‌టీ ఆసుపత్రిలో ఇటువంటి ప్రతిష్టాత్మకమైన లైవ్ సర్జికల్ వర్క్‌షాప్ నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. వైద్య రంగంలో నూతన సాంకేతికత, ఆధునిక శస్త్రచికిత్సా విధానాలను వైద్యులకు పరిచయం చేసే ఇలాంటి వర్క్‌షాప్‌లను మరిన్ని నిర్వహించాలని ఆకాంక్షించారు. వర్క్‌షాప్‌ను నిర్వహిస్తున్న డాక్టర్ కంజుల జగన్మోహన్ రెడ్డిని ఆయన అభినందించారు. డా. బయ్య సుధీర్ చంద్ర మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లో రోగులపై ప్రత్యక్షంగా లైవ్ సర్జరీలను నిర్వహిస్తూ ఇటువంటి హ్యాండ్స్ ఆన్ సర్జికల్ వర్క్‌షాప్‌ను తాను తొలిసారిగా చూస్తున్నానని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు వైద్యులకు ఎంతో ఉపయోగకరంగా ఉండటంతో పాటు పేద ప్రజలకు కూడా ప్రయోజనం చేకూరుస్తాయని అన్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా డాక్టర్ రామలింగారెడ్డి, డాక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, డాక్టర్ మధుసూదన్ రావు, డాక్టర్ ప్రకాష్ లు పాల్గొని వర్క్‌షాప్ ఉద్దేశాలను వివరించారు. ఆగస్టు 27, 28, 29, 30 తేదీల్లో నాలుగు రోజుల పాటు ఈ వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. ఏపీఎంసీ తరఫున అబ్జర్వర్‌గా డాక్టర్ మధుసూదన్ రావును నియమించినట్లు తెలిపారు. క్యాంప్ ఆర్గనైజింగ్ డైరెక్టర్ డాక్టర్ కంజుల జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. కొండవీడు ఈఎన్‌టీ హాస్పిటల్స్‌లో లైవ్ సర్జికల్ వర్క్‌షాప్ నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమానికి సహకరించిన రోగులకు, ఎన్టీఆర్ ట్రస్ట్ వైద్యసేవలకు, డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ రావుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ వర్క్‌షాప్‌లో మిర్యాలగూడకు చెందిన డాక్టర్ శేఖర్ రెడ్డి, జీఎన్‌టీ హాస్పిటల్స్‌కు చెందిన డాక్టర్ బయ్య సుధీర్ చంద్ర, డాక్టర్ కె.ఎల్.ఎస్. ప్రసాద్ బృందం పాల్గొన్నారు. క్యాంప్ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీ వర్షిణి, డాక్టర్ విష్ణురాజ్, సీఈఓ మస్తాన్ రెడ్డి, డాక్టర్ శ్రీధర్, ఓటీ సిబ్బంది, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## కోటప్పకొండలో ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహార్ ప్రత్యేక పూజలు



**రొంపిచర్ల, ఆగస్టు 28, ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ ఎస్సీ కమిషన్ చైర్మన్ సి.కె.ఎస్. జవహార్, కమిషన్ సభ్యులు మేకల దాసు (బిక్షాలు) శుక్రవారం రొంపిచర్ల మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వరస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణ అధికారి, సహాయ కమిషనర్ డి. చంద్రశేఖర్, ఆలయ మేనేజర్ చల్లా శ్రీనివారావు, ఆలయ అర్చకులు, కూటమి నాయకులు ఎస్సీ కమిషన్ చైర్మన్‌కు ఘన స్వాగతం పలికారు. ఆలయ మర్యాదలతో సత్కరించి పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. అనంతరం స్వామివారి చిత్రపటాన్ని, తీర్థప్రసాదాలను అంజేశారు. చైర్మన్ జవహార్‌తో పాటు కమిషన్ సభ్యులు శ్రీ త్రికోటేశ్వరస్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు కోటప్పకొండ క్షేత్ర చరిత్ర, త్రికోటేశ్వరస్వామి మహిమలను వారికి వివరించారు. అనంతరం ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహార్ మాట్లాడుతూ కోటప్పకొండ క్షేత్రం దినదినాభివృద్ధిచెందుతుండటం సంతోషకరమన్నారు. దేశంలోనే ప్రముఖ దేవాలయంగా కోటప్పకొండకు ప్రత్యేక గుర్తింపు ఉందని, దశాబ్దాల చరిత్రతో పాటు పురాణాల్లోనూ ఈ క్షేత్రానికి విశిష్ట స్థానం ఉందని తెలిపారు. మహిమ కలిగిన త్రికోటేశ్వరస్వామివారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. చైర్మన్ జవహార్ వెంట కమిషన్ సభ్యులు, ఆలయ అధికారులు, అర్చకులు, కూటమి నాయకులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఇంగ్లీష్, కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

### న్యాయవాది నరిశేటి వేణుగోపాల్




**సత్తెనపల్లి (ఆగస్టు 28, ప్రభాతవార్త):** విద్యార్థులు తాము ఎంచుకున్న కోర్సులతో పాటు ఇంగ్లీష్ మాధ్యమం, కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ ఏపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, న్యాయవాది నరిశేటి వేణుగోపాల్ సూచించారు. సత్తెనపల్లి పట్టణంలోని వేద బాలుర కళాశాలలో శుక్రవారం నిర్వహించిన నూతన విద్యార్థుల పరిచయ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమావేశానికి వేద కళాశాల ప్రిన్సిపల్ ఆర్. కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నరిశేటి వేణుగోపాల్ మాట్లాడుతూ వృత్తి విద్యా కోర్సుల ద్వారా విద్యార్థులకు త్వరితగతిన ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని తెలిపారు. పేద, మధ్యతరగతి వర్గాల విద్యార్థులకు ఇటువంటి కోర్సులను సత్తెనపల్లి ప్రాంతంలో అందుబాటులోకి తీసుకువచ్చిన వేద విద్యాసంస్థల యాజమాన్యాన్ని అభినందించారు. కళాశాల అకాడమిక్ డైరెక్టర్ చింతాడ సూర్యప్రకాష్ మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులు తమ లక్ష్యాలను ఎంచుకుని వాటి సాధనకు కృషి చేయాలని సూచించారు. ఈ ఏడాది నుంచి కళాశాలలో లాంగ్‌టర్మ్ ఇంజనీరింగ్, మెడికల్ శిక్షణను ప్రారంభించినట్లు తెలిపారు. ప్రభుత్వ వసతి గృహాల్లో ఉంటూ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ విఖనస మహర్షి జయంతి మహోత్సవం

**నరసరావుపేట ,ఆగస్టు 28 ప్రభాతవార్త :** స్థానిక బరంపేట లోని శ్రీ లీలా వెంకటేశ్వర స్వామి వారి సన్నిధిలో గల శ్రీ పద కళ్యాణ మండపంలో శ్రావణ పూర్ణిమ సందర్భంగా వైఖానస ఆగమ సూత్ర శిల్పి శ్రీ విఖనస మహర్షి జయంతి మహోత్సవం శుక్రవారం శ్రీ వైఖానస పరిషత్ , శ్రీ వైఖానస దివ్య సిద్ధాంత వివర్ధని సభ (తిరుమల) నరసరావుపేట ప్రాంతీయ కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన వేద విజ్ఞాన పీఠం అధ్యాపకులు దీవి ఫణి కుమార్ (ధర్మగిరి, తిరుమల), సనాతన ధర్మవారధి ఆచార్య రొంపిచర్ల యశ్వంత్ దీక్షితులు (తిరుపతి) శ్రీ వికాసమహర్షి లోక కళ్యాణం కోసం సూత్రీకరించిన వైఖానస ఆగమశాస్త్ర ప్రాశస్త్యాన్ని వివరించారు. భగవంతుని ఆరాధన ద్వారానే మోక్షాన్ని పొందవచ్చని తెలిపారు. భగవంతుని విగ్రహారాధన ద్వారా, ఈసాధనతో నిరాకారమైన భగవంతుణ్ణి ధ్యానించే స్థాయికి ఎదగవచ్చని అన్నారు. నిరాకారుని గా ఆరాధించాలంటే తొలుత విగ్రహారాధన సాధన తోనే సాధ్యమవుతుందని తెలిపారు. వైఖానస ఆగమ విధానాలను లోతైన విశ్లేషణలతో వివరించారు. అర్చక వ్యవస్థ మనుగడ సాగించాలంటే వైఖానస ఆగమ పండితులు, అర్చకులకు కన్య నిచ్చి వివాహాలు చేయటాన్ని ప్రోత్సహించాలని, లేని యెడల ఈ వ్యవస్థకు ముప్పు కలుగుతుందని హెచ్చరించారు. ఈ సందర్భంగా శ్రీ వైఖానస పరిషత్, మైకానస దివ్య సిద్ధాంత వివర్ధని సభ తిరుమల వారి నరసరావుపేట ప్రాంతీయ కార్యాలయం, శ్రీ వేదాంతం రామకృష్ణ ఆచార్య భారతీవల్లి స్మారక ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో మణికుమార్ కుఖి శ్రీ శాస్త్ర విశారద ఖిఅనే బిరుదును, యశ్వంత్ దీక్షితులకు ఖిప్రజ్ఞా కైరవఖి అనే బిరుదును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారిని ఘనంగా సత్కరించారు. వారితోపాటు నరసరావుపేటలో వివిధ రంగాలకు చెందిన వైఖానస ప్రముఖులు వైఖానసగము పండితులు వేదాంతం రంగనాథ స్వామి అయ్యంగార్, సీనియర్ జర్నలిస్ట్ వేదాంతం వెంకట అంజనీ కుమార్, డాక్టర్ నారాయణం రాంబాబు, వినుకొండ కు చెందిన నారాయణం రామ్మోహన్ , సత్తెనపల్లి కి చెందిన రొంపిచర్ల ఆంజనేయ ఆచార్యులు దంపతులను, ప్రముఖ ఆయుర్వేద వైద్యులు డాక్టర్ పి ధన్వంతరి వరప్రసాద్(నరసరావుపేట), పరిషత్ నిర్వహణలో విశేష సేవ అందిస్తున్న వాడపల్లి రత్నమాచార్యులను ఘనంగా సత్కరించారు. ఈ సత్కార కార్యక్రమాన్ని వాడపల్లి హైమాచార్యులు నిర్వహించారు. శ్రీ వైఖానస దివ్య సిద్ధాంతం సభ తిరుమల కన్వీనర్ శ్రీ వైఖానస పరిషత్ గౌరవ అధ్యక్షులు డాక్టర్ రొంపిచర్ల ఆంజనేయులు పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని పరిషత్ అధ్యక్ష ,కార్యదర్శులు నారాయణం సత్యనారాయణ ప్రసాద్, రత్నాకరం శ్రీనివాస ఆంజనేయ ప్రసాద్ (బాచి), కోశాధికారి రొంపిచర్ల లక్ష్మీనారాయణ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దండమూడి కి చెందిన వేదాంతం వెంకట చేతన మనస్విని, దీవి శ్రీలాస్య(సౌదీ అరేబియా) భరతనాట్యం ప్రదర్శించి అందరి మన్ననలను పొందారు. ఆలయ ధర్మకర్త కె.పి పాండురంగారావు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

## ప్రతి ఇంట్లో డ్రై డేను తప్పనిసరిగా పాటించాలి



**కారంపూడిఆగస్ట్28, ప్రభాతవార్త:** దోమల నివారణకు ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య అధికారి కె మోనిక, ఆయుర్వేదిక్ వైద్యాధికారి ఆర్ శ్రీనివాస్ లు కోరారు. శుక్రవారం డ్రై డే కార్యక్రమంలో భాగంగా కారం పూడి లోని ఎస్సీ కాలనీలో దోమల నివారణ పై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు మాట్లాడుతూ దోమల ద్వారా వచ్చే డెంగ్యూ, మలేరియా, చికెన్ గునియా, బోదకాలు, మెదడువాపు వంటి వ్యాధులను సమర్థవంతంగా నివారించేందుకు ప్రతి ఇంట్లో డ్రై డేను తప్పనిసరిగా పాటించాలని అన్నారు. ఇంటి పరిసరాలలో మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగతంగా నివాసాలలో ఉండే డ్రమ్ములు, నీటి తొట్లను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జి ఈశ్వరి, ఏఎన్ఎం లాలూ నాయక్, హెల్త్ అసిస్టెంట్ మస్తాన్ వలి, ఆశా వర్కర్ విమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మేయర్ కన్నా నాగరాజుకు రాఖీ కట్టిన తోట అంబికా



**సత్తెనపల్లి (ఆగస్టు 28, ప్రభాతవార్త):** రాఖీ పౌర్ణమి సందర్భంగా సత్తెనపల్లి పట్టణంలోని పిడుగురాళ్ల రోడ్డులో గల సుజుకి షోరూంలో మాజీ మేయర్ కన్నా నాగరాజును మహిళా అధ్యక్షురాలు తోట అంబికా కలుసుకున్నారు. ఈ సందర్భంగా తోట అంబికా కన్నా నాగరాజుకు రాఖీ కట్టి తన అభిమానాన్ని చాటుకున్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా సత్తెనపల్లి నియోజకవర్గ ంలోని ఆడపడుచ ులందరికీ కన్నా నాగరాజు రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు.

# పల్నాడు జిల్లా వార్త



## శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక అలంకరణ



**సత్తెనపల్లి (ఆగస్టు 28, ప్రభాతవార్త):** సత్తెనపల్లి పట్టణంలోని మెయిన్ రోడ్డులో వేంచేసి ఉన్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శ్రావణమాసం మూడో శుక్రవారం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అలంకరణలతో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని, భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు

## సూపర్ ఎల్‌నినోను ఎదుర్కొనేలా పశుగ్రాస పెంపకం

### ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి



**వెల్దుర్తిఆగస్టు 28, ప్రభాతవార్త::** సూపర్ ఎల్ నినో ప్రభావంతో ఏర్పడే ప్రతికూల పరిస్థితుల నుంచి రైతులను కాపాడుకునేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేస్తోందని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తెలిపారు. శుక్రవారం వెల్దుర్తి మండల పరిధిలోని గంగిరెడ్డిపల్లె చెరువు పరిధిలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన సామూహిక పశుగ్రాస పెంపకం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గ వ్యాప్తంగా అమలు చేయనున్న పశుగ్రాస పెంపకం పథకాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. రెండెకరాల విస్తీర్ణంలో గడ్డి సాగు కోసం ట్రాక్టర్ ద్వారా విత్తనాలను వెదజల్లారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పాడి పరిశ్రమ అభివృద్ధికి, పశువుల మేత కొరత తీర్చడానికి ఈ పథకం ఎంతో దోహదపడుతుందని, రైతులందరూ దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమం అనంతరం గంగిరెడ్డిపల్లె గ్రామంలో ఎమ్మెల్యే పర్యటించి, స్థానిక సమస్యలపై గ్రామస్తులతో సమీక్ష నిర్వహించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ మోహన్ రెడ్డి, వెల్దుర్తి మండల పశువైద్యాధికారి డాక్టర్ సరిత, మండాది పశువైద్యులు డాక్టర్ మల్లికార్జునరావు, మాచర్ల మార్కెట్ యార్డ్ చైర్మన్ రాజబోయిన మధు, టీడీపీ నాయకులు జూలకంటి చిరంజీవిరెడ్డి, మండలపు రామకృష్ణ, వజ్రం నాయక్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## స్వర్ణాంధ్ర సాధనకు నియోజకవర్గ ప్రణాళికలు వేగవంతం చేయాలి

### అధికారుల సమీక్షలో ఎమ్మెల్యే జూలకంటి



**వెల్దుర్తి ఆగస్టు 28, ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచనలకు అనుగుణంగా స్వర్ణాంధ్ర 2047 లక్ష్య సాధన, విజన్ యాక్షన్ యూనిట్ల సమర్థ నిర్వహణ, పీ4 అమలు దిశగా మాచర్ల నియోజకవర్గంలో కార్యాచరణను మరింత వేగవంతం చేయనున్నట్లు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తెలిపారు. శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 175 నియోజకవర్గాల ప్రతినిధులతో ముఖ్యమంత్రి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుండి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సమావేశానికి నియోజకవర్గ ప్రత్యేక అధికారి గబ్రూ నాయక్, యంగ్ ప్రొఫెషనల్ సాంబశివరావు, నాలెడ్జ్ పార్ట్నర్ వెంకట్రామిరెడ్డి, విజన్ సిబ్బంది లక్ష్మీ నారాయణ, తులస్య నాయక్, సుజాత హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి విజన్ సిబ్బంది మరియు అధికారులతో ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..స్వర్ణాంధ్ర లక్ష్యాలు: నియోజకవర్గ పరిధిలో వ్యవసాయం, మౌలిక వసతులు, ఉపాధి అవకాశాల పెంపునకు దోహదపడే అంశాలపై దృష్టి సారించి సమగ్ర ప్రణాళిక రూపొందించాలని సూచించారు. పీ4 బంగారు కుటుంబాల తోడ్పాటు: పేదరిక నిర్మూలనే ధ్యేయంగా ప్రారంభించిన పీ4 విధానం ద్వారా అర్హులైన పేద (బంగారు) కుటుంబాలకు ఆర్థిక సాయం, మార్గదర్శకత్వం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.

**పారదర్శక పి.జి.ఆర్.ఎస్ .**

ప్రజల సమస్యల పరిష్కారం కోసం పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్ (పి.జి.ఆర్.ఎస్)ను అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని, అర్జీదారులకు సత్వర పరిష్కారం లభించేలా యంత్రాంగం కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి విజన్ టీమ్ సభ్యులందరూ సమన్వయంతో పనిచేసి లక్ష్యాలను అధిగమించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరారు.

## పురాతన ఆలయాభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం


### టీడీపీ యువ నాయకులు గౌతమ్ జూలకంటి



**వెల్దుర్తిఆగస్టు 28, ప్రభాతవార్త:** మాచర్ల నియోజకవర్గ పరిధిలో పల్నాడు ప్రాచీన చరిత్రకు ఆనవాళ్లుగా విరాజిల్లుతున్న పురాతన ఆలయాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే జూలక ంటి బ్రహ్మానందరెడ్డి తనయులు, టీడీపీ యువ నాయకులు గౌతమ్ జూలకంటి చెప్పారు. సోమవారం మండల పరిధిలోని లోయపల్లి గ్రామంలో పర్యటించిన ఆయన, గ్రామ సివారులో కొలువుదీరిన స్వయంభూ శ్రీ బాల త్రిపుర సుందరి దేవి సమేత శ్రీ మల్లికార్జున స్వామి వారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు అనంతరం స్థానికులతో గ్రామ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్వామి వారి ఆలయానికి రోడ్డు మార్గం ఇబ్బందిగా ఉందని గ్రామస్తులు గౌతమ్ దృష్టికి తీసుకొచ్చారు. 800 ఏళ్ల ఘన చరిత్ర ఉన్న ఈ ఆలయం నల్లమల ఫారెస్ట్ లో ఉన్నందున, ఆటవిశాఖ అనుమతులు రోడ్డు నిర్మాణానికి అడ్డుగా మారాయని స్థానికులు వాపోయ్యారు. కనీసం గ్రావెల రోడ్డుకైనా అనుమతులు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వారి వినతులపై స్పందించిన గౌతమ్ రెడ్డి తప్పనిసరిగా ఆలయానికి పోవు రోడ్డు మార్గం నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు కళ్లం రామాంజి రెడ్డి, ముండ్లమూరి కోటయ్య, గంట కృష్ణమూర్తి, ముప్పాళ్ల శ్రీనివాసరావు, ముప్పాళ్ల బాలయ్య, రామారావు, నరసయ్య, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ ముక్త్యాలరాజా 54వ వర్ధంతి

**విజయపురిసౌత్ ,ఆగస్టు 28 , ప్రభాతవార్త**



విజయప ురిసౌ త్:శ్రీ రాజా వాసిరెడ్డి రామగోపాలకృష్ణ మహేశ్వర ప్రసాద్, ముక్త్యాలరాజు 54వ వర్ధంతిని కె.సి.పి.సిమెంట్ ఫ్యాక్టరీ ఉద్యోగుల ఆధ్వర్యంలోఘనముగా విజయపురిసౌత్ లో జరుపుకున్నారు. నాగాం ర్జున సాగర్లో నెలకొల్పిన రాజాగారి విగ్రహానికి కె.సి.పి. సిమెంట్ ఫ్యాక్టరీ జనరల్ మేనేజర్ (దిశిగి) వి.వెంకట రమణ,ఘనంగా నివాలులు అర్పించినారు. ఈ సందర్భముగా ఆయన మాట్లాడుతూ శ్రీ రాజాగారు ది.04.10 .1917న జగ్గయ్యపేట తాలూకా, ముక్త్యాల గ్రామములో జన్మించినారని. యిక్కడ నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మించుటకు మూలపురుషుడు అని చెప్పవచ్చు అని,రాజాగారి కృషిలేకుంటే నాగార్జునసాగర్ ప్రాజెక్టు యిక్కడ నిర్మించేవారు కాదని, రాజావారు మొదటలో పులిచింతల ప్రాజెక్టు కొరకు కృషిచేసినారని,అదిచాలా చిన్న ప్రాజెక్టు దానివలన బహుళ ప్రయోజనము ఉండదని తెలిసిన తరువాత నాగార్జునసాగర్ ప్రాజెక్టు కొరకు విశేషంగా కృషిచేసరాని,వీరి ఉద్యమానికి సహాయకారులుగా యన్.జి.రంగా, మోటూరి హనుమంతరావు, వావిలాల గోపాలకృష్ణయ్య, కొనేరు కన్నయ్య, డాక్టర్ కె.యల్.రావు , స్థానిక నాయకులు గుర్రము మల్లయ్య, బోయ రామకోటి రెడ్డి, కర్పూరపు కోటయ్య, కావురి వెంకయ్య, గంటా వెంకయ్య, వట్టికొండ రామయ్య మొదలగు వారు వీరికి సహాయముగా నిలిసినారని తెలియజేసేరు.ముందుగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలీ ఘటించారు. ఉద్యోగులు,యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## కన్నుల పండుగలా బోనాలు



**కారంపూడిఆగస్టు 28 , ప్రభాతవార్త** పల్నాటి ప్రజలకొంగు బంగారం, కోరిన కోరికలు తీర్చే తల్లి వీర్ల అంకాలమ్మ శుక్రవారం కన్నుల పండుగలా బోనాల సమర్పించారు. ప్రతి ఏటా శ్రావణ మాసంలో పట్టణంలోని వివిధ సామాజిక వర్గ ాలు అమ్మవారికి బోనాల సమర్పించడం ఆనవాం ఐతీ. ముదిరాజ్ సామాజిక వర్గం ఆధ్వర్యంలో వీర్ల అంకాలమ్మకు బోనాల సమర్పించారు. ఇంది రా గాంధీ బొమ్మ వద్దనుండి కుంకుమబండి, బోనాలతో దేవాల యం వరకు చేరుకుని అమ్మవారికి నైవేద్యం సమర్పించి ముక్కులు తీర్చుకున్నారు. డప్పు వాయిద్యాలతో, డీ జె లతో మారు మోగిపోయింది. యువత కేరింతలు డాన్సులతో దద్దరిల్లింది. వర్షాలు సానుకూలంగా కురిసిపంటలు సమృద్ధిగా పండాలన పూజలు చేశారు. వ్యాపారాలు అభివ ృద్ధి చెందాలని కోరుకున్నారు.

# అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

### ఎస్సీ కమిషన్ చైర్మన్ కె.ఎస్. జవహర్





**నరసరావుపేట, ఆగస్టు 28, ప్రభాతవార్త:** ఎస్సీ కమిషన్ నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజలు, దళిత సంఘాలు సమర్పించిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కె.ఎస్. జవహర్ ఆదేశించారు. శుక్రవారం నరసరావుపేట కలెక్టర్ కార్యాలయానికి విచ్చేసిన రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కె.ఎస్. జవహర్, కమిషన్ సభ్యులు మేకల బిక్షంలకు జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల, సంయుక్త కలెక్టర్ సంజనా సింహా, నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు, ఆర్డీఓ అద్దయ్య మొక్కలు అందించి సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం కలెక్టరేట్‌లోని గుర్రం జాషువా సమావేశ మందిరంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటానికి ఎస్సీ కమిషన్ చైర్మన్ కె.ఎస్. జవహర్, కమిషన్ సభ్యులు మేకల బిక్షం, జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల, సంయుక్త కలెక్టర్ సంజనా సింహా, దళిత సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహించి ప్రజలు, దళిత సంఘాల నాయకుల నుంచి అర్జీలను స్వీకరించారు. జై భీమ్, బీఎస్పీ తదితర దళిత సంఘాల ప్రతినిధులు పలు సమస్యలపై అర్జీలను సమర్పించారు. అర్జీలను పరిశీలించిన ఎస్సీ కమిషన్ చైర్మన్ సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి సమస్యలను నిబంధనల మేరకు సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. చట్టంపై అవగాహన బుక్‌లెట్ ఆవిష్కరణదళిత బహుజన రిసోర్స్ సెంటర్, గుంటూరు వారు ముద్రించిన షెడ్యూల్డ్ కులాలు మరియు షెడ్యూల్డ్ తెగల (అత్యాచార నిరోధక) చట్టం-1989 అనుసరించి సహాయ పునరావాస పరిహారానికి ధన సహాయం-నిబంధనల్లు అనే బుక్‌లెట్‌ను ఎస్సీ కమిషన్ చైర్మన్ కె.ఎస్. జవహర్, కమిషన్ సభ్యులు మేకలబిక్షంఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఈడీ, ఎస్సీ కార్పొరేషన్ దుర్గాబాయి, డీఆర్ఓ అద్దయ్య, దళిత సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నరసరావుపేటలో పీ4తో పేదరిక నిర్మూలన దిశగా అడుగులు

### సీఎం సమీక్షలో ఎమ్మెల్యే డా. చదలవాడ



**నరసరావుపేట, ఆగస్టు 28 ప్రభాతవార్త::** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్రంలో స్టేట్ కాపబులిటి విలేజ్/వార్డు అడ్మినిస్ట్రేషన్ ప్రోగ్రాం యూనిట్లు ఏర్పాటై ఏడాది పూర్తయిన సందర్భంగా నిర్వహించిన ఉన్నత స్థాయి వీడియో కాన్ఫరెన్స్ సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే డా. చదలవాడ అరవింద బాబు పాల్గొన్నారు. నియోజకవర్గంలో పేదరిక నిర్మూలనే ధ్యేయంగా అమలవుతున్న పీ4తో జీరో పావర్టీ కార్యక్రమం అమలు తీరు, శాఖల సమర్థతను నిర్దేశించే రీశి (కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్), ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రగతితో పాటు నియోజకవర్గంలో చేపట్టిన రూ. 5.6 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి పనుల వివరాలను ముఖ్యమంత్రి దృష్టికి ఎమ్మెల్యే తీసుకెళ్లారు. ఈ సమీక్షలో భాగంగా పేద కుటుంబాలను గుర్తించి వారికి ప్రభుత్వ పథకాలు, ఉపాధి, ఆధునిక సాంకేతిక నైపుణ్యాలు మరియు ఆర్థిక సాధికారత కల్పించడంపై సీఎం ప్రత్యేక దిశానిర్దేశం చేశారు. శాఖల వారీ ప్రగతి, మౌలిక వసతుల కల్పనను ద్వారా నిరంతరం పర్యవేక్షి ంచాలని, పి జి ఆర్ ఎస్ ద్వారా ప్రజల నుంచి వచ్చే సమస్యలను వేగంగా, పారదర్శకంగా పరిష్కరించాలని ఆదేశించారు. నియోజకవర్గంలో పేదరిక రహిత సమాజం దిశగా చేపట్టిన సర్వేలో మొత్తం 13,594 బంగారు కుటుంబాలన్ను గుర్తించగా, 497 మంది మార్గదర్శకులు ముందుకు వచ్చి ఇప్పటికే 5,312 కుటుంబాలను దత్తత తీసుకున్నారని ఎమ్మెల్యే డా. చదలవాడ సీఎంకు వివరించారు. నరసరావుపేట అర్బన్ పరిధిలో 5,161 కుటుంబాలు, 340 మంది మార్గదర్శకులు, నరసరావుపేట రూరల్ పరిధిలో 5,406 కుటుంబాలు, 106 మంది మార్గదర్శ కులు, రొంపిచర్ల మండలంలో 3,027 కుటుంబ ాలు, 51 మంది మార్గదర్శకులు నమోదయ్యారు. డిజిటల్ విద్యలో భాగంగా తిలక్ హైస్కూల్‌లో రూ.7 లక్షలతో కంప్యూటర్ ల్యాబ్ మరుగుదొడ్ల నిర్మాణం, ప్రభుత్వ పాఠశాలలకు రూ. 6 లక్షల విలువైన కంప్యూటర్ల పంపిణీ చేపట్టారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు గాను తురుమెళ్ల గ్రామంలో రూ. 6 లక్షలతో, అన్న క్యాంటీన్ వద్ద రూ. 1 లక్షతో సురక్షిత తాగునీటి ఆర్వో ప్లాంట్లనుఏర్పాట ుచేశారు. ము ఖ్యమంత్రి దార్శనిక ఆలోచనలకు అనుగుణంగా పీ4, రీశి, పిజిఆర్ఎస్ కార్యక్రమాలను నియోజవర్గంలో పకడ్బందీగా అమలు చేస్తూ, ప్రభుత్వ సంక్షేమం మరియు బ్యాంకుల భాగస్వామ్యంతో నరసరావుపేట ను రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు స్పష్టం చేశారు.

### ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడకు రాఖీలు కట్టిన

## బ్రహ్మాకుమారీలు,కూటమి మహిళా నేతలు



**నరసరావుపేట, ఆగస్టు 28 ప్రభాతవార్త ::** పవిత్ర రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు క్యాంపు కార్యాలయంలో రాఖీ వేడుకలు అత్యంత ఆత్మీయంగా, ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్థానిక బ్రహ్మకుమారీల సోదరీమణులు, టీడీపీజనసేనబీజేపీ కూటమి మహిళా నాయకురాళ్ళు, కార్యకర్తలు మరియు నియోజకవర్గ ప్రజలు పెద్ద సంఖ్యలో విచ్చేసి ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబుకి ఎంతో ఉత్సాహంగా, ప్రేమాభిమానాలతో రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. బ్రహ్మకుమారీల సోదరీమణులు స్వయంగా విచ్చేసి రాఖీ కట్టి, ఆశీస్సు లు అందించడంపై ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా శాంతి, రాజయోగ ధ్యానం, ఆధ్యాత్మిక విలువలను విస్తరిస్తూ బ్రహ్మకుమారీలు అందిస్తున్న నిస్వార్థ సేవలు నేటి సమాజానికి ఎంతో స్ఫూర్తిదాయకమని కొనియాడారు. మానసిక ప్రశాంతత, సానుకూల ఆలోచనలు సమాజానికి అత్యంత అవసరమని పేర్కొంటూ బ్రహ్మకుమారీ సంస్థ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగేతనను సొంతసోదరుడిలా భావించి పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఆశీర్వదించిన కూటమి మహిళా ప్రతినిధులకు, నియోజకవర్గ ఆడపడుచులకు, సోదరీమణులకు డాక్టర్ చదలవాడ అరవింద బాబు హృదయపూర్వక రక్షాబంధన్ శుభాకాంక్షలు మరియు ధన్యవాదాలు తెలియజేశారు.

## ఎమ్మెల్యే చదలవాడ ప్రజా వేదికకు 28 ఫిర్యాదులు



**నరసరావుపేట, ఆగస్టు 28 ప్రభాతవార్త ::** ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకునే ఉద్దేశంతో నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న ప్రజా వేదిక కార్యక్రమం శుక్రవారం స్థానిక గుంటూరు రోడ్డులోని ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. మొత్తం 28 ఫిర్యాదులు అందాయి. ప్రధానంగా పింఛన్లు, నివేశన స్థలాలు, పారిశుద్ధం, మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలపై ప్రజలు వినతులు సమర్పించారు. ఎమ్మెల్యే అరవింద బాబు ప్రతి వినతిని ఓపికగా విని, సమస్యల వివరాలను అడిగి తెలుసుకున్నారు. తక్షణ పరిష్కారం అవసరమైన కొన్ని సమస్యలపై సంబంధిత శాఖల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చని, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడతామని ఎమ్మెల్యే డా. చదలవాడ అరవింద్ బాబు తెలిపారు.

## పట్టణ పోలీస్ స్టేషన్‌లో విచారణకు హాజరైన డాక్టర్ గజ్జల

### డాక్టర్ గజ్జల



**సత్తెనపల్లి (ఆగస్టు 28, ప్రభాతవార్త):** డీఎస్సీ నియామకాల విషయంలో అర్హులకు న్యాయం చేయాలని ప్రశ్నించినందుకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు నమోదు చేసి పోలీస్ స్టేషన్‌లో విచారణకు హాజరు కావాలని నోటీసులు జారీ చేశారని వైఎస్సార్‌సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ రెడ్డి ఆరోపించారు. ఈ నేపథ్యంలో డాక్టర్ గజ్జల శుక్రవారం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి సత్తెనపల్లి పట్టణ పోలీస్ స్టేషన్‌లో విచారణకు హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ గజ్జల మాట్లాడుతూ డీఎస్సీ పేరుతో దగా చేసి, అర్హులను పక్కనపెట్టి, డీఎస్సీ అర్హత పరీక్ష రాయకుండానే అనర్హులకు స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు కల్పించారని ఆరోపించారు. దీనిపై అర్హులకు న్యాయం చేయాలని ప్రశ్నించినందుకే వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై కేసులు నమోదు చేశారని అన్నారు. ఇలాంటి కేసులు ఎన్ని పెట్టినా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. అనర్హులకు ఉద్యోగాలు కల్పించడం ద్వారా కూటమి ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటవ ాడుతోందని విమర్శించారు. అర్హులైన అభ్యర్థులకు న్యాయం జరిగే వరకు వైఎస్సార్‌సీపీ పోరాటం కొనసాగిస్తుందని డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ రెడ్డి తెలిపారు.

## పేదరిక నిర్మూలనే పీ4 లక్ష్యం: చీఫ్‌విప్ జీ.వీ



**వినుకొండ, ఆగస్ట్28, ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు పీ4 కార్యక్రమం స్వర్ణ నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ల పనితీరుపై నిర్వహించిన ఉన్నత స్థాయి వీడియో కాన్ఫరెన్స్‌లో వినుకొండ పట్టణ మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ అత్యంత ప్రతిష్టాత్మక ప్రాధాన్యతా కార్యక్రమాలైన స్వర్ణాంధ్ర 2047 విజన్ పేదరిక నిర్మూలనకు సమాజ భాగస్వామ్యంతో కూడిన పీ4ఖి (పీ4 పీపుల్స్ పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్) అమలు యూనిట్ల విధివిధానాలపై దిశానిర్దేశం చేశా రు. 2047 నాటికి రాష్ట్రాన్ని అన్ని రంగాలలోనూ అగ్రగామిగా నిలిపి వికసిత ఆంధ్రప్రదేశ్ సాధించడమే లక్ష్యమనిస్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ ముగిసిన వెంటనే ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు వినుకొండ నియోజకవర్గ యూనిట్ 9 మంది సభ్యుల బృందంతో ప్రత్యేకంగా సమీక్షా సమావేశం నిర్వహించారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజాదర్బార్ లక్ష్యం



**వినుకొండ, ఆగస్ట్ 28, ప్రభాతవార్త:** ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారంచూపడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్,ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. శుక్రవారం వినుకొండ మున్సిపాలిటీలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో పాల్గొన్న ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఒక్కో అర్జీని స్వయంగా పరిశీలించి సంబంధిత శాఖల అధికారులతో నేరుగా ఫోన్‌లో మాట్లాడి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వినుకొండకు చెందిన చెరుకూరి సుబ్బారావు తన భూమికి సంబంధించి సర్వే నంబర్లు 293/2, 293/3, 292/1పీలో రెవెన్యూ రికార్డులు ఆన్‌లైన్ నమోదుకు సంబంధించిన సమస్యను చీఫ్‌విప్ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన జీవీ ఆంజనేయులు సంబంధిత తహసీల్దార్‌తో ఫోన్‌లో మాట్లాడి రికార్డులను సమగ్రంగా పరిశీలించి నిబంధనల ప్రకారం సమస్యను పరిష్కరించాలని సూచిస్తూ అర్జీని ఎండార్స్ చేశారు. బొల్లాపల్లి మండలానికి చెందిన ఎస్సీ కుటుంబాల ప్రతినిధులు ప్రభుత్వ భూమిలో పేద కుటుంబాలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. సుమారు 150 కుటుంబాలకు మూడు సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు కల్పించాలన్న అభ్యర్థనతో పాటు సర్వే నంబర్లు 450,451కు సంబంధించిన వివరాలను పరిశీలించిన చీఫ్‌విప్ బొల్లాపల్లి తహసీల్దార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ప్రభుత్వ భూమి లభ్యత, రెవెన్యూ రికార్డులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులైన పేదలకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని ఆదేశిస్తూ అర్జీని ఎండార్స్ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## న్యాయవాద పరిరక్షణ చట్టాన్ని తక్షణమే అమలు చేయాలి

### ఎన్నికల ముందు ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలి

### సత్తెనపల్లి బార్ అసోసియేషన్



**సత్తెనపల్లి (ఆగస్టు 28, ప్రభాతవార్త):** ఎన్నికల ముందు ఇచ్చిన హామీలో భాగంగా న్యాయవాద పరిరక్షణ చట్టాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తక్షణమే రూపొందించి అమలు చేయాలని సత్తెనపల్లి బార్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. సత్తెనపల్లి బార్ అసోసియేషన్ కార్యవర్గం ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని నాలుగు న్యాయస్థానాల్లో న్యాయవాదులు విధులను బహిష్కరించారు. అనంతరం తాలూకా న్యాయస్థానం ప్రాంగణంలోని న్యాయదేవత విగ్రహం వద్ద నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో న్యాయవాదులకు కనీస రక్షణ కూడా లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పొరుగు రాష్ట్రం తెలంగాణలో న్యాయవాద పరిరక్షణ చట్టాన్ని తీసుకువచ్చి న్యాయవాదుల వృత్తికి ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రభుత్వం భరోసా కల్పించిందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా న్యాయవాదులు స్వేచ్ఛగా, నిర్భయంగా తమ వృత్తిని కొనసాగించేలా రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రభుత్వం ఏర్పడి దాదాపు 27 నెలలు గడిచినా న్యాయవాద పరిరక్షణ చట్టాన్ని తీసుకురాకపోవడాన్ని తీవ్రంగా ఖండించారు. న్యాయవాదులు తమ ఉద్యమాన్ని ఉధృతం చేయకముందే ప్రభుత్వం స్పందించి, న్యాయవాద పరిరక్షణ చట్టాన్ని తక్షణమే రూపొందించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. న్యాయవాదుల భద్రతకు చట్టపరమైన రక్షణ కల్పించి, వారు స్వేచ్ఛాయుత వాతావరణంలో వృత్తిని కొనసాగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సత్తెనపల్లి బార్ అసోసియేషన్‌కు చెందిన పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

## ఘనంగా రాఖీ పౌర్ణమి, వరలక్ష్మీ వ్రతం



**సత్తెనపల్లి (ఆగస్టు 28, ప్రభాతవార్త):** మూడవ శ్రావణ శుక్రవారం సందర్భంగా సత్తెనపల్లి పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో రాఖీ పౌర్ణమి, వరలక్ష్మీ వ్రత కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ చలువాది చిన సత్యనారాయణ విద్యార్థులకు రాఖీ పౌర్ణమి విశిష్టతను వివరించారు. శ్రీ వెంకట రఘునాథ శాస్త్రీ ఆధ్వర్యంలో మాతృమూర్తులచే వరలక్ష్మీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం విద్యార్థులు సత్తెనపల్లి పట్టణంలోని పోలీస్ స్టేషన్, మండల విద్యాశాఖ కార్యాలయం, కెనరా బ్యాంకు, కోర్టు, ఇరిగేషన్ కార్యాలయాలకు వెళ్లి అక్కడి అధికారులు, సిబ్బందికి రాఖీలు కట్టారు. "నేను నీకు రక్ష.. నీవు నాకు రక్ష.. మనిద్దరం దేశానికి రక్ష" అనే సందేశంతో రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షులు శ్రీ దేవరశెట్టి రవికుమార్, ప్రధానాచార్యులు శ్రీమతి మన్నవ ధనలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

MN 8 PAGE-BPTfff:MN 8 PAGE-BPTfff 01/01/2001 10:29 Page 1



# బాపట్ల జిల్లా వార్త



## భావనారుషి స్వామికి ప్రత్యేక పూజలు

**భట్టి ప్రోలు(రేపల్లె), ఆగస్టు 28, ప్రభాతవార్త:** భట్టి ప్రోలు మండలంలోని ఐలవరంలో శుక్రవారం శ్రీ భద్రావతి సమేత భావనారుషి స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.భజన సంకీర్తనలు,పౌర్ణమి సామూహిక హారతులిచ్చారు.దాతల సహకారంతో పేద భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కొసనం భాస్కర వెంకటరమణ,జొన్నాదుల సాంబశివరావు,మాచర్ల రంగారావు,పట్టెం మల్లికార్జునరావు, పి.సత్యనారాయణ, జొన్నాదుల రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



## వైకాపా మండల కన్వీనర్ రాజీనామా

భట్టి ప్రోలు(రేపల్లె), ఆగస్టు 28, ప్రభాతవార్త:వేమూరు నియోజకవర్గంలోని భట్టి ప్రోలు మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ పదవికి పడమటి శ్రీనివాసరావు శుక్రవారం రాజీనామా చేశారు.1983 నుండి రాజకీయాలలో చురుకుగా పాల్గొంటున్న నేపథ్యంలో మాజీ సిఎం జగన్మోహన్‌రెడ్డి విధివిధానాలకు ఆకర్షితుడనై వైకాపాలో చేరిన దగ్గర్నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు.ఇటీవలి కాలంలో పార్టీలో గ్రూపు రాజకీయాలు కొనసాగుతున్నందున మనస్తాపంతో పార్టీ పదవికి తన రాజీనామా లేఖను వైకాపా రాష్ట్ర అధికారప్రతినిధి, వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబుకు అందజేసినట్లు శ్రీనివాసరావు తెలిపారు.



## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా జాతీయ పత్రిక అడుగులు అభినందనీయం

### జాతీయ తెలుగు దినపత్రిక 30వ వార్షికోత్సవ ప్రత్యేక సంచిక అవిష్కరణలో కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్

**బాపట్ల, ఆగస్టు28,ప్రభాతవార్త.ప్రతినిధి: :** ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు వాస్తవాలను నిర్భయంగా ప్రచురిస్తూ ప్రజలకు,ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తున్న జాతీయ తెలుగు దినపత్రిక వార్తపత్రిక సేవలు అభినందనీయమని బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్



వి.వినోద్‌కుమార్ అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తనవంతు బాధ్యతగా పత్రిక ముందుకు సాగడం ప్రశంసనీయమని పేర్కొన్నారు.జాతీయ తెలుగు దినపత్రిక 30వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని రూపొందించిన ప్రత్యేక సంచికను జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్రిక 30 సంవత్సరాలుగా ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడమే కాకుండా,సమాజంలో జరుగుతున్న పరిణామాలను ప్రజలకు చేరవేయడంలో కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు.సమాజంలో పత్రికల పాత్ర అత్యంత కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు.ప్రజలకు సంబంధించిన సమస్యలు,ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు,అభివృద్ధి పనులు,ప్రజా అవసరాలను ఎప్పటికప్పుడు వెలుగులోకి తీసుకురావడం ద్వారా పాలనా వ్యవస్థను మరింత బాధ్యతాయుతంగా పనిచేసేలా చేయడంలో మీడియా ముఖ్య భూమిక పోషిస్తుందన్నారు.వాస్తవాలను నిర్ధారించుకుని,నిష్పక్షపాతంగా వార్తలను ప్రచురించడం ద్వారా ప్రజల్లో విశ్వాసాన్ని మరింత పెంపొందించుకోవాలని సూచించారు.ప్రజా సమస్యల పరిష్కారానికి దోహదం ప్రజల గొంతుకగా నిలుస్తూ వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం పత్రికల ప్రధాన బాధ్యతల్లో ఒకటని అన్నారు.ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం ద్వారా పత్రికలు సమాజానికి మరింత ఉపయోగపడతాయన్నారు.ఈ దిశగా జాతీయ పత్రిక వార్త పత్రిక చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.30వ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక సంచికను తీసుకురావడం పట్ల పత్రిక యాజమాన్యాన్ని, సంపాదక పాత్రికేయులను కలెక్టర్ అభినందించారు.భవిష్యత్తులోనూ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా,నిజాలను నిర్భయంగా ప్రచురిస్తూ మరింత ఉన్నత ప్రమాణాలతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జిల్లా సమాచార,పౌర సంబంధాల అధికారి (డీఐపీఆర్ఓ) వెంకట రమణ,జిల్లా వార్త పత్రిక ఇన్‌చార్జి కోటి ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి రహిత జిల్లాగా బాపట్లను తీర్చిదిద్దాలి

### జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్

**బాపట్ల, ఆగస్టు28,ప్రభాతవార్త.ప్రతినిధి:**

బాపట్ల జిల్లాను గంజాయి, మాదకద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. జిల్లాను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తున్న నేపథ్యంలో మాదకద్రవ్యాల ప్రభావం లేకుండా చూడాల్సిన బాధ్యత అన్ని శాఖలపై ఉందన్నారు.




మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగంపై నిరంతర తనిఖీలు నిర్వహించాలని సూచించారు.పాఠశాలలు, కళాశాలలు, విద్యాసంస్థలు, బహిరంగ ప్రదేశాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. విద్యార్థులు, యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండేలా అవగాహన కల్పించాలన్నారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగానికి సంబంధించిన సమాచారం ఉంటే టోల్‌ఫ్రీ నంబరు 1972కు ఫోన్ చేసి తెలియజేయాలని ప్రజలకు సూచించారు. మాదకద్రవ్యాల నియంత్రణకు పోలీసు, రెవెన్యూ, వైద్య ఆరోగ్య, విద్య, రవాణా తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ అన్నారు. నిరంతర తనిఖీలతో పాటు అవగాహన సదస్సులను మరింత పెంచాలని ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన నార్కోటిక్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశంలో అదనపు ఎస్పీ సుధాకర్, చీరాల, బాపట్ల, రేపల్లె డీఎస్పీలు మొయిద్దీన్, చంద్రమోళి, అజీజ్, జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాససింగ్,డిసిహెచ్ పద్మావతి, జిల్లా రవాణాశాఖ అధికారి పరంధామరెడ్డితో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

## ఎరువుల నిల్వలపై 2వ రోజు కొనసాగిన విచారణ

**వేమూరు ఆగస్టు 28 (ప్రభాతవార్త) :** వేమూరు వ్యవసాయ సహకార పరపతి సంఘంలో ఎరువుల అక్రమంగా నిల్వలు ఉన్నాయని వచ్చిన ఫిర్యాదులపై రెండో రోజు కూడా విచారణ కొనసాగింది. విచారణ అధికారిగా వచ్చారు. ఏడిఏ జివిబి ప్రవీణ్ హాజరై సొసైటీ అధికారులు, ఫిర్యాదుదారులను విచారణ చేశారు. గురువారం విచారణ రేపల్లె ఏడిఏ హాజరవుగా మరుసటి రోజు వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు పర్చూరు ఏడిఏ విచారణ అధికారిగా రావటం అనేక అనుమానాలకు దారితీస్తుంది. ఎరువుల కోసం రైతులు ఇబ్బందులు పడుతుంటే కందరు అక్రమంగా ఎరువులు నిల్వ ఉంచుతున్నారంటూ రైతులు విస్మయం వ్యక్తం చేశారు. అయితే గత సంవత్సర కాలం నుండి ఎరువుల అక్రమాలపై అనేక ఫిర్యాదులు వస్తూనే ఉన్నాయి. స్థానికులు కొందరుపై అధికారులకు విచారణ జరపాలని అర్జీలు దాఖలు చేశారు. అయితే సంవత్సర కాలం నాడు జరిగిన అక్రమ అమ్మకాలపై ఎలాంటి చర్యలు లేకుండా సంపూర్ణంగా విచారణ జరపకుండా ఆ విషయాన్ని పక్కన పెట్టారు. ఇదిలా ఉండగా గత మూడు నెలల నాడు సభ్యుల ఆమోదంతో గుంటూరు జిల్లాలోని ఎరువుల ట్రేడర్స్ దగ్గర నిబంధనలకు విరుద్ధంగా ఎరువులు కొనుగోలు చేసి సొసైటీకి సంబంధించిన గోడౌన్‌లో నిల్వలు చేశారని, దీనిపై విచారణ చేయాలని మరొకసారి స్థానికులు వ్యవసాయ శాఖ డైరెక్టర్ దృష్టికి తీసుకువెళ్ళారు. దీనిపై కూడా ఇప్పటికి రెండు సార్లు విచారణ నిమిత్తంగా వచ్చిన అధికారులు ఎలలాంటి చర్యలు తీసుకుంటున్నారు. అసలు చర్యలు తీసుకుంటారో లేదో అన్న విధానంలో వ్యవహరించి వెళ్ళిపోతున్నారుపై అధికారుల దృష్టికి వెళ్ళిన స్థానికులు పెట్టిన పటిషన్లకు సంపూర్ణమైన విచారణ కానీ, దానిపై చర్యలు కానీ లేకపోవడంతో స్థానికులు వ్యవసాయ శాఖ మరియు సహకార శాఖ అధికారులపై అనుమానాలు వ్యక్తపరుస్తున్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

### జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్

**బాపట్ల, ఆగస్టు28,ప్రభాతవార్త.ప్రతినిధి:**

జిల్లాలో రోడ్డు ప్రమాదాలను మరింతగా తగ్గించేందుకు పోలీస్, రవాణా, ఆర్‌అండ్‌బీ, జాతీయ రహదారుల శాఖల అధికారులు సమన్వయంతో పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని న్యూ వీసీ హాల్‌లో నిర్వహించిన జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో రోడ్డు ప్రమాదాల నివారణ, బ్లాక్‌స్పాట్లు, ప్రమాదకర ప్రాంతాల్లో భద్రతా చర్యలు, ప్రజల్లో అవగాహన తదితర



అంశాలపై సమీక్షించారు.జిల్లాలో రోడ్డు ప్రమాదాల సంఖ్య తగ్గుతున్నప్పటికీ, ప్రమాదాల నివారణకు మరింత పటిష్టమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలు, సాయంత్రం వేళల్లో ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.

**బ్లాక్‌స్పాట్ల వద్ద తక్షణ చర్యలు..**

జిల్లాలో గుర్తించిన బ్లాక్‌స్పాట్లు, ప్రమాదకర ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉన్న భద్రతా చర్యలను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అవసరమైన చోట్ల సైన్‌బోర్డులు, బారికేడ్లు, హెచ్చరిక సూచికలు ఏర్పాటు చేయాలని, రహదారులపై చెట్లు, పొదలు పెరగకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు.

**ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన..**

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించేలా చర్యలు తీసుకోవాలని, మద్యం సేవించి వాహనాలు నడపకుండా కఠినంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ చేపట్టాలని ఆదేశించారు. అదే విధంగా జిల్లాలో ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి ప్రయాణం చేయాలని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

**పీఎం రహత్ క్యాష్‌లెస్ చికిత్స పై అవగాహన..**

రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు తక్షణ వైద్యం అందించడంలో పీఎం రహత్ పథకంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. ప్రమాదం జరిగిన వెంటనే బాధితులను సమీపంలోని సంబంధిత ఆసుపత్రికి తరలించి, పీఎం రహత్ కింద అందించే క్యాష్‌లెస్ చికిత్సకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. ప్రమాద బాధితులకు అత్యవసర వైద్యం అందించడంలో ఎలాంటి జాప్యం లేకుండా సంబంధిత శాఖలు, ఆసుపత్రులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి శాఖ బాధ్యతగా భావించి సమన్వయంతో పనిచేయాలని, ప్రజల ప్రాణాలను కాపాడే విషయంలో నిర్లక్ష్యానికి తావులేకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా అదనపు ఎస్పి సుధాకర్, చీరాల, బాపట్ల, రేపల్లె డీఎస్పీలు, రవాణా శాఖ అధికారి పరంధామరెడ్డి, నేషనల్ హైవే అధికారులు, ఆర్ అండ్ బి డిఇ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## సంఘటిత పోరాటంతోనే సమస్యలకు పరిష్కారం

**రేపల్లె, ఆగస్టు 28, ప్రభాతవార్త:** సమస్యల పరిష్కారానికి సంఘటిత పోరాటమే శరణ్యమని సిఐటియు బాపట్ల జిల్లా కోశాధికారి సిహెచ్.మణిలాల్ పిలుపునిచ్చారు.శుక్రవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో జరిగిన రేపల్లె ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ సమావేశానికి డిపో అధ్యక్షుడు బి.సురేష్ అధ్యక్షతవహించారు.ఈ సందర్భంగా మణిలాల్ మాట్లాడుతూ ఆర్టీసీ ప్రవేటీకరణ విధానాలు,విద్యుత్ బస్‌ల పేరుతో డిపోల మూసివేత నిర్ణయాలు విరమించుకోవాలని,ఆర్టీసీలో ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఆర్టీసీలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం జెఎసిగా ఏర్పడి పోరాటం చేస్తున్నందున కార్మికులు ఐక్యతను చాటాలని ఆయన కోరారు.ఎస్‌డబ్ల్యూఎఫ్ రేపల్లె డిపో కార్యదర్శి ఎన్.సాగర్ మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో బేబీ రాణి,కారంకి శ్రీను,సుబ్బారావు,బి.స్టాలిన్,గాంధీ తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ వేములమ్మతల్లి-శ్రీ పోతురాజు స్వామి వార్ల నూతన దేవాలయ నిర్మాణానికి భూమిపూజ

నిజాంపట్నం, ఆగస్టు 28, ప్రభాతవార్త : గ్రామదేవతలు ఎల్లప్పుడు గ్రామాలను, గ్రామ ప్రజలను రక్షిస్తుంటారని మంత్రి సోదరుడు శివప్రసాద్ అన్నారు. మండలంలోని అడవులదీవి గ్రామదేవత శ్రీ వేములమ్మతల్లి- శ్రీ పోతురాజుస్వామి వార్ల నూతన దేవాలయానికి శుక్రవారం భూమిపూజ, శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దైవంపట్ల భక్తి, భయం కలిగి ఉండాలన్నారు. రోజూ కొంత సమయం దైవారాధనకు కేటాయించాలన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త యల్లాప్రగడ సతీష్‌బాబు, తెదెపా, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## అవధాని నారాయణ బాల సుబ్రహ్మణ్యంకు, వైఖానస సాహిత్య రత్న బిరుదు ప్రధానం

**తెనాలి ఆగస్ట్ 28(ప్రభాతవార్త):** స్థానిక గోవర్ధన స్వామి ఆలయ ప్రాంగణంలో శ్రావణ పూర్ణిమ పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ వైఖానస సేవా సంఘం ఏర్పాటు చేసిన అష్టావధాన కార్యక్రమం సాహితీప్రియ లను అలరించింది. పృచ్ఛకుల సంధించిన ప్రశ్నలకు అవధాని నారాయణ బాలసుబ్రమణ్యం అలవోకగా సమాధానాలు ఇచ్చారు.చందోబద్ధంగా ఆశువుగా సామాజిక సాంస్కృతిక ధార్మిక పరంగా అలవోకగా పద్యాలను ఆలపించారు. సమన్వయకర్తగా నల్లూరి అనంతశయనం వ్యవహరించగా,నిషిద్ధాక్షరి రంగనాథ్ సమస్య నల్లూరి లక్ష్మీ ౖనారాయణ భట్టాచార్యులు,దత్తపతి పరాశరం శ్రీనివాసాచార్యులు వర్ణన, దేవయజనం మురళీకృష్ణ ఆశువు మేడూరి శ్రీనివాస్ మూర్తి అప్రస్తుత ప్రసంగం తమిళ్ అనంత ఆచార్యులు యాంత్రిక గణితం పెద్దింటి గాన కళావతి చం దో భాషణం శ్రీనివాస కళ్యాణం చక్రవర్తి లు గావించారు.ఈ సందర్భంగా అవధాని సుబ్రహ్మణ్యం వైఖానస సాహిత్య రత్న బిరుదుతో సన్మానించారు అగ్నిహోత్రం లక్ష్మీనరసింహాచార్యులు పుండరీక వల్లి తాయారు జ్ఞాపకార్థం కుమారులు సనత్ కుమార్ శ్రీనివాస్ దీక్షితులు రొంపిచర్ల శ్రీనివాసాచార్యులు జ్ఞాపకార్థం శేష సాయిలు అవధానికి పండిత సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైకుంటపురం దేవస్థానం పూర్వ అర్చకులు దీవి శ్రీనివసచార్యులు, బృందావనం గోపాలచార్యులు, పండితులను సత్కరించారు. అధ్యక్షులు శ్రీనివసమూర్తి ప్రధాన కార్యదర్శి మాధవ కుమార్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రఘు కోశాధికారి యోగానంద చక్రవర్తి గౌరవాధ్యక్షులు నరసింహానాచార్యులు అనంత ఆచార్యులు వేణుగోపాల్ ధనవంత్రి యువ వైఖానస సంఘం నాయకులు డాక్టర్ అనిల్ కుమార్ యశ్వంత్ వంశీకృష్ణ సాయి వరుణ్ తదితరులు పాల్గొన్నారు.



## పరిశోధనా రంగంలో ఎస్‌విఆర్‌ఎం కళాశాల ఘనత

**నగరం, ఆగస్టు 28, ప్రభాతవార్త:** విద్యా, పరిశోధనా రంగంలో ఎస్ వి ఆర్ ఎం కళాశాల ఘనత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అనగాని హరికృష్ణ అన్నారు. ఎస్ వి ఆర్ ఎం కళాశాల విద్యార్థిని ఎన్. నాగలక్ష్మి దేవి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో రాజనీతి శాస్త్ర విభాగంలో డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పీహెచ్.డీ) డిగ్రీ నీ విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు. రంపచోడవరం ప్రాంతంలో గిరిజన మహిళల సాదికారతలో ఐటీడీఏ పరిపాలనా పాత్ర పై ప్రధానమైన పరిశోధన నిర్వహించినట్లు తెలిపారు. గిరిజన మహిళల సామాజిక ఆర్థిక సాధికారతలో సమగ్రంగా అధ్యయనం చేశారు. తొలి పరిశోధక విద్యార్థినికి కళాశాల ప్రిన్సిపాల్ అనగాని హరికృష్ణ ప్రారంభ దశ నుంచి పరిశోధన పూర్తయ్యే వరకు సలహాలు, సూచనలు శాస్త్రీయ మార్గదర్శకాన్ని అందించడం జరిగిందని తెలియజేశారు. కళాశాల విద్యార్థిని పీహెచ్.డీ సాధించిన ఎన్ నాగలక్ష్మి దేవి, ఈ విజయానికి సహకరించిన ప్రిన్సిపల్ డాక్టర్ అనగాని హరికృష్ణని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ అభినందనలు తెలియజేశారు. పరిశోధనా రంగంలో కళాశాల పేరు మరింత ఉన్నత స్థాయికి తీసుకువెళ్లే విధంగా విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. పీహెచ్.డీ సాధించిన విద్యార్థినికి కళాశాల అధ్యాపకులు తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు.



## మాజీ ఎమ్మెల్యే శివకుమార్‌కు రాఖీ కట్టిన మహిళానేతలు

**తెనాలి ఆగస్ట్ 28(ప్రభాతవార్త):**

తెనాలి పట్టణం గంగానమ్మపేట లోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు, శుక్రవారం రాఖీ పౌర్ణమి సందర్భంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ



సోదరీమణులు,మాజీ శాసనసభ్యులు అన్నాబత్తుని శివకుమార్ ని కలిసి ప్రేమపూర్వకముగా రక్షాబంధన్ కట్టి మిఠాయిలు పంచారు. ఈ కార్యక్రమంలో కొర్ర యశోద కపూర్,షేక్ జాకీరా,షేక్ ఇస్రాత్, తురక శాంతి కుమారి, సిద్ధ బత్తుని శాంతి కుమారి, ఎం.ఇందిరా ప్రియదర్శిని,శ్రీమతి జయప్రద,అనుగోలు జాస్మిన్, బండికళ్ళ భార్గవి, గుర్రం హేమలత,తదితర మహిళా సోదరీమణులందరూ మాజీ ఎంఎల్ఏ శివకుమార్‌కి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.

## సిపిఎం ఆధ్వర్యంలో విద్యుత్ అమరవీరులకి నివాళి

**తెనాలి ఆగస్ట్ 28(ప్రభాతవార్త):** సిపిఎం, తెనాలి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో చెంచు పేట ప్రజాసంఘాల కార్యాలయంలో, శుక్రవారం విద్యుత్ అమర్ వీరుల సంస్మరణ సభ నిర్వహించారు.సభకు ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ములక శివ సాంబిరెడ్డి అధ్యక్షత వహించారు.ఆనాడు పోలీస్ కాల్పుల్లో మరణించిన రామకృష్ణ, విష్ణువర్ధన్ రెడ్డి, బాల స్వామి లకు సంతాపం ప్రకటిస్తు రెండు నిమిషాలు మోనం పాటించారు.సిపిఎం జిల్లా కార్యదర్శి కే.బాబూప్రసాద్ మాట్లాడుతూ,అమరవీరులు మరణించి 26 యేళ్ళు గడుస్తున్నా ఇప్పటికీ ప్రజల హృదయాల్లో వారికి గౌరవ స్థానం వున్నాయని తెలిపారు.వారి రక్త తర్పణంతో ప్రజలకు యెంతో ఉపసమనం కలిగిందని చెప్పారు.ఆనాటి ముఖ్యమంత్రి అధికారాన్ని కోల్పోయిన పరిస్థితి యేర్పడ్డదని గుర్తు చేశారు.ప్రభుత్వాలు క్రాస్ సబ్సిడీ లు రద్దు చేయలేకపోయారని, రైతులకు ఉచిత విద్యుత్ కొనసాగుతోందన్నారు.విద్యుత్ రంగం ప్రైవేటీకరణ చేయాలని ఆలోచన విరమించుకోవడం , వాయిదా వేయడం జరిగిందన్నారు.20యేళ్ళు విద్యుత్ చార్జీలు పెంచటానికి పాలకులు సాహసం చేయలేదు అని చెప్పారు.ఆనాడు వామపక్షాలు చేసిన పోరాటం ఉమ్మడి రాష్ట్రం లో పెద్ద ఎత్తున కదలిక తెచ్చింది అని చెప్పారు.ప్రపంచ బ్యాంకు నివ్వెర పోయిందని గుర్తుచేశారు. ఒక తెలుగు నాయకుడి ద్వారా అమలు చేయాలని చూసిన ప్రపంచ బ్యాంక్ కు మరో తెలుగు నాయకుడు బీవీ.రాఘవులు అడ్డగోడ గా నిలబడి ఏపీ లో సంస్కరణలు అమలు కాకుండా ప్రజలను కూడ గట్టి నిలువర్నిచారన్నారు.ఆ స్ఫూర్తితో నేటి ప్రజా కంటకపాలన కు వ్యతిరేకంగా పోరాటం చేయడమే అమరులకు మనం ఇచ్చే నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో షేక్.హుస్సేన్ వలి ,జి.శివాజీ,పి.రాజ శేఖర్,జి.వెంకట సుబ్బయ్య, కే.శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.




## వైకాపా ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలు


**రేపల్లె, ఆగస్టు 28, ప్రభాతవార్త:** పట్టణంలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం రక్షాబంధన్ వేడుకలను నిర్వహించారు.ఈ సందర్భంగా వైకాపా రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త పీటా నాగమోహన్‌కృష్ణ మాట్లాడుతూ అన్నాచెల్లెళ్ళ అనురాగానికి,అక్కా తమ్ముళ్ళ ఆప్యాయతకు ప్రతీకగా నిలిచే పవిత్ర బంధమే రక్షాబంధనం



అని అన్నారు.రేపల్లె నియోజకవర్గంలోని మహిళలకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలను నాగమోహన్‌కృష్ణ తెలియజేశారు.వైకాపా మహిళా కుటుంబ సభ్యులు నీలపాల గౌతమి,పరిశ శ్రీలక్ష్మి,వీసం నాగలక్ష్మి తదితరులు సోదరభావంతో నాగమోహన్‌కృష్ణకు రక్షాబంధన్ కట్టారు.ఈ కార్యక్రమంలో వైకాపా శ్రేణులు పాల్గొన్నారు.

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన తెదేపా నాయకులు

**తెనాలి మున్సిపాలిటీ ఆగస్ట్28(ప్రభాతవార్త):** మానవత్వమే ధ్యేయంగా,ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక చేయూత అందిస్తున్న తెలుగుదేశం పార్టీ నాయకులు.తెనాలి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ , మాజీ మంత్రి ,ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ చొరవ మరియు ప్రత్యేక సహకారంతో తెనాలి నియోజకవర్గానికి చెందిన కొలసాని కోటేశ్వరరావు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.5,02,838/ కొలసాని కల్యాణి వైద్య ఖర్చుల నిమిత్తం



రూ.5,02,838/షేక్ కరీముల్లా వైద్య ఖర్చుల నిమిత్తం రూ.1,32,546/ ముఖ్యమంత్రి సహాయనిధి లెటర్ అఫ్ క్రెడిట్ నుంచి మొత్తం రూ. 11,32,846/ మంజూరైంది.ఈ ఆర్థిక సహాయానికి సంబంధించి శుక్రవారం వారికి 11,32,546/ ల చెక్కులను తెలుగుదేశం పార్టీ నాయకులు అందజేశారు.ఆపద సమయంలో ఆదుకున్నందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి,అలాగే ప్రజల కోసం నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ కి బాధిత కుటుంబ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ ఖుద్దూస్,పసుపులేటి త్రిమూర్తి,శాఖమూరి సురేంద్ర, మల్లవరపు విజయ్,షావుల్,యోగేష్ తదితరులు పాల్గొన్నారు.

# గూడు లేదు.. నిలువ నీడలేదు!



## సర్వం కోల్పోయామంటూ నేపాల్ బాధితుల ఆవేదన

### ఇంతటి విధ్వంసం ఎప్పుడూ చూడలేదంటున్న సహాయక బృందాలు

### చైనా నుంచి వస్తున్న ప్రవాహాలతో మరింతగా పెరుగుతున్న నీటిమట్టాలు

**నువాకోట్ (నేపాల్), ఆగస్టు 28:** నేపాల్‌లో సంభవించిన భారీ ఆకస్మిక వరదల కారణంగా ఇప్పటివరకు 538 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 1477 మంది ఆచూకీ తెలియకుండా పోయింది. ఈ నేపథ్యంలో, 'అన్నీ ఒక్కసారిగా కొట్టుకుపోయాయి' అని ఆ హిమాలయ దేశ ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. నిలువ నీడ లేదు. తినడానికి తిండి లేదు. కట్టుబట్టలతో బయటపడ్డాం అని వరద బాధితులు వాపోతున్నారు. ప్రభుత్వం సహాయం అందడం లేదు, మళ్లీ వరద అంటున్నారు. ఏం చేయాలో, ఎక్కడికి పోవాలో తెలియడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. నువాకోట్‌లో సహాయక చర్యల్లో పాల్గొంటున్న ఒక స్వచ్ఛంద కార్యకర్త మీడియాతో మాట్లాడుతూ, 'బాధితులకు ఆహారం, తాగునీరు, రాత్రి పూట బస వంటి తక్షణ అవసరాలను అంచనా వేయడానికి తాము కాఠ్మండు నుండి ఇప్పుడే చేరుకున్నాము. ఈ విపత్తు ఎలా జరిగిందో నాకు తెలియదు. అన్నీ ఒక్కసారిగా కొట్టుకుపోయాయి. ఆకస్మిక వరదల గురించి ప్రజలకు ఎటువంటి ముందస్తు హెచ్చరిక అందలేదు' అని ఆయన పేర్కొన్నారు. 'ప్రజలు ఇంతటి భారీ వరద ఉధృతిని అస్సలు ఊహించలేదు. ఇక్కడి ప్రధాన రహదారి, ఇక్కడి నుండి 30-35 కిలోమీటర్ల మేర ఉన్న ప్రాంతం అంతా కొట్టుకుపోయింది' అని ఆయన చెప్పారు.

రాష్ట్రీయ స్వతంత్ర పార్టీ ఎంపీ ధనేంద్ర కార్కీ మాట్లాడుతూ 'కేవలం నా నియోజకవర్గమైన సింధులి నుండే సుమారు 50 నుండి 60 మంది వరకు ఇప్పటికీ కనిపించకుండా పోయారు. వారి ఆచూకీని తాము ఇంకా కనుగొనలేకపోయాము. ఇప్పుడు మళ్లీ ఆనకట్ట (డ్యామ్) తెగిపోయిందని మాకు సమాచారం అందింది. అయినప్పటికీ, నా ప్రాంతానికి చెందిన వారిని ఎవరినైనా గుర్తించగలనేమోనని తాను ముందుకు వెళ్లి చూస్తాను. వారి కోసం వెతకడానికే నేను ఇక్కడికి వచ్చాను' అని అన్నారు. ప్రస్తుతం సహాయక చర్యల్లో నేపాల్ ప్రభుత్వం 20-22 హెలికాప్టర్లను ఉపయోగిస్తోందని ఆయన తెలిపారు. 'మరణించిన వారిని ఇంకా గుర్తించలేకపోయాము. వాస్తవానికి, కైలాష్ మానసరోవర్‌కు ఎంతమంది యాత్రికులు వెళ్తున్నారు. వారిలో ఎంతమంది ప్రాణాలు కోల్పోయారో అనే దానిపై ఇప్పటివరకు ఎటువంటి స్పష్టత లేదు' అని చెప్పారు. వరదలతో అతలాకుతలమైన తమ దేశానికి సకాలంలో సహాయం అందించినందుకు నేపాల్ ఎంపీ ప్రధాని నరేంద్ర మోడీకి కృతజ్ఞతలు తెలిపారు. 'ప్రధాని మోడీ అపారమైన సహాయం అందించారు. ఈసంక్షోభ సమయంలో నేపాల్‌కు అండగా నిలిచిన భారత ప్రభుత్వానికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను' అని ఆయన అన్నారు.

నేపాల్ మాజీ ఆర్థిక మంత్రి బర్షమాన్ పున్ కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. 'అవును, ఒకనిజమైన పొరుగు దేశంగా, ప్రధాన మంత్రి మోడీ నుండి వచ్చిన తక్షణ మద్దతు సందేశం.భారత ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని తాము ఎంతగానో అభినంది స్తున్నాము. నేపాల్ ప్రజల తరపున మా రాజకీయ పార్టీల తరపున, మా హృదయపూర్వక కృతజ్ఞత లు, ధన్యవాదాలు తెలియజేస్తున్నాను' అని తెలిపారు. వరద బాధితులకు సహాయం అందిస్తున్న కోరస్ ఇంటర్నేషనల్ సంస్థ ముఖ్య మానవతా అధికారి తమరా డెమురియా మాట్లాడుతూ, 'తీవ్రమైన విధ్వంసం చూసి మేము చాలా ఆందోళన చెందుతున్నాము. నష్టం ఎంత జరిగిందో చూడటానికి నదీ గర్భం వెంబడి ఉత్తరం వైపు వెళ్ళాను. తాను స్వయంగా తీయగలిగిన దృశ్యాలు చాలా ఆందోళనకరంగా ఉన్నాయి, ఎందుకంటే కొట్టుకుపోయిన ఇళ్లు, నీటిలో పూర్తిగా మునిగిపోయిన సోలార్ ప్యానెళ్లు, ఎన్నో జీవనోపాధులు కోల్పోయారు. ఇది త్వరలో శాంతించే లేదా సాధారణ స్థితికి వచ్చే సూచనలు ఏమాత్రం కనిపించడం లేదు' అని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇదిలా ఉండగా, సరిహద్దుకు టిబెట్ వైపున ఉన్న గిరాంగ్ సరిహద్దు పోర్టుకు ఎగువన ఉన్న ఒక కట్ట తెగిపోయిందని, మరిన్ని వరదల ముప్పు మళ్లీ తలెత్తిన నేపథ్యంలో సహాయక బృందాలు సురక్షి త ప్రాంతాలకు తరలి వెళ్లాలని భద్రతా దళాలు హెచ్చరించారు. నేపాల్ పోలీస్ అధికారి పి. చౌదరి మాట్లాడుతూ, 'ఎగువన ఉన్న చైనా సరిహద్దు నుంచి వస్తున్న నీటిమట్టాలు వేగంగా పెరుగుతున్నాయని మాకు హెచ్చరికలు అందాయి. అందువల్ల, ప్రతి ఒక్కరూ సురక్షి త ప్రాంతాలకు తరలివెళ్లి తమ ప్రాణాలను కాపాడుకోవాలని సాధారణ హెచ్చరిక జారీ చేశాం. ఈ నేపథ్యంలో సహాయక చర్యలు తాత్కాలికంగా నిలిపివేశాం' అని వివరించారు.

# మంటగలిసిన మానవత్వం




## వరదల్లో ఓ మృతురాలిని బయటకు లాగి చెవి కమ్మలు కాజేసిన వైనం

### నదుల్లో కొట్టుకు వస్తున్న మృతదేహాలు

**కాట్మాండు, ఆగస్టు 28:** నేపాల్ ఆకస్మిక వరదలో ప్రాణాలు కోల్పోయిన వారి గురించిన సమాచారం అందరి గుండెనూ బరువెక్కేలా చేస్తోంది. నేపాల్‌లో వరద బాధితులు కోలుకోవాలని, వీలైనంత మంది ప్రాణాలతో బయటపడాలని అందరూ కోరుకుంటున్నారు. ఇలాంటి విషాద సమయంలో మానవత్వం చూపాల్సిన కొందరు.. ఆ మానవత్వానికి మచ్చగా నిలిచారు. వరదల్లో మరణించిన ఒక మహిళ మృతదేహాన్ని జుట్టుతో లాగి, ఆమె చెవి కమ్మలు తీసుకున్నారు. ఇద్దరు వ్యక్తులు ఈ దారుణానికి పాల్పడ్డారు. ఈ ఘటన నేపాల్‌లోని నారాయణి నది ప్రాంతంలో జరిగింది. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో పోలీసులు స్పందించారు. నిందితులు ఇద్దరినీ అరెస్టు చేశారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలిలా ఉన్నాయి. బుధవారం నేపాల్‌లో సంభవించిన వరదల్లో పలువురు గల్లంతైన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా అనేక మృతదేహాలు ఇతర ప్రాంతాలకూ కొట్టుకుపోయాయి. తాజాగా నారాయణి నదలోకి పలు మృతదేహాలు కొట్టుకువచ్చాయి. వాటిలో ఒక మహిళ మృతదేహం కూడా ఉంది. అయితే, స్థానికుల్లో 25 యేళ్ల మదన్ గురుంగ్, 38 యేళ్ల ఉమేశ్ చౌదరి అనే ఇద్దరు వ్యక్తులు ఆ మహిళ మృతదేహాన్ని నీళ్ల నుంచి ఒడ్డుకులాగారు. అనంతరం ఆమె చెవులకు ఉన్న బంగారు కమ్మలు తీసుకున్నారు. ఈ ఘటనను అక్కడి వారెవరో రికార్డు చేసి, సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా వైరల్ అయింది. ఈ ఘటనపై నెటిజన్ల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ విషాద సమయంలో మృతదేహాల విషయంలో సానుభూతి, గౌరవప్రదమైన వైఖరి ప్రదర్శించాల్సింది పోయి అవకాశవాదుల్లాగా, వారి ఒంటిపై బంగారు ఆభరణాల్ని కొట్టేయడం, జుట్టుపట్టి మృతదేహాల్ని లాగడంపై విమర్శలు చేస్తున్నారు. ఇలాంటి సమయంలో ఇదేనా మానవత్వం అంటూ ప్రశ్నిస్తున్నారు. దీంతో ఈ ఘటనపై స్థానిక చిట్వాన్ పోలీసులు స్పందించారు. నిందితులు మదన్, ఉమేశ్‌లను పోఖారా బస్‌పార్క్ వద్ద అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి ఆభరణాలు స్వాధీం చేసుకున్నారు. ఇలా మృతదేహాలపై నగలు తీసుకోవడ లేదా ఎలాంటి అమానవీయ చర్యలకు పాల్పడ్డా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.



# చైనాలో ఘోర విపత్తుగా మిగిలిన బాంకియావో డ్యామ్

**బీజింగ్, ఆగస్టు 28:** నేపాల్‌లో సంభవించిన తాజా వరదల నేపథ్యంలో, ప్రకృతి ప్రకోపానికి మానవ నిర్మిత కట్టడాలు చిక్కితే జరిగే విధ్వంసానికి చైనాలోని బాంకియావో డ్యామ్ ఉదంతమే ఒక ప్రబల నిదర్శనం. ప్రపంచ చరిత్రలోనే అత్యంత దారుణమైన డ్యామ్ వైఫల్యంగా ఇది మిగిలిపోయింది. ఈ ఘోర విపత్తులో ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 2.30లక్షల మంది ప్రాణాలు కోల్పోయారు. 1975 ఆగస్టులో వచ్చిన నీనా టైఫూన్ ప్రభావంతో చైనాలోని హెనాన్ ప్రావిన్స్‌లో రికార్డు స్థాయి వర్షాలు కురిశాయి. కేవలం 24గంటల వ్యవధిలోనే 1,000 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావడంతో బాంకియావో డ్యామ్‌కు భారీగా వరద నీరు వచ్చి చేరింది. ఆగస్టు 7వ తేదీ అర్ధరాత్రి దాటిన తర్వాత డ్యామ్ పైనుంచి నీరు పొంగిపొర్లి, కేవలం ఆరు గంటల వ్యవధిలోనే అది కుప్పకూలిపోయింది. దీని ఫలితంగా సుమారు 701 మిలియన్ క్యూబిక్ మీటర్ల నీరు గంటకు 30 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో జనావాసాలపై విరుచుకుపడింది. ఈ ఉధృతికి సమీపంలోని సిమన్‌తాన్ డ్యామ్‌తో పాటు మొత్తం 62 ఆనకట్టలు ఒకదాని తర్వాత ఒకటి పేకమేడల్లా కూలిపోయాయి. ఈ జల ప్రళయానికి తక్షణమే సుమారు 26 వేల మంది బలవ్వగా, అనంతరం ఏర్పడిన కరవు, అంటు వ్యాధుల కారణంగా మొత్తం మృతుల సంఖ్య 2.30 లక్షలకు చేరిందని అంతర్జాతీయ నివేదికలు అంచనా వేశాయి.

అయితే, చైనా ప్రభుత్వం ఈ మహా విషాదం తాలూకు వివరాలను దాదాపు రెండు దశాబ్దాల పాటు ప్రపంచానికి తెలియ కుండా అత్యంత గోప్యంగా ఉంచింది. 1951-52 మధ్య కాలంలో నిర్మించిన ఈ డ్యామ్‌ను ఒకప్పుడు ఐరన్ డ్యామ్ అని పిలిచేవారు. కానీ నిర్మాణ లోపాలు, అధికారుల వైఫల్యాలు, సరైన సమయంలో హెచ్చరికలు జారీ చేయకపోవడం వంటివి ఈ ఘోర విషాదానికి ప్రధాన కారణాలని విశ్లేషణలు వెల్లడించాయి. ఈ ఘటన జరిగిన సుదీర్ఘ కాలం తర్వాత, పాత డ్యామ్ స్థానంలో 1993లో నూతన ఆనకట్టను నిర్మించారు.

# విదేశీ సాయం వద్దేవద్దు..నేపాల్ తిరస్కరణ

**ఖాట్మండు, ఆగస్టు 28:** భారీ వరదలతో అతలాకుతలమైన నేపాల్ కీలక నిర్ణయం తీసుకుంది. గల్లంతైనవారి కోసం కొనసాగుతున్న గాలింపు చర్యల్లో విదేశీ రెస్క్యూ బృందాల సాయం తీసుకోకూడదని నిర్ణయించింది. తమ భద్రతా బలగాలే సహాయక చర్యలు చేపట్టగలవని స్పష్టం చేసింది. భారత్, చైనా సహా పలు దేశాలు పంపిన సహాయ ప్రతిపాదనలను తిరస్కరించింది. బుధవారం భోటేకోషి, త్రిశూలి నదీ వ్యవస్థల పరిధిలో భారీ వరదలు సంభవించిన విషయం తెలిసిందే. నేపాల్‌చైనా సరిహద్దు ప్రాంతాల్లో మట్టి, శిథిలాల కింద చిక్కుకున్నవారి కోసం గాలింపు కొనసాగుతోంది. ఈ విపత్తులో ఇప్పటివరకు 469మంది ప్రాణాలు కోల్పోయారు. దాదాపు వెయ్యి మంది గల్లంతైనట్లు అధికారులు చెబుతున్నారు. భారత్, చైనా, అమెరికా, బ్రిటన్,



జపాన్, దక్షిణ కొరియా, శ్రీలంక, బంగ్లాదేశ్ సహా పలు దేశాలు రెస్క్యూ సిబ్బందిని పంపేందుకు ముందు కొచ్చాయి. వందలాది మంది భారతీయులు గల్లంతైన నేపథ్యంలో భారత్ జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్‌డీఆర్‌ఎఫ్)ను పంపేందుకు అనుమతి కోరింది. నేపాల్ ఆ ప్రతిపాదనను కూడా తిరస్కరించింది. 2015 భూకంపం సమయంలో పెద్ద సంఖ్యలో విదేశీ రెస్క్యూ బృందాలు రావడంతో సమన్వయం, నిర్వహణలో ఇబ్బందులు ఎదురైన అనుభవం ఈ నిర్ణయానికి కారణమని అధికారులు తెలిపారు. ప్రస్తుతం విదేశీ బృందాల బదులు ఆర్థిక సాయాన్ని ఒకే వ్యవస్థ ద్వారా అందించాలని నేపాల్ కోరుతోంది. నేపాల్ పోలీసులు 4,348 మందిని సహాయక చర్యల్లో మోహరించారు. రసువా నుంచి 644 మంది, నువాకోట్ నుంచి 898 మంది, ధాదింగ్ నుంచి ముగ్గు రిని రక్షించారు. గల్లంతైన వారిలో విదేశీయులు కూడా ఉన్నారు. 178 మంది భారతీయులు, 65 మంది అమెరికన్లు, 51 మంది మలేషి యన్లు, 53 మంది ఉక్రెయిన్ వాసులు, 33 మంది బ్రిటన్ పౌరులు, 35 మంది ఆస్ట్రేలియన్లు, 25 మంది కెనడా పౌరుల ఆచూకీ తెలియడం లేదు. అయితే ఆర్థిక, మానవతా సాయాన్ని నేపాల్ స్వీకరిస్తోంది. అమెరికా 5 లక్షల డాలర్ల సాయం ప్రకటించింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ అత్యవసర వైద్య సామగ్రిని పంపింది. విదేశీ పౌరుల సమాచారం, సహాయక చర్యల కోసం నేపాల్ విదేశాంగ శాఖ అత్యవసర నియంత్రణ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది.

# భారత్‌కు రానున్న 'జావెలిన్'



## భుజంపై నుంచే శత్రువుకు గురి

**న్యూఢిల్లీ, ఆగస్టు 28:** భారత అమ్ముల పొదిలో మరో అస్త్రం చేరనుంది. అధునాతన జావెలిన్ క్షిపణులను కొనుగోలు చేసేందుకు అమెరికాతో భారత్‌కు ఒప్పందం కుదిరింది. ఈ విషయాన్ని మన దేశంలోని అమెరికా రాయబారి సెర్గియో గోర్ శుక్రవారం వెల్లడించారు. ఇరు దేశాల మధ్య సమర్థవంతమైన ద్వైపాక్షిక రక్షణ భాగస్వామ్యాన్ని ఈ ఒప్పందం ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు. యుఎస్ ఫారిన్ మిలిటరీ సేల్స్ ప్రక్రియలో భాగంగా ఈ క్షిపణుల కొనుగోలుకు సంబంధించిన లెటర్ ఆఫ్ ఆఫర్ అండ్ యాక్సెప్టెన్స్‌పై భారత సైన్యం తాజాగా సంతకం చేసింది. అయితే, ఒప్పందంలో భాగంగా ఎన్ని క్షిపణులను మన దేశం కొనుగోలు చేస్తోంది? మొత్తం ఖర్చెంత? అన్న వివరాలు ఇంకా తెలియరాలేదు.

**జావెలిన్** ట్యాంక్ విధ్వంసకర క్షిపణి (ఎటిజిఎం-యాంటీ ట్యాంక్ గైడెడ్ మిస్సైల్). దీనిని భుజంపై నుంచి శత్రు ట్యాంకుల పైకి గురిపెట్టి ప్రయోగించవచ్చు. దీనిలో 3.7 అడుగుల క్షిపణి, డిస్పోజబుల్ లాంఛ్ ట్యూబ్, కమాండ్ కంట్రోల్ యూనిట్ ఉంటాయి. వాస్తవానికి ట్యాంక్‌పైకి విధ్వంసకర ఆయుధాలను ప్రయోగించినప్పుడు ఆ ప్రదేశం నుంచి పొగ, వేడి వెలువడతాయి. ప్రత్యర్థులు హీట్ సెన్సర్లతో వాటిని గుర్తిస్తారు. కానీ, జావెలిన్‌లో తొలుత ట్యూబ్ నుంచి ఓ మోటార్ పనిచేయడం మొదలుపెట్టి లక్ష్యం వైపు దూసుకెళుతుంది. దీనిని కంప్యూటర్‌తో నియంత్రిస్తారు. దీంతో కచ్చితంగా జావెలిన్‌ను ఎక్కడి నుంచి ప్రయోగించారో శత్రువుకు అర్థం కాదు. ఈలోపు ప్రయోగించిన వారు సురక్షిత ప్రదేశంలో దాక్కోవచ్చు. ట్యాంకును ధ్వంసం చేసేలా దీనిలో రెండు దశల్లో పేలుడు పదార్థాలను అమర్చారు. తొలిదశలో కవచాన్ని ఛేదించి ఆ తర్వాత దశలో వార్‌హెడ్ ట్యాంకును ధ్వంసం చేస్తుంది.



# భారత్‌కు రానున్న నేపాల్ ప్రధాని బాలేన్‌షా

**ఖాట్మండు, ఆగస్టు 28:** నేపాల్ ప్రధాని బాలెన్ షా తొలి విదేశీ పర్యటన భారత్‌లోనే ఉండనుంది. ఈ ఏడాది చివర్లోగా భారత్‌కు వచ్చే అవకాశం ఉందని నేపాల్ ఆర్థిక మంత్రి స్వర్ణిమ్ వాగ్లే తెలిపారు. కాఠ్‌మాండులో జరిగిన ఎన్డీటీవీ అన్విక్షా సదస్సులో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. బాలెన్ షా బాధ్యతలు చేపట్టిన తొలి 100 రోజులు దేశీయ అంశాలపైనే దృష్టి పెట్టారని వాగ్లే చెప్పారు. ప్రభుత్వం రూపొందించిన 100 అంశాల కార్యాచరణలో 87.2 శాతం పూర్తి చేసినట్లు తెలిపారు. ఇప్పుడు విదేశీ పర్యటనలపై చర్చ మొదలైందన్నారు. తొలి పర్యటన భారత్‌కే ఉంటుందని స్పష్టం చేశారు. బాలెన్ షా భారత పర్యటన ప్రకటన ప్రాధాన్యం కలిగినదని బీజేపీ ఎంపీ రవిశంకర్ ప్రసాద్ అన్నారు. భారత్ నేపాల్ సంబంధాలు ఎంతో బలమైనవని చెప్పారు. సరిహద్దులు, పాస్‌పోర్టులు ఈ బంధాన్ని విడదీయలేవని పేర్కొన్నారు. భారత రూపాయితో నేపాల్ రూపాయి మారకం విలువ 1.6:1గా ఉంది. ఈ అనుసంధానాన్ని వెంటనే మార్చే ఆలోచన లేదని వాగ్లే తెలిపారు. దీనిపై అధ్యయనం మాత్రమే చేస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం నేపాల్ వాణిజ్యంలో 70 శాతం భారత్‌తోనే జరుగుతోందని వెల్లడించారు. నేపాల్ ఆర్థిక వ్యవస్థను వచ్చే ఐదేళ్ల నుంచి ఏడేళ్లలో 100 బిలియన్ డాలర్లకు పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకు కనీసం 7 శాతం వృద్ధి అవసరమని వాగ్లే చెప్పారు. స్వచ్ఛ ఇంధనం, పర్యాటకం, తయారీ, అధిక విలువైన వ్యవసాయం, డిజిటలైజేషన్‌పై దృష్టి పెడుతున్నట్లు తెలిపారు. బాలెన్ షా సంప్రదాయ రాజకీయ నేతలకు భిన్నంగా పనిచేస్తున్నారని వాగ్లే అన్నారు. ప్రసంగాల కంటే పనులు, ఫలితాలకే ప్రాధాన్యం ఇస్తారని చెప్పారు. నిర్ణయాల విషయంలో చట్టపరమైన అంశాలను కూడా జాగ్రత్తగా పరిశీలిస్తారని తెలిపారు.

# టిబెట్ సరస్సు ముప్పుపై మరోసారి హెచ్చరించిన చైనా..

**ఖాట్మండు, ఆగస్టు 28:** భారీ వరదలతో అతలాకుతలమైన నేపాల్‌ను మరో ముప్పు ఆందోళనకు గురిచేస్తోంది. నేపాల్‌టిబెట్ సరిహద్దులోని భోటే కోశి నది జన్మస్థానం వద్ద నూతనంగా ఒక భారీ సరస్సు ఏర్పడిందని, దీనివల్ల రాబోయే రెండు మూడు రోజుల్లో తీవ్రస్థాయిలో వరదలు సంభవించే ప్రమాదం ఉందని చైనా అధికారులు హెచ్చరించారు. ఈ సమాచారంతో నేపాల్ ప్రభుత్వం అప్రమత్తమైంది. టిబెట్‌లో జన్మించే చోచెన్ ఖోలా, పురేపు సంగ్పో నదుల సంగమ ప్రాంతంలో ఈ కొత్త సరస్సు ఆవిర్భవించింది. నిన్నటి ఉదయం సమయానికే ఇందులో సుమారు 20 లక్షల క్యూబిక్ మీటర్ల నీరు చేరిందని, రాబోయే మూడు రోజుల్లో మరో 30



లక్షల క్యూబిక్ మీటర్ల నీరు వచ్చి చేరే అవకాశం ఉందని చైనా వెల్లడించింది. దీనివల్ల సరస్సు కట్ట తెగిపోయి దిగువ ప్రాంతాలు జలమయమయ్యే ప్రమాదం ఉందని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం అక్కడి పరిస్థితిని చైనా అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఈ సమాచారాన్ని చైనా ప్రభుత్వం నేపాల్ విదేశాంగ శాఖకు అధికారికంగా తెలియజేసింది. దీంతో నేపాల్ జల, వాతావరణ శాఖ అప్రమత్తమైంది. భోటే కోశి, త్రిశూలి నదులకు మళ్లీ వరద ముప్పు పొంచి ఉన్నందున, ప్రజలు నదీ తీరాలకు దూరంగా, సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. సహాయక బృందాలు, ప్రయాణికులు, భద్రతా సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇదిలా ఉండగా ఇటీవల సంభవించిన వరదల కారణంగా నేపాల్‌లో మృతుల సంఖ్య 500 దాటినట్లు నేపాల్ పోలీసులు వెల్లడించారు. ఒక్క చిత్వాన్ జిల్లాలోనే ఇప్పటివరకు 132 మృతదేహాలను వెలికితీసినట్లు సమాచారం.

# చిత్వాన్ జిల్లాలోనే 132 మంది మృతదేహాలు లభ్యం

**ఖాట్మండు, ఆగస్టు 28:** నేపాల్ వరదల్లో వందల మంది చనిపోయారు. వారి మృతదేహాలను సహాయక సిబ్బంది వెలికితీస్తున్నారు. భారతదేశంతో సరిహద్దు పంచుకునే నేపాల్‌లోని చిత్వాన్ జిల్లాలో అత్యధికంగా 132 మృతదేహాలు లభ్యమయ్యాయి. భారత్‌లోని ఉత్తరప్రదేశ్‌లోని మహరాజ్‌గంజ్ వద్ద గండక్ నదిలో మూడు మృతదేహాలను వెలికితీశారు. భారత సరిహద్దు భద్రతా దళం సశస్త్ర సీమా బల్ వీటిని గుర్తించి మోటార్ బోట్ల సహాయంతో వెలికితీశారు. ఈ మృతదేహాల్లో ఇద్దరు మహిళలు, ఒక పురుషుడివి ఉన్నాయని ఎస్ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ అరుణ్ పాండే తెలిపారు. వారి వివరాలు ఇంకా తెలియలేదు.



ఇవి అక్కడి మృతదేహాలే అయితే సుమారు 200 కిలోమీటర్ల దూరం కొట్టుకొచ్చాయని భావిస్తున్నారు. నేపాల్‌లో హిమపాతం, భారీ వర్షాల వల్ల నారాయణి నది ఉప్పొంగి ప్రవహిస్తుంది. అక్కడి భోటెకోశి, త్రిశూలి నదులు కలిసి నారాయణి నదిగా మారుతాయి. దీన్నే కాళీ గండకీ అని కూడా పిలుస్తారు. ఈ నది భారత్‌లోకి ప్రవహిస్తుంది. దీన్ని ఇక్కడ గండక్ అని పిలుస్తారు. ఇది భారత్‌లోని ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాల గుండా ప్రవహించి పట్నా సమీపంలోని హాజీపూర్‌సోనేపూర్ వద్ద గంగా నదిలో కలుస్తుంది. నేపాల్ వరదల కారణంగా ఉత్త రప్రదేశ్, బిహార్ రాష్ట్రాలు అప్రమత్తమయ్యాయి. గండక్ నది పరీవాహక ప్రాంతాల్లోని పలు లోతట్టు గ్రామాల్లో నివసించే ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలిస్తున్నారు. ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

# అసోం వరద బాధితులకు శతాధిక వృద్ధురాలి ఆపన్న హస్తం

**గువాహతి,ఆగస్టు 28:** అసోంలో 10 జిల్లాల్లో వరద ఉధృతి కొనసాగుతుండటంతో, మృతుల సంఖ్య 107కు చేరింది. ఈ సంక్షోభం కారణంగా నదులు ప్రమాద స్థాయి దాటి ప్రవహిస్తుండగా, వేలాది మంది ప్రజలు సహాయక శిబిరాలకు తరలించబడగా సహాయక చర్యలు ఇంకా కొనసాగుతున్నాయి. అస్సాం రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ నివేదికల ప్రకారం, 10 జిల్లాల్లో 1.37 లక్షల మందికి పైగా ప్రజలు వరదల బారిన పడ్డారు. వీరిలో ఒక్కో కుటుంబానికి రూ. 15,000 చొప్పున ఆర్థిక సహాయం అందించేందుకు దాదాపు 97,000 కుటుంబాలను గుర్తించారు. లబ్ధిదారుల జాబితా తయారీ ఇంకా కొనసాగుతోందని, తదుపరి దశలో మరో 3,000 కుటుంబాలకు ఈ సహాయం అందే అవకాశం ఉందని అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ తెలిపారు. ఇది కాకుండా, అరుణోదోయ్ పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు




రూ.2,500 అందించినట్లు, వరదల తర్వాత ఇళ్లకు తిరిగి వస్తున్న కుటుంబాలకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం ప్రత్యక్ష ఆర్థిక సహాయాన్ని ఉపయోగిస్తోందని ఆయన పేర్కొన్నారు.

వరద బాధితులకు శతాధిక వృద్ధురాలి చేయూత: అస్సాం వరద బాధితుల సహాయార్థం సామాన్య పౌరులు సహా పలువురు ప్రముఖులు, సంస్థలు మరియు ప్రభుత్వాలు ఆర్థిక చేయూతను అందించాయి. అస్సాంలో ఇటీవల సంభవించిన వరదల కారణంగా తీవ్రంగా వరద ప్రభావితమైన శివసాగర్ జిల్లాలోని అమ్గురి గార్డెన్ ప్రాంత నివాసితులు కష్టాల గురించి తెలుసుకుని సోనిత్‌పూర్ జిల్లా మజ్రోయిమరి గ్రామంలో నివసించే శతాధిక వృద్ధురాలు, 103 ఏళ్ల కనకలత దాస్ మనసు ద్రవించిపోయింది. ఆమె తన వయస్సును కూడా లెక్కచేయకుండా 264 కిలోమీటర్ల దూరం ప్రయాణించి శివసాగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని ఆమె ప్రదర్శించిన ఉదారత రాష్ట్రవ్యాప్తంగా ఎంతో మంది హృదయాలను తాకింది. ఆమె నేరుగా శివసాగర్ జిల్లా కమిషనర్ కార్యాలయానికి వెళ్లి, 77 వరద బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.2,000 చొప్పున ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అయితే ఎన్నో ఏళ్లుగా తాను పొదుపు చేసుకున్న సొమ్ము నుండి ఆమె ఈ విరాళాన్ని అందించడం అందరినీ ఆలోచింపచేసింది.

# సంక్షిప్త వార్తలు

## నార్వే రాజు హెరాల్డ్ వి కన్నుమూత



**ఓస్లో, ఆగస్టు 28:** నార్వే దేశ రాజు హరాల్డ్ కన్నుమూశారు. ఆయన వయసు 89 యేళ్లు. అయిదో హెరాల్డ్ చక్రవర్తి కన్నుమూసినట్లు రాయల్ ప్యాలెస్ శుక్రవారం ప్రకటన చేసింది. నార్వే రాజధాని ఓస్లోలో ఆయన శాంతియుతంగా ప్రాణాలు విడిచినట్లు ప్యాలెస్ తన ప్రకటనలో పేర్కొన్నది. రక్త సంబంధిత వ్యాధితో బాధపడుతున్న కింగ్ హరాల్డ్‌ను ఆగస్టు 17వ తేదీన ఆస్పత్రిలో చేర్పించారు. అయితే చికిత్స సమయంలో ఆయన ఆరోగ్యం మరింత క్షీణించింది. ఆయన ఆరోగ్యం చాలా సీరియస్‌గా ఉన్నట్లు తెలిపారు. అయితే నార్వే కిరీటాన్ని ఇప్పుడు హరాల్డ్ కుమారుడిని వరించనున్నది. 53 ఏళ్ల హాకన్ 8 నార్వే రాజుగా బాధ్యతలు చేపడుతారు.

## ఆర్ఎస్ఎస్ చీఫ్ పర్యటన నేపథ్యంలో ఎక్స్ ఖాతా నిలిపివేత



**న్యూయార్కు, ఆగస్టు 28:** ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ న్యూయార్క్ పర్యటనవేళ కీలక పరిణామంచోటుచేసుకుంది. న్యూయార్క్‌లో మోహన్ భగవత్ పాల్గొననున్న కార్యక్రమాన్ని వ్యతిరేకిస్తూ నిరసనలు, విమర్శలు కొనసాగుతున్నాయి. ఈనేపథ్యంలో ఈ కార్యక్రమ నిర్వాహక సంస్థ అమెరికన్ హిందూస్ ఫర్ ఎంగేజ్‌మెంట్ అండ్ డైలాగ్ ఫోరమ్‌కు చెందిన ఎక్స్ ఖాతాను సోషల్ మీడియా వేదిక సస్పెండ్ చేసింది. ప్రస్తుతం ఆ ఖాతా యూజర్లకు ఖాళీగా కనిపిస్తోంది.

## కంగనా రామ్‌దేవ్ వివాదానికి ఫుల్‌స్టాప్




**న్యూఢిల్లీ,ఆగస్టు 28:** బీజేపీ ఎంపీ కంగనా రనౌత్, యోగా గురువు రామ్ దేవ్ బాబా తమ మధ్య వివాదానికి ఫుల్ స్టాప్ పెట్టేశారు. రాక్షా బంధన్ పండుగను పురస్కరించుకుని ఇద్దరూ రాజీపడ్డారు. వివాదాలకంటే చర్చలే బెటరని తీర్మానించారు. జెన్ జీని విమర్శిస్తూ కంగనా రనౌత్ చేసిన వ్యాఖ్యలపై రామ్ దేవ్ బాబా విమర్శలతో ఇరువురి మధ్య వివాదం మొదలైన విషయం తెలిసిందే.బాబా రామ్‌దేవ్ విమర్శలపై ఎంపీ కంగన పలు ఇంటర్వ్యూల్లో ఘాటువ్యాఖ్యలు చేయడంతో వివాదంముదిరింది. ఈ నేపథ్యంలో శుక్రవారం మీడియాతో రామ్‌దేవ్‌బాబా మాట్లాడుతూ భారత్‌లో ద్వేషానికి, శత్రుత్వానికి స్థానంలేదని అన్నారు.

## ఒంటారియో లేక్‌ను లేక్ అమెరికాగా పేరు మార్చిన ట్రంప్



**వాషింగ్టన్,ఆగస్టు 28:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరో సంచలన నిర్ణయం తీసుకున్నారు. అమెరికా, కెనడా సరిహద్దుల్లో ఉన్న గ్రేట్ లేక్స్‌లో ఒకటైన లేక్ఒంటారియో పేరును లేక్ అమెరికాగా మారుస్తూ కార్యనిర్వాహక ఉత్తర్వులపై సంతకం చేశారు. అమెరికా ఆర్థికవ్యవస్థకు ఈసరస్సు అత్యంత కీలకమని, దాని ప్రాధాన్యతను గుర్తించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. 30రోజుల్లోగా ఈ పేరు మార్పు ప్రక్రియను పూర్తి చే యాలని అమెరికా అంతర్గత వ్యవహారాలకార్యదర్శిని, భౌగోళిక నామకరణాల బోర్డును ఆదేశించారు.

## ఉక్రెయిన్‌కు బ్రిటన్ సాయంపై రష్యా ఆగ్రహం



**మాస్కో, ఆగస్టు 28:** ఉక్రెయిన్‌కు బ్రిటన్ అందిస్తున్న సైనిక సాయం మరింత పెరగడంపై రష్యా తీవ్రంగా స్పందించింది. బ్రిటన్, ఫ్రాన్స్ తీరు ప్రమాదకరంగా మారుతోందని హెచ్చరించింది. తమ దేశానికి చెందిన స్టార్మ్ షాడో క్షిపణులను ఉక్రెయిన్‌లోనే తయారు చేసుకునేలా బ్రిటన్ సాంకేతిక పరిజ్ఞానం అందించనుంది.ఈ నిర్ణయం యుద్ధాన్ని మరింత తీవ్రం చేసే అవకాశముం దని రష్యా ఆందోళన వ్యక్తంచేసింది. రష్యావిదేశాంగశాఖ అధికార ప్రతినిధి మరియా జఖరోవా బ్రిటన్, ఫ్రాన్స్‌పై తీవ్ర వ్యాఖ్యలుచేశారు. రెండుదేశాలు నిప్పుతో చెలగాటం ఆడుతున్నాయని హెచ్చరించారు.

## సోనియా పుస్తకాన్ని మేం ప్రచురించడంలేదు:పెంగ్విన్




**న్యూఢిల్లీ, ఆగస్టు 28:** కాంగ్రెస్ నేత సోనియా గాంధీ రాయనున్న బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్ పుస్తకంపై పెంగ్విన్ ర్యాండమ్ హౌస్ ఇండియా కీలక ప్రకటన చేసింది. ఈ పుస్తకానికి భారత్‌లో తాము ప్రచురణకర్తలం కాదని స్పష్టం చేసింది. పెంగ్విన్ ర్యాండమ్ హౌస్ ఇండియా నుంచి పుస్తకం విషయంలో వెనక్కి తగ్గిందని, సోనియా గాంధీ ఎడిటోరియల్ మార్పులకు అంగీకరించకపోవడంతోనే ఈ నిర్ణయం తీసుకుందని ఇటీవల వార్తలు వచ్చాయి. అయితే ఈ ప్రచారంలో వాస్తవం లేదని సంస్థ తెలిపింది. బిలాంగింగ్ పుస్తకాన్ని ప్రచురించేందుకు తాము ఆసక్తిగా ఉన్నామని పెంగ్విన్ వెల్లడించింది.

## భక్తిశ్రద్ధలతో పార్వతీ అమ్మవారికి కుంకుమార్చనలు

**పొన్నూరు, ఆగస్టు 28,(ప్రభాతవార్త):** శ్రీ సహస్రలింగేశ్వరస్వామి, శ్రీ వీరాంజనేయస్వామివారి దేవాలయ ప్రాంగణంలో వేంచేసియున్న శ్రీపార్వతీ అమ్మవారికి శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని మూడవ శుక్రవారం సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సుమారు ఒక పక్షం రోజుల నుండి ఉచిత సామూహిక కుంకుమార్చనలు నిర్వహించడం జరుగుతుందని చెప్పడంతో ఆసక్తి కలిగిన భక్తులు ముందుగానే పేర్లు నమోదు చేసుకున్నారు. ప్రతి ఒక్కరూ సమయపాలన పాటిస్తూ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యనిర్వహణాధికారి



ఆరికతి శ్రీనివాసరావు మాట్లాడుతూ శ్రావణమాసంలో వచ్చే శుక్రవారాలు అష్టైశ్వర్యాలను ప్రసాదించే శ్రీ మహాలక్ష్మీదేవి ఆరాధనకు అత్యంత పవిత్రమైనవన్నారు. మహాలక్ష్మిని పూజిస్తే ఇంటిలో ధనధాన్యాలు, సిరిసంపదలు వెల్లివిరుస్తాయని ప్రతీతని చెప్పారు. ఈ పూజ చేయడం వల్ల కుటుంబ శ్రేయస్సుతోపాటు మహిళలకు దీర్ఘసుమంగళీ ప్రాప్తం, సౌభాగ్యం లభిస్తాయన్నారు. ఈ వ్రత ప్రాముఖ్యాన్ని స్వయంగా పరమేశ్వరుడు పార్వతీదేవికి చెప్పినట్లు స్కందపురాణంలో ఉన్నట్లు వివరించారు. శ్రావణ శుక్రవారాల్లో ఇల్లు శుభ్రం చేసుకుని దీపారాధన చేసి అమ్మవారిని కొలిస్తే సకల శుభాలు కలుగుతాయని చెప్పారు. అర్చకస్వాములు పూజాదికార్యక్రమాలను భక్తులచే నిర్వహింపచేశారు. వ్రతాలు, కుంకుమార్చనల వల్ల కలిగే ఫలితాలను వివరిస్తూ భక్తులకు ఆధ్యాత్మికత ఉట్టిపడేవిధంగా చేశారు. అనంతరం భక్తులు పెద్ద ఎత్తున తీర్థ ప్రసాద వినియోగం జరిగింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా కార్యనిర్వహణాధికారి ఆరికతి శ్రీనివాసరావు పర్యవేక్షణలో సిబ్బంది ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి ఛైర్మన్ గుప్తా, సభ్యులు కత్తుల రవికిరణ్, వాసంతి, రాంబాబు, శ్రీలక్ష్మి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

## కాపు సామాజిక వర్గ పేద విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి

**-కాపు సేవా సమితి కన్వీనర్ చందు వెంకటేశ్వరరావు**

**పొన్నూరు, ఆగస్టు 28,ప్రభాతవార్త:** నియోజకవర్గ పరిధిలోని కాపు సామాజిక వర్గానికి చెందిన పేద, ప్రతిభావంతులైన విద్యార్థులు ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేసుకోవాలని కాపుసేవా సమితి కన్వీనర్ చందు వెంకటేశ్వరరావు కోరారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకర్ల సమావేశంలో అందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. 2025-2025సంవత్సరంలో పది, ఆపై తరగతులు చదివిన, 2026-2027 విద్యాసంవత్సరంలో చదువుతున్న, అర్హత కలిగిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను పొన్నూరులోని నాగార్జున టైలు ఇన్‌స్టిట్యూట్‌లోనూ, చేబ్రోలులోని పతంజలి ఆరోగ్య కేంద్రంలోనూ అందజేయాలని కోరారు.




దరఖాస్తులను సెప్టెంబరు 30వ తేదీలోపు అందేవిధంగా పంపించాలన్నారు. ఎంపికైన విద్యార్థులకు అక్టోబరులో తులసీ రామచంద్రప్రభు, సెయింట్ మేరీస్ విద్యాసంస్థల అధినేత కెవికెరావు చేతుల మీదుగా, ఇతర దాతల సహకారంతో ఉపకారవేతనాలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. పూర్తి వివరాల కోసం వల్లంశెట్టి శ్రీధర్-9949935136, నరాలశెట్టి నాగ మల్లేశ్వరరావు-9849364160, కొండపల్లి భావనారాయణ-9949989918 సంప్రదించాలని కోరారు. సమావేశంలో వల్లంశెట్టి శ్రీధర్, నాగ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో శ్రీవిఖనస మహర్షి జయంతి

**పొన్నూరు, ఆగస్టు 28,ప్రభాతవార్త:** శ్రీ విఖనస మహర్షి(విఖనస ఆచార్య) వైష్ణవ సంప్రదాయాలలో అత్యంత ప్రాచీనమైన వైఖానస ఆగమ సంప్రదాయానికి మూలపురుషుడు, ప్రవక్త అని సాక్షి శ్రీ భావనారాయణస్వామి దేవాలయం ముఖ్య అర్చకస్వామి గోవర్ధనం రామకృష్ణ అన్నారు. స్థానిక



దేవాలయంలో శ్రీవిఖనస మహర్షి జయంతి వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో, ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ పురాణాల ప్రకారం శ్రీ విఖనసాచార్య శ్రీమన్నారాయణుడి మానసపుత్రిగా భావించబడతారన్నారు. వైఖాన సంప్రదాయాన్ని ఆదివైష్ణవం అని పిలుస్తారని చెప్పారు. విఖనస మహర్షి నైమిశారణ్యంలో శంఖుచక్రాలతో, నాలుగు భుజాలతో శ్రీమహావిష్ణువు అంశతో ఆవిర్భవించారని పురాణాలు చెప్తున్నట్లు తెలిపారు. ప్రపంచ ప్రసిద్ధి క్షేత్రమైన తిరుమల తిరుపతి వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో పూజలు, ఉత్సవాలు, కైంకార్యాలన్నీ విఖనస మహర్షి ప్రవచించిన వైఖానస భగవత్ శాస్త్రం ప్రకారమే శతాబ్దాలుగా నిరంతరాయంగా జరుగుతున్నాయన్నారు. వైఖానస జయంతి సందర్భంగా శుక్రవారం స్వామివారికి ప్రత్యేకాభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన గోష్ఠిలో స్వామివారి విశేషాలను పలువురు వివరించారు. ఈ కార్యక్రమంలో నారాయణం ప్రసాద్, గంజాం విజితేంద్ర, సాయి,నారాయణం భరద్వాజ్, వేదాంతం కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## మద్యం దుకాణం ఏర్పాటుపై వ్యతిరేకత

**పొన్నూరు, ఆగస్టు 28,ప్రభాతవార్త:** ముస్లీంలకు అత్యంత పవిత్రమైన మసీదు ఉన్న ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటును వెంటనే నిలిపివేయాలని, పరిసర ప్రాంతాల ప్రజల సంక్షేమ కమిటి ప్రతినిధులు, హజ్ కమిటి ఛైర్మన్ చాంద్ బాషా, అంజుమన్ కమిటి కోశాధికారి షేక్ జాహిద్ డిమాండ్ చేశారు. గుంటూరులోని పొన్నూరు రోడ్డులోని చంద్రబాబునాయుడు కాలనీ వద్ద మెయిన్ రోడ్డుపై మద్యం దుకాణం ఏర్పాటును వ్యతిరేకిస్తూ శుక్రవారం ప్రధాన రహదారిలో కమిటి ప్రతినిధులు, స్థానికులు నిరసన కార్యక్రమం చేపట్టారు. మద్యం దుకాణం ఏర్పాటును నిరసిస్తూ ప్లకార్డులు ధరించి నినాదాలు చేశారు. జాహిద్ మాట్లాడుతూ ప్రజల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకొని ప్రభుత్వం వెంటనే ప్రతిపాదిత మద్యం దుకాణం లైసెన్సును రద్దు చేయాలని కోరారు. మసీదు పరిసర ప్రాంతంలో మద్యం దుకానం ఏర్పాటు చేయడం వల్ల ప్రజలకు ఇబ్బందులు తలెత్తడంతో పాటు రోడ్డు ప్రమాదాలు, గొడవలు పెరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో షేక్ మదని, షేక్ రహంతుల్లా, ఫైజుల్లా, నసీర్ అహమ్మద్, ముజక్కి ఖాదర్‌వలి, ముస్తాక్, సలీం, సుబాని, రఫీ, జిలాని, సుబ్బారావు, అంకమ్మరావు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.



## భక్తులతో పోటెత్తిన అమ్మవారి దేవాలయం

**-కనువిందు చేసిన అమ్మవారి అలంకరణలు**

**పొన్నూరు, ఆగస్టు 28,ప్రభాతవార్త:** గుంటూరు ఆర్ అగ్రహారంలో వేంచేసియున్న శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి దేవాలయంలో శుక్రవారం అమ్మవారికి విశేషాలంకరణలు నిర్వహించారు. శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని మూడవ శుక్రవారం అమ్మవారికి వివిధ రకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి విశేషాలంకరణలు చేశారు. అమ్మవారి అలంకరణలు



భక్తులకు కనువిందు చేయడంతోపాటు ఆధ్యాత్మికత ఉట్టిపడేవిధంగా తన్మయత్వాన్ని పొందారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వినియోగం జరిగింది. భక్తుల రాకతో దేవాలయం పోటెత్తింది. పట్టణంలోని పలువురు ప్రముఖులు, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా కార్యనిర్వహణాధికారి నిడమానూరి శ్రీనివాసరావు పర్యవేక్షణలో సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

## శ్రావణ శుక్రవారం సందర్భంగా భక్తి శ్రద్ధలతో అమ్మవారికి పూజలు

**కొల్లిపర,అగస్టు 28 ప్రభాతవార్త:** శ్రావణ శుక్రవారం కావటంతో మండలంలోని దేవాలయాల్లో పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆలయాలు మహిళా భక్తులతో కిటకిటలాడాయి .మహిళలు గ్రామాల్లోని ఆలయాలను సందర్శించి వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా మండల కేంద్రం కొల్లిపర శ్రీదేవి భూదేవి సమేత శ్రీజనార్ధనస్వామి, శ్రీగంగా పార్వతీ సమేత ముక్తేశ్వరస్వామి ఆలయాల్లో శ్రీగాయత్రీదేవి అలంకరణలో శ్రీషిర్డిసాయిబాబా మందిరంలో ఆలయ ప్రధాన అర్చకులు పరాశరం గన్నాధాచార్యులు ,కుమారస్వామి, నిరంజన్‌శర్మ, కుటుంబరావులు అమ్మవారికి విశేష అలంకరణ చేసి పంచామృతాలతో అభిషేకాలు చేసి కుంకుమ పూజలు నిర్వహజంచారు. మహిళలు చేత వరలక్ష్మీ వ్రతాన్ని చేయించి వ్రత సంకల్పం గురించి తెలియజేసారు. అనంతరం భక్తులకు పులిహోర, ప్రసాదం వితరణ గావించారు.



## దాతల సాయం అభినందనీయం

**-ప్రధానోపాధ్యాయురాలు నాగలక్ష్మి**

**కొల్లిపర,అగస్టు 28 ప్రభాతవార్త:** పేద విద్యార్థులను ఆదుకోవటం కోసం దాతలు ముందుకు రావటం అభినందనీయమని ప్రధానోపాధ్యాయురాలు



నాగలక్ష్మి అన్నారు.శ ుక్రవారం మండల పరిధి .లోని తూములూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9 వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించి ప్రస్తుతం పదోతరగతి చదువుతున్న ప్రతిభావంతులైన 10 మంది విద్యార్థులకు బయోస్టాడ్ ఇండియా కంపెనీ ప్రతినిధులు బాలకృష్ణ, కె.భూపాల్‌రెడ్డిలు రూ.30 వేల నగదును అందజేసారు. ఈ సందర్భంగా నాగలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు దాతల సహకారాన్ని సద్వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ గ్రీన్ సొసైటీ కార్యనిర్వాహక కమిటీ ఛైర్మన్ నాగేంద్ర బాబుకు చిరు సత్కారం

**మంగళగిరి, ఆగస్టు 28, ప్రభాతవార్త :** జనసేన పార్టీ శాసన మండలి సభ్యులు కొణిదెల నాగబాబు ఏపీ గ్రీన్ సొసైటీ కార్యనిర్వాహక కమిటీ ఛైర్మన్‌గా శుక్రవారం అధికారిక బాధ్యతలు స్వీకరించారు. మంగళగిరిలోని అరణ్యభవన్‌లో జరిగిన కార్యక్రమంలో నాగబాబు తన సతీమణి పద్మజతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంగళగిరి ఆటోనగర్ లోని ఆయన కార్యాలయం ఛాంబర్‌లో జనసేన పార్టీ సీనియర్ నాయకులు, ఆప్కో మున్సిపల్ మాజీ ఛైర్మన్ గంజి చిరంజీవి ఈ బాధ్యతా స్వీకరణ కార్యక్రమంలో పాల్గొని నాగబాబుకు మంగళగిరి ప్రత్యేకమైన చేనేత శాలువాతో సత్కరించి, పూలమొక్కతో అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు



## మున్నంగిలో ఘనంగా రాఖీ పండుగ

**కొల్లిపర,అగస్టు 28 ప్రభాతవార్త:** నాకు నువ్వే రక్ష...నీకు నేనురక్ష..మన మిద్దరమూ దేశానిరి రక్ష అంటూ మండల పరిధిలోని మున్నంగి ప్రాథమిన పాఠశాల విద్యార్థులు ఘనంగా రక్షా బంధన్ కార్యక్రమం జరుపుకున్నారు. విద్యార్థులు శుక్రవారం మండలంలోని అధికారులకు..తోటి విద్యార్థులకు రాఖీ కట్టి సంఘీభావం తెలిపారు. ఈ సందవర్భంగా ప్రధానోపాధ్యాయురాలు మునగాల ధనలక్ష్మి మాట్లాడుతూ సోదర.. చోదరీమణుల బంధానికి చిహ్నంగా ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉన్నత విలువల్ని చాటుతా యన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు,గ్రామపెద్దలు పాల్గొన్నారు.



## రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి అనగాని

**రేపల్లె, ఆగస్టు 28, ప్రభాతవార్త:** రక్షాబంధన్ సందర్భంగా రేపల్లె నియోజకవర్గంలోని మహిళలకు శుక్రవారం రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ శుభాకాంక్షలు తెలియజేశారు. 20 సంవత్సరాలుగా సొంత సోదరునిగా గుండెల్లో స్థానం కల్పించి ఆదరిస్తున్న అక్కా చెల్లెళ్ళ రుణం తీర్చుకోలేనిదని ఆయన అభిప్రాయపడ్డారు. సోదర బాంధవ్యానికి ప్రతీకగా నిలిచిన రక్షాబంధన్ సందర్భంగా తోబుట్టువు సమానులైన మహిళలకు కంటికి రెప్పలా కాపాడుకుంటానని ఆయన స్పష్టం చేశారు. మహిళల ఉజ్వల భవిష్యత్ కోసం అహర్నిశలు శ్రమిస్తానని ఆయన పేర్కొన్నారు. ఇదిలా ఉంటే మంత్రి అనగాని సత్యప్రసాద్ నివాసంలో ఆయన సోదరీమణులు వచ్చి ...



... రాఖీ కట్టి సత్యప్రసాద్‌కు ఆశీస్సులు తెలిపారు. అమ్మ చూపే ప్రేమలో సగం, నాన్న ఇచ్చే ధైర్యంలో సగం రెండూ కలిపితే తన సోదరీమణులు అందించే ఎనలేని అనురాగం తనకు లభిస్తున్నదని మంత్రి అనగాని సత్యప్రసాద్ సంతృప్తి వ్యక్తం చేశారు. నిత్యం ప్రజాసేవలో బిజీబిజీగా గడిపే తనకు ప్రతి సంవత్సరం తోబుట్టువుల ప్రేమ లభించడం కొండంత బలాన్ని, సంతోషాన్ని కలుగజేస్తున్నదని ఆయన పేర్కొన్నారు.

## రాఖీపౌర్ణమి శుభాకాంక్షలు తెలిపిన మంత్రి మనోహర్

**తెనాలి ఆగస్టు 28(ప్రభాతవార్త):** తెనాలి శాసనసభ్యులు రాష్ట్ర ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మహిళా మణులు అందరికీ రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేశారు. శుక్రవారం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయం నందు తనను కలిసిన జనసేన పార్టీ వీర మహిళలు పలువురు పార్టీ కార్యకర్తలు మంత్రి నాదెండ్ల మనోహర్ కి రాఖీ కట్టి రక్షాబంధనం శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మంత్రి మనోహర్ మాట్లాడుతూ, రక్షా బంధన్ అంటే కేవలం మణికట్టుపై కట్టే దారం మాత్రమే కాదని, అన్నా చెల్లెళ్ళ పరస్పర గౌరవానికి, భద్రతకు ఇచ్చే అభయమన్నారు. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి, అక్కాతమ్ముళ్ల ఆత్మీయతకు, కుటుంబ విలువలకు ప్రతీకగా నిలిచే పవిత్ర పండుగే రక్షా బంధన్ అని, ఈ రాఖీపౌర్ణమి ప్రతి కుటుంబంలో ప్రేమ, ఆత్మీయత, ఆనందాలను నింపాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ, రాష్ట్రం లోని సోదరీమణులందరికి, రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.



## దంతవైద్యురాలు కస్తూరిబాయి మృతికి మంత్రి నాదెండ్ల నివాళి

**తెనాలి మున్సిపాలిటీ ఆగస్ట 28(ప్రభాతవార్త):** ఇటీవల మరణించిన ప్రముఖ దంత వైద్యురాలు డాక్టర్ మద్దన కస్తూరిబాయి మృతి పట్ల స్థానిక శాసనసభ్యులు రాష్ట్ర ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, శుక్రవారం తెనాలి పట్టణంలోని చినరావూరు పార్క్ వద్ద ఆమె నివాసంలో దివంగత డాక్టర్ కస్తూరిబాయి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం మంత్రి మనోహర్ మాట్లాడుతూ, తెనాలి పట్టణంలో మొట్టమొదటి దంత వైద్యురాలిగా డాక్టర్ కస్తూరిబాయి తన సేవలను ప్రారంభించారని, పేద మధ్యతరగతి వర్గాల ప్రజలకు దంత వైద్యం సంబంధించి విశేషమైన సేవలను అందించిన డాక్టర్ మద్దన్న కస్తూరిబాయి సామాజిక సేవలో కూడా ముందుండేవారని తెనాలి పట్టణంలో ప్రథమంగా మహిళా మండలి స్థాపించి తన సొంత ఖర్చుతో దానికి శాశ్వత నిర్మాణం చేసి ప్రభుత్వానికి ఉదారంగా అందజేశారన్నారు. సామాజిక సేవకు ర్యాలీగా ఎన్నో వైద్య శిబిరాలను నిర్వహించి ముఖ్యంగా మహిళల్లో ఆత్మస్థైర్యం నింపే విధంగా ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టారని మంత్రి మనోహర్ గుర్తు చేసుకున్నారు. మంత్రి మనోహర వెంట దివంగత డాక్టర్ మద్దన కస్తూరిబాయి భర్త రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ మద్దెన కోటేశ్వరరావు పాల్గొన్నారు.



## విద్యార్థులకు పౌష్టికాహారం పంపిణీ

**ప్రత్తిపాడు (వట్టిచెరుకూరు), ఆగస్టు 28, ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు మంచి పౌష్టికాహారం అందించాలని ఉప్పుటూరి సేవా ట్రస్ట్ అధినేత, పుల్లడిగుంట



గ్రామ మాజీ ఉపసర్పంచ్ ఉప్పుటూరి చినరాములు పేర్కొన్నారు. మండలంలోని మేజర్ పంచాయితీ కొర్నెపాడు గ్రామం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు ఉప్పుటూరి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో పౌష్టికాహార పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప్పుటూరి సేవా ట్రస్ట్ అధినేత చినరాములు పాల్గొని మాట్లాడుతూ..ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెను ప్రకారం పౌష్టికాహారం అందించాలన్నారు. కూటమి ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని వివరించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని చదువుల్లో రాణించాలని సూచించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠ్యాంశాలు బోధించాలని, వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేకశ్రద్ధ వహించాలని తెలిపారు. విద్యార్థుల శారీరక, మానసిక వికాసం కోసం పౌష్టికాహారం మరియు అల్పాహారం అందించడం జరుగుతుందన్నారు. అలాగే గతంలో దూరప్రాంతాల నుండి వచ్చే విద్యార్థుల సౌకర్యార్థం ఉచిత వెహికల్ సౌకర్యాన్ని కూడా కల్పించి ఒక వాహనాన్ని ఉప్పుకూరి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో పాఠశాలకు ఉచితంగా అందించడం జరిగిందని గుర్తుచేశారు. విద్యార్థుల్లో రోగనిరోధక శక్తి పెంచి పౌష్టికాహారం లోపాన్ని నివారించడం కోసం కొబ్బరి లడ్లు, అరటిపండ్లు కొంతవరకు ఉపయోగపడతాయని తెలియజేశారు. ఆకలితో విద్యార్థులు ఇబ్బంది పడకుండా చదువుపై పూర్తిదృష్టి పెట్టేలా చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలకు వచ్చే విద్యార్థినిలకు అత్యంత భద్రతను కల్పించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థినీ విద్యార్థులు, తల్లిదండ్రులు, ఎస్‌ఎంసి కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ దేశాలు మెచ్చే అద్భుత రాజధానిగా అమరావతి : కొల్లియర్స్ సీనియర్ మేనేజర్ ప్రభాకర రెడ్డి

**గుంటూరు విద్య ఆగస్టు 28 ప్రభాతవార్త :** ప్రపంచ దేశాలు మెచ్చే అత్యాధునిక, అద్భుత నూతన రాజధానిగా అమరావతి" రూపుదిద్దుకోనున్నదని, ఈ ప్రతిష్ఠాత్మక రాజధాని నిర్మాణ ప్రాజెక్టులో సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులు తమ సాంకేతిక నైపుణ్యాలు, వినూత్న ఆలోచనలతో భాగస్వాములు కావాలని కొల్లియర్స్ కంపెనీ కాంట్రాక్టర్స్ విభాగ సీనియర్ మేనేజర్ శ్రీ ప్రభాకర రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక చౌడవరంలోని ఆర్.వి.ఆర్ జె.సి. ఇంజినీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఇండియన్ జియోటెక్నికల్ సొసైటీ (ఐజీ) స్టూడెంట్ చాప్టర్ సహకారంతో "ఎగ్జిక్యూషన్ అఫ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఫెసిలిటీస్ యుటిలిటీస్ రోడ్ వర్క్స్ ఇన్ ఎల్ పి ఎస్ లేఔట్స్ అమరావతి కాపిటల్ సిటీ కన్స్ట్రక్షన్ ప్రాజెక్ట్ ఎగ్జిక్యూషన్ సీక్వెన్స్" అనే అంశం పై నిర్వహించిన సెమినార్ కు ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని అమరావతి రాజధాని ప్రాజెక్టు నిర్మాణంలో చేపడుతున్న ఆధునిక ఇంజినీరింగ్ విధానాలు, నాణ్యతా ప్రమాణాలు, సమయపాలన, సమన్వయంతో కూడిన నిర్మాణ ప్రక్రియకు కల్పిస్తున్న ప్రాధాన్యతలు, తదితర అంశాలను విద్యార్థులకు వివరించారు.


భారీ మౌలిక వసతుల నిర్మాణాలే దేశ ప్రగతికి బలమైన పునాది అని, స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో అద్భుత కట్టడాలకు సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులు వినూత్న ఆలోచనలు చేయాలని కళాశాల అధ్యక్షులు డా. రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు శ్రీ జాగర్లమూడి మురళీమోహన్, డా.జగదీష్ కె. మద్దినేని ప్రకటన ద్వారా పేర్కొన్నారు. సివిల్ ఇంజినీరింగ్ రంగంలో వేగంగా చోటుచేసుకుంటున్న సాంకేతిక మార్పులకు అనుగుణంగా విద్యార్థుల్లో వినూత్న ఆలోచనా విధానం, పరిశ్రమకు అవసరమైన సాంకేతిక నైపుణ్యాలు, ప్రాక్టికల్ నాలెడ్జ్ పెంపొందించేందుకు ఇటువంటి సెమినార్లు ఎంతో దోహదపడ తాయని కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ శ్రీ రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ డా.కొండబోలు కృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.కొల్లా శ్రీనివాస్, కళాశాల అకడమిక్ అండ్ ఆర్ డి డైరెక్టర్ డా.కె.రవీంద్ర, కళాశాల డైరెక్టర్ ఫైనాన్స్ అడ్మినిస్ట్రేషన్ డా.ఎన్.వి. శ్రీనివాస రావు, సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డా.ఏ.శ్రీనివాస ప్రసాద్, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



## సి.ఎం.ఏ ఫైనల్ ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంకు మాస్టర్ మైండ్స్ విద్యార్థి మట్టుపల్లి మోక్షిత్ వంశీకృష్ణకు

## అభినందనలు తెలిపిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

**గుంటూరు విద్య, ఆగస్టు 28, ప్రభాతవార్త :** సి.ఎం.ఏ ఫైనల్ పరీక్షా ఫలితాల లో ఆల్ ఇండియా ప్రథమ ర్యాంక్ సాధించిన మట్టుపల్లి మోక్షిత్ వంశీకృష్ణను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన క్యాంపు కార్యాలయంలో ఘనంగా సత్కరించి, అభినందించారు. మోక్షిత్ వంశీకృష్ణ, ప్రముఖ విద్యావేత్తలు మాస్టర్ మైండ్స్ విద్యాసంస్థల నిర్వాహకులు అయిన సి.ఏ మట్టుపల్లి రాధ , సి.ఏ మట్టుపల్లి మోహన్ కుమారుడు. చిన్ననాటి నుంచే క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర సాధనతో ఉన్నత లక్ష్యాన్ని చేరుకున్న మోక్షిత్ సాధనను ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందిస్తూ. ఖిఖియువత కష్టపడితే సాధ్యం కానిది ఏదీ లేదు. దేశానికి, సమాజానికి మీలాంటి ప్రతిభావంతులు మరింత అవసరం" అని ప్రోత్సహించారు. ఈ సందర్భంగా మోక్షిత్ వంశీకృష్ణ మాట్లాడుతూ, "తల్లిదండ్రులు, గురువులు, మాస్టర్ మైండ్స్ సంస్థ అందించిన మార్గదర్శకత్వం వల్లే ఈ విజయాన్ని సాధించగలిగాను. ఇది నా బాధ్యతను మరింత పెంచింది" అని తెలిపారు. మోక్షిత్ సాధించిన ఈ అపూర్వ విజయం ఆయన కుటుంబానికి మాత్రమే కాకుండా, మాస్టర్ మైండ్స్ విద్యాసంస్థలకు, గుంటూరు జిల్లాకు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచింది. ఈ సందర్భంగా పలువురు మోక్షిత్ వంశీకృష్ణకు శుభాకాంక్షలు తెలిపారు.



## పొలిటికల్ సైన్స్‌లో లక్ష్మీదేవికి పీహెచ్‌డి ప్రదానం

**ఆచార్యనాగార్జున విశ్వవిద్యాలయం, ఆగస్ట్28, ప్రభాతవార్త:** ఏఎన్‌యులోని పొలిటికల్ సైన్స్ విభాగంలో పరిశోధన చేసినందుకు నెలపాల నాగలక్ష్మీ దేవికి పీహెచ్‌డి డిగ్రీని ప్రదానం చేసినట్లు రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్ ఆచార్య పి.సుధాకర్ తెలిపారు. ద అడ్మినిస్ట్రేషన్ రోల్ ఆఫ్ ఐటిడిఏ ఆన్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ట్రైబల్ వుమెన్ (ఏ స్టడీ ఇన్ రామచంద్రాపురం డివిజన్ ఆఫ్ ఈస్ట్ గోధావరి డిస్ట్రిక్ట్ ఇన్ ఆంధ్రప్రదేశ్ అనే అంశంపై డాక్టర్ ఎ.హరికృష్ణ పర్యవేక్షణలో పీహెచ్‌డి సమర్పించారు. ఈ సందర్భంగా విభాగాధిపతి, అధ్యాపకులు, సహచర పరిశోధకులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.



## స్వర్ణోత్సవ సంరంభం- ప్రగతి నిర్దేశకులు పుస్తకావిష్కరణ

ఆచార్యనాగార్జున విశ్వవిద్యాలయం, ఆగస్ట్28, ప్రభాతవార్త: వర్సిటీ మాజీ వీసిలు ఆచార్య వి.బాలమోహన్ దాస్, ఆచార్య కె.వియ్యన్నరావు, మాజీ పాలకమండలి సభ్యులు ఆచార్య డి.ఎ.ఆర్.సుబ్రహ్మణ్యంలు సంయుక్తంగా రచించిన స్వర్ణోత్సవ సంరంభం- ప్రగతి నిర్దేశకులు అనే పుస్తకాన్ని శుక్రవారం ఆవిష్కరించారు. ఇందులో వర్సిటీ ఏర్పాటుచేసినప్పటి నుంచి 50ఏళ్ళ ప్రస్థానంలో 17మంది వైస్ చాన్సలర్‌లు పనిచేశారు. వీరుచేసిన అభివృద్ధి, ప్రత్యేకతలు ఇందులో ముద్రించారు. వర్సిటీ ప్రారంభానికి కారణాలు, పేరు మార్పు, స్థలం కేటాయింపు వంటి అన్ని విషయాలను ఇందులో క్రోడీకరించారు. ఈ సందర్భంగా రచయిత బాలమోహన్ దాస్ పుస్తకం రాసిన తమకు ముద్రణకు ఆర్థిక సహకారం అందించిన వీసి గంగాధరరావుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వీసిలు సివి.రాఘవులు, ఎల్.వేణుగోపాల్ రెడ్డి, వై.ఆర్.హరగోపాల్‌రెడ్డి, కె.వియ్యన్నరావు, రాజేంద్రప్రసాద్, ఉన్నత విద్యామండలి వైస్ ఛైర్మన్ రత్నషీలామణి, ఆచార్య ఎం.కె.దుర్గాప్రసాద్, ఆచార్య శ్యాంసుంధర్, రెక్టార్ శివరాం ప్రసాద్, రిజిస్ట్రార్ సింహాచలం తదితరులు పాల్గొన్నారు.



MN 11PAGE-GNTvffffff:MN 11PAGE-GNTv 01/01/2001 10:28 Page 1



# గత పాలకుల నిరక్ష్యమ్మే పట్టణ పారిశుద్ధ్య వ్యవస్థను దిగజార్చింది : ప్రత్తిపాటి

**- రూ.1.25 కోట్లతో సకల వాంగులతో నిర్మించిన చేపల మార్కెట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి.**

**చిలకలూరిపేట,ఆగస్టు28,ప్రభాతవార్త :** గత పాలకుల నిరక్ష్యం, అశ్రద్ధతో పట్టణవీధులు వ్యర్థాలు, చెత్తకుప్పలతో నిండిపోయాయని, ప్రజల ఆరోగ్యంతో పాటు.. పట్టణ పారిశుధ్య వ్యవస్థ పూర్తిగా దిగజారిందని, కూటమి ప్రభుత్వం వచ్చాకే స్వచ్ఛాంధ్రస్వర్ణాంధ్ర కార్యక్రమం ద్వారా పరిశుభ్రతా చర్యల్లో ప్రజల భాగస్వామ్యం పెరిగి, పరిస్థితులు మెరుగుపడ్డాయని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు.శుక్రవారం ఆయన పట్టణ నాయకులతో కలిసి స్థానిక గడియార స్తంభం వద్ద నూతనంగా నిర్మించిన



అత్యాధునిక చేపల మార్కెట్ ను ప్రారంభించారు. అనంతరం స్థానికులు, చేపల విక్రయదారుల్ని ఉద్దేశించి ప్రత్తిపాటి ప్రసంగించారు. చేపల మార్కెట్ ను విక్రయదారులు సద్వినియోగం చేసుకోవాలి.. పట్టణ పురపాలక మరియు రాష్ట్ర మత్స్య శాఖ ఆర్థిక సహకారంతో రూ.1.25 కోట్లతో సకల వసతులతో 28 దుకాణాలతో నిర్మించిన మోడరన్ ఫిష్ మార్కెట్ ను ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందన్న ప్రత్తిపాటి.. చేపల విక్రయదారులు ఈ దుకాణ సముదాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం గొప్ప సదుద్దేశంతో నిర్మించిన మార్కెట్లోనే ఇకపై మత్స్య సంపదను విక్రయించాలని, రోడ్లపై, వీధుల్లో తాత్కాలిక దుకాణాలు పెట్టడానికి వీల్లేదని ఈ సందర్భంగా ప్రత్తిపాటి వ్యాపారులకు సూచించారు. తాను మంత్రిగా ఉన్నప్పుడు చేపల మార్కెట్ నిర్మాణ ప్రతిపాదనకు బీజం పడిందని, ఆనాడే అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి పంపించి, నిధులు మంజూరు చేయించామని ప్రత్తిపాటి తెలిపారు. పనులు ప్రారంభించి, మార్కెట్ నిర్మాణం పూర్తిచేసి, విక్రయదారులకు అందించాల్సిన కనీస బాధ్యతను వైసీపీ ప్రభుత్వం 5 ఏళ్లు పూర్తిగా విస్మరించిందన్నారు. గత పాలకుల నిరక్ష్యంతో తమ ఉత్పత్తుల విక్రయం కోసం వ్యాపారాలు రోడ్లపైనే విక్రయాలు ప్రారంభించడంతో, వ్యర్థాలు, దుర్వాసనతో ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారని ప్రత్తిపాటి తెలిపారు.కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ తేళ్ల సుబ్బారావు, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమద్ ఖాన్, మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ రఫాని, పట్టణ ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, రాష్ట్ర డైరెక్టర్ కందుల రమణ, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు మద్దిబోయిన శివ, కొత్త కోటేశ్వరరావు, ముల్లా కరిముల్లా, కంచర్ల శ్రీనివాసరావు, మురకొండ మల్లిబాబు, కనమర్లపూడి రమేష్, ఉప్పుటూరి ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ పతి శ్రీహరి బాబు, డి.ఈ అబ్దుల్ రహీమ్, వివిధ హోదాలలో ఉన్న నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పీజీఆర్ఎస్ పై ప్రజల్లో నమ్మకం పెరిగింది : ప్రత్తిపాటి

**చిలకలూరిపేట,ఆగస్టు28,ప్రభాతవార్త :** ప్రజా సమస్యల పరిష్కారాన్ని తమతో పాటు అధికారులు వారి బాధ్యతగా భావించాలని, తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులనే ప్రజలు మన దృష్టికి తీసుకొస్తారనే వాస్తవాన్ని గ్రహించాలని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు సూచించారు. ప్రభుత్వం తీసుకొచ్చిన పీ.జీ.ఆర్.ఎస్ (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టమ్) వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం పెరిగిందని, ప్రభుత్వ వ్యవస్థల పనితీరుపై వారు సంతృప్తిగా ఉన్నారని ఆయన తెలిపారు.శుక్రవారం ఆయన తన నివాసంలో గ్రీవెన్స్ నిర్వహించి, ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అర్హులైన కొందరు తమకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందించాలని కోరగా.. అర్హులైతే ప్రభుత్వం 3 లక్షల కొత్త పింఛన్లు మంజూరు చేయనుందని, అన్ని అర్హతలున్న వారికి తప్పకుండా న్యాయం చేస్తామని ప్రత్తిపాటి హామీ ఇచ్చారు. అనంతరం ప్రజలు అందించిన వినతుల్ని పరిశీలించిన ప్రత్తిపాటి... వాటిలోని సమస్యల్ని స్వయంగా అధికారులకు తెలియచేశారు. అర్జీదారులు సంతృప్తి చెందేలా వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఆయన అధికారుల్ని ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ... ప్రభుత్వ యంత్రాంగం, ప్రజాప్రతినిధులు సహా స్వయంగా తన దృష్టికి వచ్చే ప్రజా సమస్యల అర్జీల పరిష్కారంపై ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ పెట్టారని చెప్పారు. ప్రభుత్వ డాష్ బోర్డు, ఆర్.టి.జి.ఎస్ ద్వారా ఆయన ఎప్పటికప్పుడు సమస్యల పరిష్కార తీరుని శాఖల



వారీగా పరిశీలిస్తున్నారని ప్రత్తిపాటి తెలిపారు. ఎక్కడైనా యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వెంటనే చర్యలు తీసుకుంటున్నారని, ఈ విషయంలో ప్రజా ప్రతినిధుల్ని కూడా సీఎం వదిలిపెట్టడం లేదని ప్రత్తిపాటి స్పష్టం చేశారు.ప్రత్తిపాటికి రాఖీ కట్టిన తెలుగు మహిళలు..రక్షా బంధన్ ను పురస్కరించుకొని నియోజకవర్గ తెలుగు మహిళలు శుక్రవారం ప్రత్తిపాటికి స్వయంగా రాఖీలు కట్టారు. ఎమ్మెల్యే నివాసానికి వచ్చిన తెలుగు మహిళలు... ప్రత్తిపాటికి శుభాకాంక్షలు తెలిపి, తమ వెంట తెచ్చిన రాఖీలు కట్టి, ఆయనకు మిఠాయిలు తినిపించారు. ఈ సందర్భంగా వారు ప్రత్తిపాటితో తమకున్న ప్రత్యేక అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఎమ్మెల్యేకు తెలుగు మహిళా నాయకులు రాఖీలు కట్టారు.

# రోడ్డు ప్రమాదంలో ఏడుగురి దుర్మరణం తీరని విషాదం : సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య

**చిలకలూరిపేట,ఆగస్టు28,ప్రభాతవార్త :** రోడ్డు ప్రమాదంలో ఒకే గ్రామానికి చెందిన ఏడుగురు దుర్మరణం చెందడం తీవ్ర దిగ్భ్రాంతికరమని, ఇది మాటలకు అందని మహావిషాదమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య ఆవేదన వ్యక్తం చేశారు. చిలకలూరిపేట మండలం వేలూరు గ్రామానికి చెందిన ఏడుగురు ఈ ఘోర రోడ్డు ప్రమాదంలో



మృత్యువాత పడిన విషయం విధితమే. శుక్రవారం వేలూరులో అశ్రునయనాల మధ్య మృతుల అంతిమ సంస్కారాలు నిర్వహించారు, గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.కుటుంబాలకు పరామర్శ - ఆర్థిక సాయంశుక్రవారం వేలూరు గ్రామానికి చేరుకున్న గుజ్జుల ఈశ్వరయ్య మృతుల పార్థివ దేహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి ధైర్యం చెప్పారు. ఈ కష్టకాలంలో సీపీఐ ఎల్లప్పుడూ బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. అనంతరం బాధిత కుటుంబాలకు పార్టీ తరఫున తక్షణ ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ప్రభుత్వ సహాయం కోసం మంత్రితో చర్చ తీవ్రతను వివరిస్తూ రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావులతో గుజ్జుల ఈశ్వరయ్య ఫోన్‌లో మాట్లాడారు. రెక్కాడితే గానీ డొక్కాడని నిరుపేద కుటుంబాలు ఈ ప్రమాదంలో తీవ్రంగా నష్టపోయాయని, ప్రభుత్వం తక్షణమే స్పందించి మృతుల కుటుంబాలకు భారీ ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, అలాగే కుటుంబంలో ఒకరికి ఉపాధి కల్పించి ఆదుకోవాలని కోరారు.క్షతగాత్రులకు పరామర్శగ్రామానికి వెళ్లడానికి ముందు చిలకలూరిపేటలో స్థానిక నాయకులు, ప్రజలు చేపట్టిన ఆందోళనకు సంఘీభావం పూర్తిస్థాయిలో, ప్రస్తుత పరిస్థితులను ఆయన అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక ఆసుపత్రిని సందర్శించి ప్రమాదం జరిగిన ఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించి, మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందా కృష్ణ మాదిగ గ్రామంలో మృతుల కుటుంబాలను పరామర్శించారు, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఏ మారుతి వరప్రసాద్, ఏరియా కార్యదర్శి తాళ్లూరు బాబురావు, జిల్లా కార్యవర్గ సభ్యులు బుదాల,శ్రీనివాసరావు, ఉలవలపూడి రాము, ఏఐవైఎఫ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి షేక్ సుభాని వేలూరు గ్రామ కార్యదర్శి ఎలికా శ్రీనివాసరావు వేలూరు గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఇన్ సర్వీస్ టీచర్లకు స్పెషల్ నిర్వహణ పునః పరిశీలించాలి : ఎస్టీయు

**చిలకలూరిపేట,ఆగస్టు28,ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభున్తత్వ విడుదల చేసిన స్పెషల్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్ )నందు ఇన్ సర్వీస్ గా పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఎటువంటి ఉపయోగం లేకపోగా సిలబస్ విషయంలో గందరగోళం పడే పరిస్థితి ఉందని దీని పరిశీలించి, సవరించి మరొక నోటిఫికేషన్ విడుదల చేయాలని ఎస్టియు రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కే కోటేశ్వరరావు రాష్ట్ర డైరీ కన్వీనర్ పోటు శ్రీనివాసరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. చిలకలూరిపేట పట్టణంలో ఎస్టియు ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఇన్ సర్వీసెస్ ఉపాధ్యాయులకు నిర్వహించే టెట్ డియస్సి కి అవసరం లేనందున సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఉత్తీర్ణత కోసం మాత్రమే కావున ఉత్తీర్ణత మార్కుల శాతం 40 తగ్గించినందువలన ఎవరికి ఎటువంటి నష్టం జరగదని అలా ఉత్తీర్ణత మార్కులు తగ్గించడం వల్ల వేలాదిమంది ఉపాధ్యాయిని ఉపాధ్యాయులకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు, కొన్ని రాష్ట్రాలు ఈ నిబంధన పాటించి నిర్వహించాలని తెలిపారు, కావున అన్ని (స్కూల్





అసిస్టెంట్, తెలుగు, ఇంగ్లీష్, సోషల్, సైన్స్ మరియు ఎస్జిటి )విభాగాలలో ఒకే ఉత్తీర్ణత మార్కులు తో మరో నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. ఉపాధ్యాయులు నిరంతరం పాఠశాలలో బోధన చేస్తూ ప్రత్యేకంగా టెట్ పరీక్ష కోసం సన్నద్ధం కావడం కుదరదు కావున వెసులుబాటు కల్పించాలని కోరారు అదేవిధంగా 25, 30 సంవత్సరాల సర్వీస్ కలిగి విద్యాబోధన చేస్తున్న ఉపాధ్యాయులకు టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ అనేది ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు 40 శాతం ఉత్తీర్ణత మార్కుల వల్ల ఎక్కువ శాతం ఉపాధ్యాయులు ఉత్తీర్ణత చెందే అవకాశం ఉందని తెలిపారు, ఈ సమావేశంలో ఎస్టియూ జిల్లా నాయకులు బొంత రవికుమార్, షేక్ జమీర్ భాష,యం,శారద,పట్టణ, మండల నాయకులు మేకల, కోటేశ్వరరావు, వడ్లన,జయప్రకాష్, షేక్ మక్బూల్ బాషా డి దుర్గాప్రసాద్, జి,కోటేశ్వరరావు,జి సతీష్ కుమార్,షేక్ మస్తాన్వలి,వి రమణ నాయక్, సిహెచ్ మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఏఎన్‌యులో 4ఏళ్ళ యూజి హానర్స్ కోర్సులపై సుదీర్ఘచర్చ

**- అకడమిక్ సెనేట్‌లో మాజీ వీసిల సూచనలు**

**ఆచార్యనాగార్జున విశ్వవిద్యాలయం, ఆగస్ట్28, ప్రభాతవార్త:** ఏఎన్‌యులో శుక్రవారం జరిగిన 92వ అకడమిక్ సెనేట్ సమావేశంలో 4 ఏళ్ళ అండర్‌గ్రాడ్యుయేట్ హానర్స్ కోర్సుల ఏర్పాటుపై సుదీర్ఘ చర్చ జరిగింది. సమావేశంలో ఎడ్యుకేషన్ డీన్, పాలకమండలి సభ్యులు ఆచార్య టి.స్వరూపరాణి వర్సిటీలో బిఏ, బిబిఏ, బికాం, బిఎస్‌సి హానర్స్ కోర్సులతో పాటు ఒక ఏడాది పీజీ కోర్సులను ప్రవేశపెట్టాలని ప్రతిపాదించారు. దీని ద్వారా ఏఎన్‌యు దూరవిద్యలో డిగ్రీ కోర్సుల రెన్యువల్‌కు మార్గం ఏర్పడుతుందని తెలిపారు. గతేడాది మార్చిలో ఈ ప్రతిపాదన తిరస్కరించారని, 2026-27 విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించుకునేందుకు అనుమతి కోసం వీసి మరొకసారి సెనేట్ ముందుకు తెచ్చారని పేర్కొన్నారు. 2020 ఎన్ఇపిలో 4ఏళ్ళ యూజి కోర్సులకు అవకాశం ఉందని వివరించారు. దీనిపై వీసి ఆచార్య గంగాధరరావు ఇప్పటికే వర్సిటీలో బిఏ ఎల్ఎల్‌బి, బిబిఏ ఎల్ఎల్‌బి, బిఎస్‌సి ఫైర్ అండ్ సేఫ్టీ, బిఎస్‌సి ఇంటీరియర్ డిజైన్‌లు ఉన్నాయన్నారు. మాజీ వీసి హరగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ వర్సిటీలో యూజి కోర్సులు ప్రారంబం అంటే ఆషామాషీ కాదన్నారు. అందుకు సరిపడ బోధన సిబ్బంది, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, హాస్టల్‌లు లేకుండా ఎలా కోర్సులు నిర్వహిస్తారని ప్రశ్నించారు. సివి రాఘవులు వర్సిటీ స్థాయికి తగ్గట్లుగా ఆలోచించాలన్నారు. దీనిపై నిపుణుల కమిటీ నియమించాలన్నారు. వేణుగోపాల్ రెడ్డి స్పందిస్తూ ఆంధ్రా, వెంకటేశ్వర యూనివర్సిటీల ప్రారంభంలో యూజి కోర్సులే పెట్టారన్నారు. దీనిపై కీలకనిర్ణయం తీసుకోవాలన్నారు. ఆచార్య బాలమోహన్ దాస్ మాట్లాడుతూ రెండు,





మూడు కోర్సులను 2027-28లో ప్రారంభించి పరిశీలన చేయాలన్నారు. ఇసి మెంబర్ తులసీ రామచంద్రప్రభు 4ఏళ్ళ కోర్సుల వల్ల ఏం ఉపయోగాలున్నాయని ప్రశ్నించారు. ఈ ప్రతిపాదన తరువాత జరిగే సమావేశంలో చర్చించాలని నిర్ణయించారు. అనంతరం రెక్టార్ ఆర్.శివరాం ప్రసాద్ వర్సిటీ పూర్వ విద్యార్థులకు కేటాయించే అలూమ్నై పేరు ప్రతిపాదన, మార్పులు, దూరవిద్య విద్యార్థులకు, అనుబంద కళాశాలల విద్యార్థులకు కూడా కేటాయించాలా వద్దా అనే అంశాన్ని వర్సిటీ నిర్ణయానికి వదిలేశారు. రిజిస్ట్రార్ సింహాచలం 172వ ఎస్సీ టు ఏఎస్ లో సిలబస్‌ల మార్పులను ప్రతిపాదించగా సెనేట్ సభ్యులు ఆమోదం తెలిపారు. చివరగా ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సురేష్‌కుమార్ వర్సిటీలో గెస్ట్ ఫ్యాకల్టీలకు హోదా మార్పు విషయాన్ని ప్రతిపాదించగా తరువాత చర్చించాలని సెనేట్ పేర్కొంది. ఈ సమావేశంలో డీన్‌లు, పాలకమండలి సభ్యులు, సెనేట్ సభ్యులు పాల్గొన్నారు.

# పాత పెన్షన్ కోసం సమర శంఖం!

**గుంటూరు మెడికల్, ఆగస్టు 28 (ప్రభాత వార్త):** పాత పెన్షన్ విధానం సాధన కోసం ఉద్యోగ సంఘాలు మరోసారి ఉద్యమబాట పట్టాయి. కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలనే డిమాండ్‌తో సెప్టెంబర్ 1న విజయవాడలో నిర్వహించనున్న భారీ నిరసన ర్యాలీని విజయవంతం చేయాలని ఉద్యోగ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు.

విజయవాడ ధర్నా చౌక్ వద్ద నిర్వహించనున్న నిరసన ర్యాలీ, సభకు సన్నాహకంగా శుక్రవారం గుంటూరులోని ఏపీ ఎన్జీవో హోమ్‌లో ఏపీ





కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఉద్యోగుల సంఘం, ఏపీ జేఏసీ-ఎన్జీవోల ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ, సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ఎన్జీవోల గుంటూరు జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం ఉద్యోగుల భవిష్యత్ సామాజిక భద్రతను ప్రశ్నార్థకంగా మారుస్తోందన్నారు. పాత పెన్షన్ విధానం అమలు చేసే వరకు ఐక్యంగా ఉద్యమం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

ఎన్జీవోల గుంటూరు జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి శ్యామ్‌సుందర్ శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.కె. నాగుల్ షరీఫ్ మాట్లాడుతూ సెప్టెంబర్ 1న విజయవాడలో జరిగే నిరసన ర్యాలీని విజయవంతం చేసేందుకు ఉద్యోగులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఉద్యోగుల సంఘం గుంటూరు జిల్లా తాత్కాలిక అధ్యక్షుడు కొమ్మనబోయిన సుకుమార్, కార్యదర్శి రవితేజ

**కాంట్రిబ్యూటరీ విధానం రద్దు చేయాల్సిందే..**
**సెప్టెంబర్ 1న విజయవాడలో ఉద్యోగుల మహా నిరసన..**
**ఏపీ ఎన్జీజీవో జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు...**

మాట్లాడుతూ ఉద్యోగ సంఘాల ఐక్య ఉద్యమాలతోనే ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురాగలమన్నారు. అన్ని సంఘాలు మద్దతు తెలిపి వేలాది మంది ఉద్యోగులను విజయవాడకు తరలించాలని పిలుపునిచ్చారు.

ఏఎన్జీవో గుంటూరు నగర అధ్యక్షుడు సిహెచ్. కళ్యాణ్‌కుమార్, నగర కార్యదర్శి జీవీ కోటేశ్వరరావు మాట్లాడుతూ తమ సంఘం నుంచి భారీ సంఖ్యలో కార్యకర్తలు నిరసన ర్యాలీలో పాల్గొంటారని తెలిపారు.

సీనియర్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ ఉద్యమ నాయకులు తిరుమలరెడ్డి, దయాసాగర్ మాట్లాడుతూ గతంలో కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానానికి వ్యతిరేకంగా జరిగిన ఉద్యమాలను గుర్తుచేశారు. ఉద్యోగుల ఐక్యతతో సాధించిన ఫలితాలను వివరించారు.

ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు బాజీ మాట్లాడుతూ కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం ఉద్యోగుల సామాజిక భద్రతను నిర్వీర్యం చేస్తోందని అన్నారు. ప్రభుత్వం వెంటనే పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ మాట్లాడుతూ ర్యాలీపై ఉద్యోగులు, ఉపాధ్యాయుల్లో అవగాహన కల్పించేందుకు వారం రోజుల పాటు విస్తృత ప్రచారం నిర్వహించాలని కోరారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కాలిద్ మాట్లాడుతూ ఉద్యమాల ద్వారానే ఉద్యోగుల హక్కులను సాధించుకోవచ్చని అన్నారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం పల్నాడు జిల్లా అధ్యక్షుడు ఉబేదుల్లా బేగ్ మాట్లాడుతూ పెన్షన్ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో ఏపీ ఎన్జీవోల సంఘం, ఏపీ జేఏసీ సభ్య సంఘాలతో పాటు ఎస్టీయూ, యూటీఎఫ్, ఏపీటీఎఫ్, పీఆర్టీయూ తదితర ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నాయకులు కిషోర్, చంద్రమోహన్, రామచంద్రరావు, బాబు తదితరులు, ఉద్యోగులు పాల్గొన్నారు.


# పర్యావరణ పరిరక్షణలో దేశానికే ఆదర్శంగా ఆంధ్రప్రదేశ్ నిలుస్తుంది

**మంగళగిరి, ఆగస్టు 28, ప్రభాతవార్త :** మంగళగిరి ఆటోనగర్‌లోని అరణ్య భవన్‌లో ఈ రోజు ఉదయం ఆంధ్రప్రదేశ్ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్‌గా జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ శ్రీ కొణిదెల నాగబాబు గారు ప్రమాణ స్వీకారం చేశారు.

ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఏపీ ఎంఎస్ఐడి సి చైర్మన్, జనసేన పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఇంచార్జ్ చిల్లపల్లి శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాగబాబుని శాలువాతో సత్కరించి, పుష్పగుచ్చం అందజేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆశీస్సులు, మార్గదర్శకత్వంతో ఏపీ గ్రీన్ పర్యావరణ పరిరక్షణకు మరింత ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతుందని ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా చిల్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ 2047 నాటికి హరితాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణలో ఆంధ్రప్రదేశ్‌ను దేశానికే ఆదర్శంగా నిలపడమే లక్ష్యంగా పచ్చదనం పెంపు, అటవీ విస్తరణ, అటవీ పునరుద్ధరణ వంటి కార్యక్రమాలను మరింత వేగవంతంగా చేపడతారని ఆశాభావం వ్యక్తం



చేశారు. ప్రకృతి పరిరక్షణతో పాటు రాష్ట్రంలో హరిత విస్తీర్ణాన్ని పెంచేందుకు ఏపీ గ్రీన్ ఆధ్వర్యంలో చేపట్టే కార్యక్రమాలు విజయవంతం కావాలని, చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన కొణిదెల నాగబాబుకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రజారంజకపాలన అందిస్తున్న కూటమి ప్రభుత్వం : ఎంమ్మెల్సీఆలపాటి

**తెనాలి ఆగస్ట్ 28,(ప్రభాతవార్త):** రెండేళ్ల కూటమి ప్రభుత్వ పాలనలో అభివృద్ధి సంక్షేమాన్ని ప్రజలు గమనించారని, నిరుద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, శాసనమండలి సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు.రెండేళ్ల నమ్మకం,అభివృద్ధి,సంక్షేమం ఇంటింటి ప్రచారంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని 26,27వ వార్డుల్లో కూటమి నాయకులతో కలిసి పర్యటించి కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించి ప్రజల నుండి వినతులను స్వీకరించిన శాసన మండలి సభ్యులు, తెనాలి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జీ ఆలపాటి రాజేంద్రప్రసాద్. ఈ సందర్భంగా రెండేళ్ల కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలకు అందించిన సంక్షేమ కార్యక్రమాలను వివరించారు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ బిజెపి నేతల సహకారంతో రాష్ట్రానికి పరిశ్రమలను తీసుకువచ్చి యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పించటానికి తీవ్రంగా కృషి చేస్తున్నారని ప్రజలు కూడా గమనించి కూటమి ప్రభుత్వానికి అండగా ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ ఖుద్దూస్,వసంతం అశోక వర్ధన్,26,27వ వార్డు నాయకులు,పార్టీ నాయకులు రావి చిన్ని,,కోగంటి రోహిత్,అక్కిశెట్టి వెంకటేశ్వరరావు, జొన్నాదుల మహేష్,డా.వేమూరి శేషగిరిరావు ,తదితరులు పాల్గొన్నారు.



# పీజీ వైద్య విద్యార్థులకు నిర్ణీత పనివేళపై ఆదేశాలు హర్షనీయం


**గుంటూరు విద్య ఆగస్టు 28 ప్రభాతవార్త :** పీ జీ వైద్య విద్యార్థులకు నిర్ణీత పని వేళలుపై ప్రజా ప్రయోజనాల వ్యాజ్యంలో మెడికోస్ అసోసియేషన్ కోరిన విధముగా పీజీ వైద్య విద్యార్థులకు నిర్ణీత పని వెళలు మరియు కనీస



సౌకర్యాల కల్పనకు సంబంధించి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డి. ఎం ఈ )అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల సూపరింటెండెట్లకు ఆదేశాలు జారీ చేయడం పట్ల మెడికో పేరెంట్స్ అసోసియేషన్ ఆధ్యకులు డాక్టర్ ఆలా వెంకటేశ్వరు హర్షం వ్యక్తంచేశారు. డైరెక్టరీ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ ఆదేశాలలో పేర్కొన్న విధంగా పీజీ వైద్య విద్యార్థులను విరామం లేకుండా 24 గంటలకు మించి పనిచేయించకూడదు, నైట్ డ్యూటీ చేసిన పీజీ వైద్య విద్యార్థులకు ఒకరోజు విరామం ఇవ్వాలి మరి ఒక రోజు సెలవు కల్పించాలి ఈ ఆదేశాలు ప్రైవేటు మెడికల్ కళాశాల్లో కూడా అమలు అయ్య విధంగా చూడాలని, ఆదేశాలు కేవలం కాగితాలకే పరిమితం కాకూడదని కచ్చితంగా అమలు జరిగే విధంగా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆదేశాలకు విరుద్ధతగా వ్యవహరించే వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి డాక్టర్ అలా కోరారు. అదేవిధంగా జూనియర్ డాక్టర్ల స్టైపెండ్ సముచితంగా పెంచాలని, ద్రవ్యోల్బణం అధికంగా ఉన్న ఈ కాలంలో జూనియర్ డాక్టర్ల స్టైమిండ్ సంవత్సరానికి కేవలం మూడు శాతం పెంచుతామని ప్రభుత్వం పేర్కొనడం సమంజనంగా లేదని, పెరుగుతున్న ధరలను పరిగణలోకి తీసుకొని సంత్సరానికి కనీసం 12 శాతం పెంచాలని మెడికోస్ పేరెంట్స్ అసోసియేషన్ డిమాండ్ చేస్తున్నది. ప్రైవేటు మెడికల్ కళాశాలలో ఉన్న జూనియరీమెడాక్టర్లకు ప్రభుత్వ జూనియర్ డాక్టర్లతో సమానంగా ఉపకార వేతనం చెల్లించాలని కోరారు.కూటమి ప్రభుత్వం అధికార వచ్చి రెండున్నర సంవత్సరాలు అయినా ఇంతవరకు ఒక్క మెడికల్ కళాశాల నిర్మాణాన్ని తలపెట్టలేదని, గత ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన మెడికల్ కళాశాల నిర్మాణాన్ని కొనసాగించకుండా పీపీపీ పేరుతో చేస్తున్నదని తెలిపారు. పులివెందుల మెడికల్ కళాశాలకు రెండు సంవత్సరాల క్రితమే ఎన్ఎంసి అనుమతులు ఇచ్చినా రాజకీయ దురుద్ధి శిలతో అడ్డుకోవడం అన్యాయమని అన్నాడు. మెడికల్ అడ్మిషన్స్ సంబందించి ప్రభుత్వం అనాలోచితంగా జారి చేసిన జీవో నెంబర్ 102 వలన ఏ ఒక్క విద్యార్థి నష్టపోయిన దానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని మెడికోస్ పేరెంట్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది

# కార్యకర్తల సంక్షేమానికి తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది : ప్రత్తిపాటి

**చిలకలూరిపేట,ఆగస్టు28,ప్రభాతవార్త :** గురువారం నియోజకవర్గ పరిధిలోనీ పలువురికి లివీది లు, టీడీపీ పార్టీ ప్రమాద బీమా ను పట్టణంలోని నివాసం నందు మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు గారు స్వయంగా లబ్ధిదారులకు అందజేశారు.యడ్లపాడు మండలం జాలాది గ్రామానికి చెందిన పిల్లి ద్వారక రాజు ఇటీవల ప్రమాదవశాత్తు మరణించటం జరిగింది. తెలుగుదేశం పార్టీ బీమా పథకం కింద 5లక్షల రూపాయల విలువైన ఇన్సూరెన్ ను వారి కుటుంబ సభ్యులకు అందజేయటం జరిగింది. తిమ్మాపురం గ్రామానికి చెందిన పావులూరి కోటేశ్వరమ్మ కి అనారోగ్య నిమిత్తం 91 వేల విలువైన లివీది నీ,



యడ్లపాడుకు చెందిన కరుచోల చిన్న పిచ్చయ్య కు లక్ష రూపాయల విలువైన లివీది నీ, ఉన్నవ గ్రామానికి చెందిన ప్రత్తిపాటి దేవమనికి 1.5 లక్షల రూపాయల విలువైన లివీది నీ అందజేయటం జరిగింది.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మండల అధ్యక్షులు కామినేని సాయిబాబు, జవ్వాజి మధన్ మోహన్, టీడీపీ నాయకులు కందిమల్ల రఘురామారావు, మద్దినేని సుబ్బారావు, బోలినేని శేఖర్, నాగ వర ప్రసాద్, టీడీపీ నాయకులు కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాద బాధితులకు న్యాయం చేయాలని ఎమ్మార్పీఎస్ ఆందోళ

**చిలకలూరిపేట,ఆగస్టు28,ప్రభాతవార్త :** చిలకలూరిపేటలో రాత్రి జరిగిన ఆటో ప్రమాదంలో బాధితులకు తక్షణమే న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు నిరసనకు



దిగారు. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా ఉన్న చీరాల ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. "వి వాంట్ జస్టిస్.. వి వాంట్ జస్టిస్" అంటూ నినాదాలు చేస్తూ, ప్రమాదానికి గురైన బాధిత కుటుంబాలను ప్రభుత్వం, అధికారులు అన్ని విధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

# శ్రీలంక మ్యాచ్ చేజార్చుకున్న భారత్




## బెడిసి కొట్టిన ఫాలోఆన్ వ్యూహం

**కొలంబో:** శ్రీలంక మ్యాచ్‌ను టీమిండియా చేజేతులారా చేజార్చుకుంది. టెస్ట్ క్రికెట్‌లో ప్రధాన బ్యాటర్లను ఔట్ చేయడం ఎంత ముఖ్యమో చివర్లో వచ్చే టెయిలెండర్లను ఔట్ చేయడం అంతే కీలకమనే విషయం భారత్‌కు ఇప్పుడు బాగా తెలిసొచ్చింది. కొలంబో రెండోటెస్ట్‌లో నాలుగు రోజులు పూర్తి ఆధిపత్యం చెలాయించిన టీమిండియా శ్రీలంక తోకను కత్తిరించలేక విజయాన్ని వదులుకుంది. లంక టెయిలెండర్ల అద్వితీయమైన పోరాటంతో డ్రాతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ముఖ్యంగా సోనాల్ దినుష 2 శతకాలతో భారత్ విజయానికి అడ్డుగా నిలిచాడు. అలాగే ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ 503/9 భారీ స్కోర్ వద్ద డిక్లేర్ చేసింది. అనంతరం లంకను 290 పరుగులకు ఆలౌట్ చేసింది. వర్ష పరిస్థితులతో ఆ జట్టు ఫాలోఆన్ ఆడించి ఆ తర్వాత లక్ష్యాన్ని ఛేదించాలనుకుంది. కానీ ఈ వ్యూహం బెడిసి కొట్టింది.

ఫాలో ఆన్ ఆడించకుండా టీమిండియా ఓ సెషన్ పాటు దూకుడుగా బ్యాటింగ్ చేసి శ్రీలంక ముందు 350+ టార్గెట్ పెట్టి ఉంటే ఫలితం మరోలా ఉండేది. టార్గెట్ ఛేజ్ చేయాలని ఒత్తిడిలో శ్రీలంక బ్యాటర్లు తప్పులు చేసే అవకాశం ఉండేది. నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి 6 వికెట్లు పడగొట్టింది. ఆఖరి రోజు తొలి సెషన్‌లోనే చివరి నాలుగు వికెట్లు తీయడం భారత్‌కు కష్టం కాదనుకున్నారు. కానీ ఫామ్‌లో ఉన్న సోనాల్ దినుషాతో పాటు కేశర నువాంత అద్భుతంగా పోరాడారు. బౌలింగ్‌కు అనుకూలంగా ఉండే తొలి సెషన్‌లో ఇద్దరూ 30 ఓవర్లకు పైగా ఆడి 100 పరుగులు జోడించారు. ఇక్కడే భారత్ విజయవకాశాలు దెబ్బతిన్నాయి. ఈ సెషన్ ఆరంభంలోనే కేశరను ఔట్ చేసి ఉంటే ఫలితం మరోలా ఉండేది. చివరకు రెండో సెషన్ ఆరంభంలో కేశర నువాంతను ఔట్ చేశారు. ఆ వెంటే ప్రభాత్ జయసూర్య కూడా ఔటవ్వడంతో లంక ఇన్నింగ్స్ ముగుస్తుందని అంతా అనుకున్నా, సోనాల్‌కు తోడుగా లాహిరు ఉడానా నిలబడ్డాడు.

90 బంతులు ఆడి భారత బౌలర్ల సహనాన్ని పరీక్షించాడు. సోనాల్‌తో కలిసి 28 ఓవర్ల పాటు క్రీజులో నిల్చొని 47 పరుగుల భాగస్వామ్యాన్ని అందించడంతో భారత్ విజయవకాశాలు నీరుగారాయి. కనీసం ఉడానాను ఔట్ చేసినా ఫలితం ఇంకోలా ఉండేది. ఇక ఆఖరి వికెట్‌ను భారత్ త్వరగా తీయలేకపోయింది. అసితా ఫెర్నాండో 24 బంతులు ఎదుర్కొని దినుషకు అండగా నిలవడంతో మ్యాచ్ డ్రా కావాల్సి వచ్చింది. 18 ఓవర్ల ఆట మాత్రమే మిగిలి ఉండటం, మ్యాచ్ ఫలితం తేలే అవకాశం లేకపోవడంతో గత్యంతరం లేక భారత్ డ్రాకు అంగీకరించింది.



# గ్రాండ్ చెస్ ఛాంపియన్‌గా ప్రజ్ఞానంద

## టైటిల్ సాధించిన తొలి భారతీయుడిగా రికార్డు

**సెయింట్ లూయిస్:** గ్రాండ్ చెస్ 2026 ఛాంపియన్‌గా రమేష్‌బాబు ప్రజ్ఞానంద నిలిచాడు. అమెరికాలోని సెయింట్ లూయిస్ చెస్ క్లబ్‌లో శుక్రవారం జరిగిన ఫైనల్‌లో ఫాబియానో కరువానాను 15-13తో ఓడించి, గ్రాండ్ చెస్ టూర్ టైటిల్ గెలుచుకున్న తొలి భారతీయుడిగా ప్రజ్ఞానంద చరిత్ర సృష్టించాడు. ఈ సీజన్ ముగింపు ఈవెంట్‌లో, క్లాసికల్ విభాగంలో వెనుకబడిన తర్వాత 21 యేళ్ల ప్రజ్ఞానంద అద్భుతంగా పుంజుకుని ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నాడు. ప్రజ్ఞా ఫైనల్‌ను క్లాసికల్ చెస్‌లో చరువానా చేతిలో 3-9 తేడాతో ఓటమితో ప్రారంభించినప్పటికీ, ర్యాపిడ్ విభాగంలో ఆధిపత్యం ప్రదర్శించి 8-0 తేడాతో గెలిచాడు. ఆ తర్వాత ఈ భారత ఆటగాడు బ్లిట్జ్ విభాగంలో చరువానాను 4-4తో నిలువరించి, మొత్తంగా 15-13 తేడాతో విజయాన్ని కైవసం చేసుకున్నాడు. స్కోరింగ్ విధానం ప్రకారం, సాంప్రదాయ పద్ధతిలో గెలిస్తే ఆరు పాయింట్లు, డ్రా అయితే మూడు పాయింట్లు లభిస్తాయి. అదేవిధంగా, ర్యాపిడ్ పద్ధతిలో గెలిస్తే నాలుగు పాయింట్లు, డ్రా అయితే రెండు పాయింట్లు లభిస్తాయి. బ్లిట్జ్‌లో, గెలిస్తే రెండు పాయింట్లు, డ్రా అయితే ఒక పాయింట్ లభిస్తుంది. కాగా తొలి సెమీఫైనల్‌లో కీమర్‌ను 19-9 తేడాతో ఓడించి ప్రజ్ఞానంద ఫైనల్‌లో స్థానం ఖాయం చేసుకున్నాడు. మరో సెమీఫైనల్‌లో కరువానా, వెస్లీ సోపై 18-12 తేడాతో విజయం సాధించాడు.




# డైమండ్ లీగ్.. ఫైనల్స్‌కు నీరజ్ చోప్రా

**స్విడ్జర్లాండ్:** డైమండ్ లీగ్ ఫైనల్స్‌కు నీరజ్ చోప్రా అర్హత సాధించాడు. రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత నీరజ్ చోప్రా, సెప్టెంబర్ 4, 5 తేదీలలో బ్రస్సెల్స్‌లో జరగనున్న డైమండ్ లీగ్ ఫైనల్స్‌లోకి అనూహ్యంగా ప్రవేశించాడు. జ్యూరిచ్ డైమండ్ లీగ్‌తో సహా, మొత్తం ఐదు మీటింగ్‌లలో మూడింటిలో పోటీపడకపోయినప్పటికీ, నీరజ్ ఆరుగురు సభ్యుల ఫైనల్‌కు చేరుకున్నాడు. కామన్వెల్త్ గేమ్స్ ఛాంపియన్, శ్రీలంకకు చెందిన రుమేష్ తరంగ పతిరాగే, 92.07 మీటర్ల భారీ త్రోతో జూరిచ్ డైమండ్ లీగ్‌ను గెలుచుకున్నాడు. ఈ యేడాది జూన్‌లో రోమ్ డైమండ్ లీగ్‌లో అతను ప్రదర్శించిన 92.62 మీటర్ల ప్రదర్శన కంటే ఇది కొద్దిగా తక్కువ కాగా, ఇది అతని రెండవ అత్యుత్తమ త్రో. తాజాగా జరిగిన లౌసాన్ డైమండ్ లీగ్‌లో నీరజ్ 88.05 మీటర్ల త్రోతో రెండవ స్థానంలో నిలిచాడు, ఇది ఈ సీజన్‌లో అతని అత్యుత్తమ ప్రదర్శన. అతను దోహా డైమండ్ లీగ్‌లో 85.69 మీటర్ల అత్యుత్తమ ప్రదర్శనతో నాల్గవ స్థానంతో తన సీజన్‌ను ప్రారంభించాడు. జూలైలో కామన్వెల్త్ గేమ్స్‌లో రజతం గెలుచుకున్న ఈ భారత జావెలిన్ త్రోయర్, మొత్తం 12 పాయింట్లతో ఆరవ స్థానంలో నిలిచాడు. ప్రతి డైమండ్ లీగ్ మీటింగ్‌లో, పురుషుల జావెలిన్ త్రోలో మొదటి ఎనిమిది స్థానాల్లో నిలిచిన వారికి, మొదటి స్థానానికి ఎనిమిది పాయింట్ల నుండి ఎనిమిదో స్థానానికి ఒక పాయింట్ వరకు, ఒక స్లైడింగ్ స్కేల్ పద్ధతిలో పాయింట్లు కేటాయించబడతాయి.



# వెస్టిండీస్ గడ్డపై పాక్ ఓపెనర్ విధ్వంసం

## జమైకా కింగ్స్‌మెన్ గెలుపు

**న్యూఢిల్లీ:** కరేబియన్ ప్రీమియర్ లీగ్-2026లో జమైకా కింగ్స్‌మెన్ తిరిగి గెలుపు బాట పట్టింది. వార్నర్ పార్క్ వేదికగా సెయింట్ కిడ్స్ అండ్ నెవిస్ పేట్రియాట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 11 పరుగుల తేడాతో జమైకా విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన జమైకా నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు నష్టానికి 182 పరుగుల స్కోర్ సాధించింది. జమైకా ఇన్నింగ్స్‌లో పాక్ స్టార్ ఓపెనర్ సైమ్ అయూబ్ విధ్వంసకర సెంచరీతో చెలరేగాడు. మిగిలిన బ్యాటర్లు పెద్దగా ఆకట్టుకోలేకపోయినప్పటికీ అయూబ్ మాత్రం ప్రత్యర్థి బౌలర్లను ఉతికారేశాడు. 58 బంగుల్లో 6 ఫోర్లు, 8 సిక్స్‌లతో 102 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. సెయింట్ కిడ్స్ బౌటర్లలో నసీం షా, హసరంగా, మెకాయ్ తలా రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్య ఛేదనలో సెయింట్ కిడ్స్ 6 వికెట్లు నష్టానికి 171 పరుగులకే పరిమితమైంది. అండ్రి ఫ్లెచర్ 55 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలువగా, జాసన్ హోల్డర్ 34 పరులు, దసన్ శునక 35 పరుగులు చేసి చివర్లో మెరుపులు మెరిపించారు. అయినప్పటికీ మిగిలిన ప్లేయర్లు నుండి పెద్దగా సహకారం లేకపోవడంతో పేట్రియాట్స్ ఓటమి చవిచూసింది.

# బుడాపెస్ట్ ఓపెన్.. ఫైనల్‌కు వేలవన్



**హంగేరి:** బుడాపెస్ట్ ఓపెన్ స్క్వాష్ సెమీఫైనల్ పోరులో, భారత ఆటగాడు వేలవన్ సెంథిల్‌కుమార్ తన స్వదేశీయుడైన వీర్ చోత్రానిపై విజయం సాధించి ఫైనల్‌కు చేరుకున్నాడు. ఫైనల్‌లో సెంథిల్‌కుమార్, స్థానిక అభిమానుల ఫేవరెట్ అయిన బాలాజ్ ఫార్కాస్‌తో తలపడనున్నాడు.

హంగేరి రాజధానిలో శుక్రవారం జరిగిన సెమీ ఫైనల్స్‌లో, ప్రపంచ ర్యాంకింగ్‌లో 54వ స్థానంలో ఉన్న ఎనిమిదో సీడ్ సెంథిల్‌కుమార్, మూడో సీడ్ చోత్రానీని 91-1, 11-8, 11-7, 1-11, 12-10 తేడాతో ఓడించి తన 15వ పిఎస్ఎ టూర్ ఫైనల్‌కు చేరుకున్నాడు. క్వార్టర్ ఫైనల్‌లో, సెంథిల్‌కుమార్ మలేషియాకు చెందిన ప్రపంచ 18వ ర్యాంకర్ మరియు టాప్ సీడ్ అయిన ఈన్ యెవ్ ఎన్‌జిని 11-2, 11-9, 11-8 తేడాతో ఓడించి, చోత్రానితో సెమీఫైనల్ పోరుకు సిద్ధమయ్యాడు. ఈ పర్యటనలో సెంథిల్‌కుమార్, ఫార్కాస్‌లకు ఇది మూడో ముఖాముఖి కానుంది. 2019లో జరిగిన పోరులో హంగేరి ఆటగాడు విజయం సాధించగా, 2024లో జరిగిన పోరులో సెంథిల్‌కుమార్ గెలుపొందాడు.

# భారీగా పుంజుకున్న వెండి ధరలు



## బంగారం కూడా పైపైకి

**ముంబయి, ఆగస్టు 28:** దేశీయ మార్కెట్లో వెండి ధరలు శుక్రవారం రోజు కనిష్ఠ స్థాయి నుంచి భారీగా పుంజుకున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో వెండి ధరలు బలంగా పెరగడం, కొనుగోళ్ల జోరు కొనసాగడం ఇందుకు ప్రధాన కారణాలుగా ఉన్నాయి. ఎంసిఎక్స్‌లో వెండి ధర కిలోకు రూ.2,699 పెరిగి రూ.2,43,350కి చేరింది. ఇంట్రాడేలో రూ.2,44,950 గరిష్ఠాన్ని తాకింది. ఇది గత ముగింపు ధరతో పోలిస్తే 1.78 శాతం వరకు పెరిగింది. అదే సమయంలో రోజువారీ కనిష్ఠ స్థాయి రూ.2,39,049 నుంచి వెండి ధర రూ.5,901 మేర ఎగబాకింది.మరోవైపు ఎంసిఎక్స్‌లో బంగారం ధర 10 గ్రాములకు రూ.324 పెరిగి రూ.1,59,320కి చేరింది. ఇంట్రాడేలో రూ.1,59,741 గరిష్ఠ స్థాయిని నమోదు చేసింది.బులియన్‌కు సానుకూల పరిస్థితులుబంగారం, వెండి ధరలపై భవిష్యత్తు అంచనాలు ఇప్పటికీ బుల్లిష్‌గా ఉన్నాయని ట్రేడర్ల అంచనా. ఇటీవల ధరలు తగ్గిన నేపథ్యంలో మళ్లీ కొనుగోళ్లు పెరుగుతున్నాయని కేడియా అడ్వైజరీ డైరెక్టర్ అజయ్ కేడియా తెలిపారు.ముడి చమురు ధరలు తగ్గడం వల్ల ద్రవ్యోల్బణంపై ఆందోళనలు తగ్గాయి. దీంతో అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల పెంపుపై ఉన్న భయాలు కూడా సడలాయి. అమెరికా డాలర్ విలువ 99 స్థాయి దిగువకు పడిపోవడం విలువైన లోహాల ఆకర్షణను పెంచింది" అని ఆయన పేర్కొన్నారు.కేంద్ర బ్యాంకులు నిరంతరం బంగారం కొనుగోలు చేయడం, గోల్డ్ ఈటీఎఫ్‌లలోకి పెట్టుబడులు పెరగడంకూడా బంగారం, వెండి ధరలకు మద్దతుగా నిలుస్తున్నాయని కేడియా తెలిపారు.ఇక వడ్డీ రేట్ల భవిష్యత్ దిశపై స్పష్టత కోసం ఇన్వెస్టర్లు జాక్సన్ హోల్ సింపోజియంలో అమెరికా ఫెడ్ చైర్ కెవిన్ వార్ష్ ప్రసంగంపై దృష్టి సారిస్తున్నారు. మోనార్క్ పీఎంఎస్ అంచనా ప్రకారం 2026 చివరి నాటికి బంగారం ధర ఔన్సుకు 4,300-4,700 డాలర్లు, వెండి ధర 70-85 డాలర్ల మధ్య ఉండొచ్చని తెలిపింది. ఈ బేస్ కేస్‌కు 55 శాతం సంభావ్యతను కేటాయించింది.బుల్లిష్ పరిస్థితుల్లో మాత్రం బంగారం ఔన్సుకు 5,000-5,600 డాలర్లకు, వెండి 95-120 డాలర్లకు చేరే అవకాశం ఉందని మోనార్క్ పీఎంఎస్ పేర్కొంది. ప్రముఖ నిపుణులు అజయ్ కేడియా ప్రకారం ఎంసీఎక్స్ బంగారానికి రూ.1,56,000 వద్ద కీలక మద్దతు ఉంది. రూ.1,67,000 వద్ద నిరోధ స్థాయి ఉంది. ఈ స్థాయిని అధిగమిస్తే బంగారం ధర రూ.1,72,000ను కూడా దాటే అవకాశం ఉందని ఆయన అంచనా వేశారు.

# రెండు రోజుల నష్టాలకు బ్రేక్




## లాభాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ

**ముంబయి, ఆగస్టు 28:** దేశీయ ఈక్విటీ మార్కెట్లు వరుసగా రెండు సెషన్ల నష్టాలకు శుక్రవారం బ్రేక్ వేశాయి. ఐటీ షేర్లలో భారీ కొనుగోళ్లు మార్కెట్లకు ప్రధానంగా అండగా నిలిచాయి. ఎంపిక చేసిన బ్యాంకింగ్, కన్స్యూమర్ షేర్లలో బలహీనత ఉన్నప్పటికీ ఐటీ, ఫార్మా, మెటల్ షేర్లలో ర్యాలీతో బెంచ్‌మార్క్ సూచీలు పుంజుకున్నాయి. ఎన్విడియా మెరుగైన ఫలితాలు ప్రకటించడంతో ప్రపంచ టెక్నాలజీ షేర్లలో సానుకూల సెంటిమెంట్ నెలకొనడం కూడా దేశీయ ఐటీ స్టాక్స్‌కు కలిసొచ్చింది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ చైర్మన్ కెవిన్ వార్ష్ ఈరోజు కీలక ప్రసంగం చేయనున్న నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. జాక్సన్ హోల్, వ్యోమింగ్‌లో జరుగుతున్న వార్షిక కాన్సాస్ సిటీ ఫెడ్ ఆర్థిక సదస్సులో వార్ష్ తొలిసారిగా ఫెడ్ చైర్మన్ హోదాలో కీలక ప్రసంగం చేయనున్నారు. అమెరికా ద్రవ్య విధానంపై ఆయన చేసే వ్యాఖ్యలపై మార్కెట్ వర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి. మరోవైపు ముడిచమురు ధరలు అధిక స్థాయిలో కొనసాగడం కూడా మార్కెట్ సెంటిమెంట్‌పై ప్రభావం చూపింది.330 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్‌శుక్రవారం బిఎస్ఇ సెన్సెక్స్ 330.92 పాయింట్లు లేదా 0.43 శాతం లాభపడి 77,264.51 వద్ద ముగిసింది. నిఫ్టీ 50 సూచీ 84.80 పాయింట్లు లేదా 0.35 శాతం పెరిగి 24,175.65 వద్ద స్థిరపడింది. అంతకుముందు రెండు సెషన్లలో సెన్సెక్స్ 0.93 శాతం, నిఫ్టీ 1 శాతం చొప్పున నష్టపోయాయి. బిఎస్ఇ 150 మిడ్‌క్యాప్ సూచీ 0.16 శాతం, బిఎస్ఇ 250 స్మాల్‌క్యాప్ సూచీ 0.33 శాతం చొప్పున లాభపడ్డాయి.మార్కెట్‌లో కొనుగోళ్ల జోరు కనిపించింది. బిఎస్ఇలో 2,385 షేర్లు లాభపడగా, 1,932 షేర్లు నష్టపోయాయి. మరో 248 షేర్లలో ఎలాంటి మార్పు లేదు. కమోడిటీ మార్కెట్లో అక్టోబర్ 2026 డెలివరీ బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 27 సెంట్లు తగ్గి 89.43 డాలర్లకు చేరింది.ఫారెక్స్ మార్కెట్లో రూపాయి స్వల్పంగా బలపడింది. గత సెషన్‌లో 95.4400 వద్ద ముగిసిన రూపాయి శుక్రవారం 95.4075 వద్ద కొనసాగింది. భారత్ 10 యేళ్ల బెంచ్‌మార్క్ ప్రభుత్వ బాండ్ రాబడి 6.851 శాతం నుంచి 6.916 శాతానికి పెరిగింది. ఎంసిఎక్స్‌లో అక్టోబర్ 5, 2026 డెలివరీ గోల్డ్ ఫ్యూచర్స్ 0.48 శాతం పెరిగి 10 గ్రాములకు రూ.1,59,765కు చేరాయి. టెంప్‌సెన్స్ ఇన్‌స్ట్రుమెంట్స్ భారీ లిస్టింగ్ షేరు శుక్రవారం బీఎస్ఈలో రూ.586.80 వద్ద ముగిసింది. ఇది ఇష్యూధర రూ.300తో పోలిస్తే 95.60 శాతం ప్రీమియం. స్టాక్ మార్కెట్‌లో రూ.631.20 వద్ద లిస్టయింది. ఇష్యూ ధరతో పోలిస్తే ఇది 110.4 శాతం ప్రీమియం. ఇంట్రాడేలో రూ.635 గరిష్ఠాన్ని, రూ.551.20 కనిష్ఠాన్ని తాకింది. బిఎస్ఇలో కంపెనీకి చెందిన 47.68 లక్షలకు పైగా షేర్లు చేతులు మారాయి. ఐటీ షేర్లలో భారీ ర్యాలీశుక్రవారం ఐటీ షేర్లు భారీగా లాభపడ్డాయి. నిఫ్టీ ఐటీ సూచీ 3.51 శాతం పెరిగింది. రంగాల వారీగా కోఫోర్జ్ 5.93 శాతం లాభంతో ముందంజలో నిలిచింది. ఎల్‌టీఐమైండ్‌ట్రీ 4.73 శాతం, టిసిఎస్ 4.16 శాతం, పర్సిస్టెంట్ సిస్టమ్స్ 3.91 శాతం, టెక్ మహీంద్రా 3.53 శాతం చొప్పున పెరిగాయి.ఇన్ఫోసిస్ 2.99 శాతం, ఒరాకిల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సాఫ్ట్‌వేర్ 2.83 శాతం, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ 2.66 శాతం, ఎంఫసిస్ 1.72 శాతం చొప్పున లాభపడ్డాయి.విప్రో షేరు 2.58 శాతం పెరిగింది. ఎంటర్‌ప్రైజ్‌స్థాయిలో ఏజెంటిక్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగాన్ని వేగవంతం చేసేందుకు గూగుల్ క్లౌడ్‌తో భాగస్వామ్యాన్ని విస్తరిస్తున్నట్లు కంపెనీ ప్రకటించడం ఇందుకు కారణం.తేజస్ నెట్‌వర్క్స్ షేరు 7.63 శాతం దూసుకెళ్లింది. బీఎస్ఎన్ఎల్ 4జీ మొబైల్ నెట్‌వర్క్ కోసం పరికరాల సరఫరాకు టీసీఎస్ నుంచి లెటర్ ఆఫ్ ఇంటెంట్ అందుకున్నట్లు తేజస్ నెట్‌వర్క్స్ వెల్లడించింది. ఈ వార్తల నేపథ్యంలో టిసిఎస్ షేరు కూడా 4.09 శాతం లాభపడింది.గ్రేట్ ఈస్టర్న్ షిప్పింగ్ బైబ్యాక్‌తో షేరు 1.70 శాతం పెరిగింది. ఓపెన్ మార్కెట్ మార్గంలో గరిష్ఠంగా రూ.1,530 ధరకు రూ.900 కోట్ల వరకు షేర్ల బైబ్యాక్ చేయడానికి కంపెనీ బోర్డు ఆమోదం తెలిపింది.

# 407% రిటర్న్‌లు తెచ్చిన 12 ఐపిఒలు

**ముంబయి,ఆ గస్టు 28:** భారతీయ ప్రైమరీ మార్కెట్లోకి కొత్తగా లిస్ట్ అయిన కంపెనీలు తమ ఇన్వెస్టర్లకు అద్భుతమైన లాభాలను అందిస్తున్నాయి. నిఫ్టీ ఐపిఒ ఇండెక్స్ 2415 పాయింట్ల వద్ద 52 వారాల గరిష్ఠ స్థాయిని తాకింది. ఈ నేపథ్యంలో గత ఏడాది కాలంలో మార్కెట్లోకి వచ్చిన 12 కంపెనీల ఐపిఒలు ఏకంగా 407 శాతం వరకు లాభాలు అందించింది మల్టీబ్యాగర్లుగా మారాయి. అందులో ఆదిత్య ఇన్ఫోటెక్, రూబికాన్ రీసెర్చ్ వంటి ప్రముఖ స్టాక్స్ ఉన్నాయి. ఈ యేడాదిలో ఇప్పటి వరకు 56 మెయిన్ బోర్డ్ ఐపిఒలు విజయవంతంగా పూర్తి కాగా ఆ కంపెనీ మొత్తంగా రూ.82,895 కోట్ల మేర మార్కెట్ నుంచి సమీకరించాయి. నిఫ్టీ 50 బెంచ్ మార్క్ ఇండెక్స్ హెచ్చుతగ్గులకు గురైనప్పటికీ, నిఫ్టీ ఐపిఒ ఇండెక్స్ మాత్రం 2415 ఇంట్రాడే పాయింట్లకు చేరుకుని 52 వారాల గరిష్టాలను నమోదు చేసింది. సీపీ ప్లస్ బ్రాండ్ మాతృ సంస్థ ఆదిత్య ఇన్ఫోటెక్ షేరు ధర రూ.675 ఆఫర్ ధరతో పోలిస్తే మార్కెట్లో బలమైన లాభాలతో ర్యాలీ తీసి అగ్రస్థానంలో నిలిచింది. గత కొద్ది నెలల్లో లిస్ట్ అయిన స్టాక్స్‌లో ఆదిత్య ఇన్ఫోటెక్ అగ్రస్థానంలో నిలిచింది. ఇష్యూ ధర రూ.675తో పోలిస్తే 407 శాతం మేర పెరిగింది. ఈ స్టాక్ 2025 ఆగస్టు 5వ తేదీన రూ.1018 వద్ద లిస్ట్ అయింది. ఇప్పుడు ఆగస్టు 24, 2026 నాటికి రూ.3419 వద్దకు చేరింది. రూబికాన్ రీసెర్చ్ కంపెనీ రెండో స్థానంలో ఉంది. ఐపిఒ ఇష్యూ ధర రూ.485తో పోలిస్తే 266 శాతం మేర రాబడి అందించింది. ఈ స్టాక్ 2025, అక్టోబర్ 16న రూ.620.10 వద్ద లిస్ట్ అయింది. ఆ తర్వాత ఇప్పుడు రూ.1776.10 వద్ద ట్రేడవుతోంది. ఓమ్నిటెక్ ఇంజనీరింగ్ కంపెనీ 162 శాతం లాభాలు అందించింది.

# జూలైలో పారిశ్రామిక ఉత్పత్తి వృద్ధి 6.7 శాతం



**న్యూఢిల్లీ, ఆగస్టు 28:** దేశ పారిశ్రామిక ఉత్పత్తి వృద్ధి జూలైలో వార్షిక ప్రాతిపదికన 6.7 శాతంగా నమోదైంది. మార్కెట్ అంచనా వేసిన 6 శాతం కంటే ఇది అధికం. శుక్రవారం విడుదలైన అధికారిక గణాంకాలు ఈ విషయాన్ని వెల్లడించాయి. జూన్‌లో తొలుత 7.3 శాతంగా నమోదైన పారిశ్రామిక ఉత్పత్తి వృద్ధి జూలైలో కొంత మందగించినప్పటికీ, జూన్ గణాంకాలను తాజాగా భారీగా సవరించి 8.8 శాతంగా నిర్ణయించారు.సవరించిన జూన్ గణాంకాలు పారిశ్రామిక రంగంలో వృద్ధి ఊహించిన దానికంటే బలంగా ఉన్నట్లు సూచిస్తున్నాయి. జూలైలో వృద్ధి వేగం కొంత తగ్గినా పారిశ్రామిక కార్యకలాపాలు ఆరోగ్యకరమైన స్థాయిలో కొనసాగినట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.పారిశ్రామిక ఉత్పత్తి సూచీలో అత్యధిక వాటా కలిగిన తయారీ రంగం జూలైలో ప్రధాన వృద్ధి చోదకంగా నిలిచింది. తయారీ ఉత్పత్తి వార్షిక ప్రాతిపదికన 7.3 శాతం పెరిగింది. జూన్‌లో ఈ వృద్ధి 7.8 శాతంగా ఉంది. మైనింగ్ ఉత్పత్తి 0.9 శాతం పెరగగా, నీటి సరఫరా ఉత్పత్తి 7.4 శాతం వృద్ధి చెందింది. జూన్‌లో మైనింగ్ వృద్ధి 1 శాతం, నీటి సరఫరా వృద్ధి 6.1 శాతంగా నమోదయ్యాయి. తయారీ రంగంతో పోలిస్తే మైనింగ్ రంగం వృద్ధి చాలా తక్కువగా ఉండటం వల్ల మొత్తం పారిశ్రామిక వృద్ధికి తయారీ రంగమే కీలక ఆధారంగా కొనసాగుతున్న విషయం వెల్లడవుతోంది. పెట్టుబడులకు సంబంధించిన కార్యకలాపాల్లోనూ బలమైన వృద్ధి కనిపించింది. జూలైలో క్యాపిటల్ గూడ్స్ ఉత్పత్తి 16.1 శాతం పెరిగింది. జూన్‌లో ఇది 14.2 శాతంగా ఉంది.ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ గూడ్స్ ఉత్పత్తి 6.9 శాతం, ఇంటర్మీడియట్ గూడ్స్ ఉత్పత్తి 10 శాతం పెరిగాయి. జూన్‌లో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ కన్‌స్ట్రక్షన్ గూడ్స్ ఉత్పత్తి 7.5 శాతం వృద్ధి చెందింది.వినియోగ వస్తువుల విభాగంలోనూ మిశ్రమ ఫలితాలు నమోదయ్యాయి. కన్స్యూమర్ డ్యూరబుల్స్ ఉత్పత్తి జూలైలో 10.5 శాతం పెరిగింది.

# ఆల్‌టైమ్ గరిష్టానికి ఫారెక్స్ ఖజానా



## 728.328 బిలియన్ డాలర్లకు చేరిక

**న్యూఢిల్లీ, ఆగస్టు 28:** భారత విదేశీ మారక నిల్వలు ఆల్ టైమ్ గరిష్ఠానికి చేరుకున్నాయి. ఆగస్టు 21తో ముగిసిన వారంలో దేశ ఫారెక్స్ నిల్వలు 12.422 బిలియన్ డాలర్లు పెరిగి 729.328 బిలియన్ డాలర్లకు చేరుకున్నట్లు రిజర్వ్ బ్యాంకు శుక్రవారం విడుదల చేసిన గణాంకాలు వెల్లడించాయి. అంతకుముందు వారంలోనూ ఫారెక్స్ నిల్వలు 9.905 బిలియన్ డాలర్లు పెరిగి 716.907 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. తాజా పెరుగుదలతో ఈ యేడాది ఫిబ్రవరి 27తో ముగిసిన వారంలో నమోదైన 728.494 బిలియన్ డాలర్ల రికార్డు బద్దలైంది. మధ్యప్రాచ్యంలో ఘర్షణలు ప్రారంభమైన అనంతరం భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు పెరగడంతో రూపాయి విలువపై ఒత్తిడి ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఆర్‌బిఐ విదేశీ మారక మార్కెట్‌లో జోక్యం చేసుకుంటూ డాలర్ల విక్రయాలు చేపట్టడంతో ఫారెక్స్ నిల్వలు వరుసగా కొన్ని వారాలపాటుతగ్గాయి. తాజాగా పరిస్థితులు మెరుగుపడటంతో నిల్వలు మళ్లీ రికార్డు స్థాయికి చేరుకున్నాయి.9.482 బిలియన్ డాలర్లు పెరిగిన ఎఫ్‌సీఎఫారెక్స్ నిల్వల్లో ప్రధాన భాగమైన విదేశీ కరెన్సీ ఆస్తులు (ఎఫ్‌సీఏ) ఈ వారంలో 9.482 బిలియన్ డాలర్లు పెరిగి 591.333 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి.డాలర్లలో లెక్కించే ఎఫ్‌సిఎ విలువలో యూరో, పౌండ్, యెన్ వంటి అమెరికాయేతర కరెన్సీల విలువల్లో చోటుచేసుకునే పెరుగుదల లేదా తగ్గుదల ప్రభావం కూడా ఉంటుంది. బంగారం నిల్వల్లోనూ భారీ పెరుగుదదేశ బంగారం నిల్వల విలువ కూడా ఈ వారంలో 2.801 బిలియన్ డాలర్లు పెరిగి 114.218 బిలియన్ డాలర్లకు చేరుకుంది. అంతర్జాతీయ ద్రవ్య నిధి వద్ద భారత రిజర్వ్ పొజిషన్ 26 మిలియన్ డాలర్లు పెరిగి 4.925 బిలియన్ డాలర్లకు చేరుకుంది.ఇక ప్రత్యేక డ్రాయింగ్ రైట్స్ 112 మిలియన్ డాలర్లు పెరిగి 18.852 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. దేశంలోకి విదేశీ మారక ప్రవాహాలను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం, ఆర్‌బీఐ గత నెలలో పలుచర్యలు చేపట్టాయి. ఇందులో ఎఫ్‌సీఎన్ఆర్ (బీ) డిపాజిట్లకు సంబంధించిన చర్యలు కూడా ఉన్నాయి.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14